PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 203 | విజయవాడ, సోమవారం 24 ఫిబ్రవరి 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50
Vol No | Vijayawada, Monday 24 February 2025 | Rs

ఆరోగ్యం ప్రాథమిక హక్కు

- బీమా పేరిట తప్పుకుంటున్న ప్రభుత్వం
- 'ప్రజారోగ్య వేదిక' సదస్సులో సుజాతరావు, పివి రమేష్
- ఆరోగ్య భద్రతపై చట్టం చేయాలని తీర్మానం

3

దాశరథి, ఆరుద్ర నేటి తరానికి ఆదర్శం

3

- తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటమే వారికి స్ఫూర్తి
- సాహిత్య సమాలోచన సదస్సులో వక్తలు

గందరగోళం నెలకొన్నా..

గ్రూప్ 2 పరీక్షకు 92 % హాజరు

విజయవాడలోని మారిస్ స్టెల్లా కాలేజీలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రం వద్ద క్యూ కట్టిన అభ్యర్థులు

ప్రజాశక్తి - యంత్రాంగం

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎపిపిఎస్‌సి) ఆదివారం నిర్వహించిన గ్రూప్ 2 పరీక్ష స్వల్ప ఘటనలు మినహా రాష్ట్రవ్యాప్తంగా ప్రశాంతంగా జరిగింది. రోస్టర్ పాయింట్ల విషయంలో లోటుపాట్లు, ప్రభుత్వ తప్పిదాలు, పరీక్ష వాయిదాపై లీకులు నేపథ్యంలో తీవ్ర గందరగోళ పరిస్థితులు నెలకొన్నా కూడా నిరుద్యోగులు పరీక్షకు పెద్ద సంఖ్యలో హాజరుకావడం గమనార్హం. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్న దరిమిలా గ్రూప్ 2 పరీక్ష విషయంలో నెలకొన్న గందరగోళాన్ని తనకు అనుకూలంగా మల్చుకోవాలని అధికార టిడిపి నేతలు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. అయోమయ పరిస్థితులు ఏర్పడినా పెద్ద సంఖ్యలో అభ్యర్థులు హాజరుకావడం రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్రతను ప్రతిబింబించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన ఎపిపిఎస్‌సి గ్రూప్ 2 పరీక్షలకు 92 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఒకట్రెండు కేంద్రాలు మినహా దాదాపు అన్ని కేంద్రాల్లోనూ పరీక్ష సజావుగా సాగింది. ఈ పరీక్షలకు 92,250 మంది దరఖాస్తు చేసుకోగా ..86,459 మంది హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకున్నారు. వీరిలో 92 శాతం మంది పరీక్షలకు హాజరయ్యారని ఎపిపిఎస్‌సి పేర్కొంది. ఈ పరీక్షలు వాయిదా వేస్తామంటూ అధికార పార్టీ నుంచి శనివారం లీకులొచ్చాయి. ఆదివారం ఉదయం పరీక్షా కేంద్రానికి వెళ్లే వరకూ పరీక్ష నిర్వహిస్తారో లేదోనన్న ఆందోళనే అత్యధిక మంది అభ్యర్థులను ఒత్తిడికి గురి చేసింది. ఈ గందరగోళ పరిస్థితులు ఒకవైపు కొనసాగుతుండగానే..ఎపిపిఎస్‌సి ఇదివరకు ఇచ్చిన షెడ్యూల్ ప్రకారమే పరీక్షలు నిర్వహించింది. ఈ పరిణామాలతో పలుచోట్ల అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

విశాఖలో భారీ బందోబస్తు

విశాఖ జిల్లాలో గత మూడు రోజులుగా గ్రూప్ 2 అభ్యర్థుల వరుస నిరసనలు, ఇతర పరిణామాల దృష్ట్యా అధికార యంత్రాంగం పరీక్షా కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేసింది. సమస్యాత్మక పరీక్షా కేంద్రాల వద్ద అధికారులు డ్రోన్లతో పర్యవేక్షణ చేపట్టారు. పోలీస్ కమిషనర్ కార్యాలయంలో అన్ని పరీక్షా కేంద్రాలను కెమెరాలతో అనుసంధానం చేసి డ్యాష్ బోర్డుతో కూడిన కంట్రోల్ రూమును అందుబాటులోకి తెచ్చారు. విశాఖ నగరం పరిధిలోని కొమ్మాది చైతన్య ఇంజనీరింగ్ కళాశాల పరీక్షా కేంద్రంలో ఒక అభ్యర్థి బిపి తగ్గటంతో అస్వస్థతకు గురయ్యారు. అధికారులు వెంటనే స్పందించి పోలీసు భద్రత నడుమ సమీపంలోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లలోని వెంకటేశ్వర ఇంజనీర్ కళాశాలకు వికలాంగుడు పరీక్షలు రాసేందుకు వచ్చారు పరీక్షా కేంద్రం వద్దకు ఆయన చేరేందుకు పోలసులు సహాయ, సహకారాలు అందించారు.

శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లలోని పరీక్ష కేంద్రం వద్ద వికలాంగ అభ్యర్థికి సహకరిస్తున్న పోలీసులు

పెళ్లి బట్టలతోనే ..

ఒకవైపు కష్టపడి చదువుకున్న గ్రూప్-2...మరోవైపు ఇష్టపడి చేసుకుంటున్న పెళ్లి. ఇనాళ్లూ చదివిన చదువుకు ఆటంకం కలగకూడదని భావించి ఆ నవ వధువు వివాహం పూర్తి కాగానే అవే దుస్తులతో పరీక్ష కేంద్రానికి హాజరయ్యారు. ఆమెతో పాటు వచ్చిన కుటుంబసభ్యులు కూడా ఆల్ ది బెస్ట్ చెబుతూ పరీక్షా కేంద్రంలోకి సాగనంపారు.

చిత్తూరుకు చెందిన మమత గ్రూప్-2 మెయిన్స్ పరీక్షకు సన్నద్ధమయ్యారు. పెళ్లి తేదీ, పరీక్ష తేదీ ఒకేరోజు రావడంతో కాస్త ఇబ్బంది పడ్డారు. అయితే పరీక్షను రాసేందుకు తమ కుటుంబసభ్యులను మమత ఒప్పించారు. ఉదయం ఆరు గంటలకు పెళ్లి పూర్తివ్వగానే నేరుగా పరీక్ష కేంద్రం తిరుపతి పద్మావతి డిగ్రీ కళాశాల వద్దకు చేరుకున్నారు. తలపై జీలకర్ర బెల్లం, పెళ్లి బట్టలతో పరీక్షకు హాజరయ్యారు.

ప్రాథమిక కీ విడుదల

గ్రూప్-2 మెయిన్స్‌పరీక్షల ప్రాథమిక కీ ని ఎపిపిఎస్‌సి విడుదల చేసింది. ప్రాథమిక కీ పై ఏమైనా అభ్యంతరాలుంటే ఎపిపిఎస్‌సి వెబ్‌సైట్ psc.ap.gov.in ద్వారా అభ్యంతరాలు తెలియజేయవచ్చునని ఎపిపిఎస్‌సి పేర్కొంది. ఈ నెల 25 నుంచి 27 వరకు ఆన్‌లైన్ ద్వారా అభ్యంతరాలు తెలియజేవచ్చునని సూచించింది. పోస్టు, వాట్సాఫ్, ఎస్ఎంఎస్ అభ్యంతరాలు తీసుకోబోమని స్పష్టం చేసింది.

నిరుద్యోగుల జీవితాలతో

ఆటలాడొద్దు

- చర్చలు జరిపి సమస్య పరిష్కరించాలి
- సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రూపు -2 మెయిన్స్‌పరీక్షల విషయంలో అభ్యర్థులు లేవనెత్తిన సమస్యలు పరిష్కరించకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ ఖండించింది.

ఇప్పటికైనా వారితో చర్చించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు ఒక ప్రకటన విడుదల చేశారు. గత కొద్ది రోజులుగా గ్రూప్-2 మెయిన్ పరీక్షలు వాయిదా వేసి రోస్టర్ పాయింట్స్‌లో జరిగిన లోటు పాట్లను సరిదిద్దాలని నిరుద్యోగులు ఆందోళన చేస్తున్నారని, వారిని చర్చలకు పిలిచి సమస్యను పరిష్కరించాల్సిన ప్రభుత్వం కోచింగ్ సెంటర్ల మీద, ఆందోళనల్లో ఉన్న నిరుద్యోగుల మీద తప్పుడు ప్రచారానికి దిగడం గర్హనీయమన్నారు. పరీక్షలు వాయిదా వేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు తొలుత లీకులిచ్చి నిరుద్యోగులను భ్రమల్లో పెట్టి రాజకీయ లబ్దిపొందాలని చూడడం దుర్మార్గమన్నారు. ఏదో ఒక రకంగా న్యాయ వివాదంలో దించి రిక్రూట్‌మెంట్ ఆపాలని రాష్ట్ర ప్రభుత్వం చూస్తోందని, మెగా డిఎస్‌సిని వాయిదా వేస్తున్న తీరు కూడా దీన్ని బలపరుస్తుందని వి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం రోస్టర్ విషయంలో జరిగిన లోటుపాట్లు సరిదిద్దేందుకు నిరుద్యోగులతో చర్చించాలని, ప్రతిష్టకు పోకుండా న్యాయ నిపుణులతో, విద్యావేత్తలు, మేధావులతో చర్చించి ఈ సమస్యను పరిష్కరించాలని సిపిఎం డిమాండ్ చేస్తోందన్నారు.

సెమీస్‌కు భారత్

- కోహ్లి సెంచరీ, శ్రేయస్ అర్ధసెంచరీ
- పాకిస్తాన్‌పై టీమిండియా అలవోక విజయం

ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ విరాట్ కోహ్లి (100నాటౌట్ : 111బంతుల్లో 7ఫోర్లు)

దుబాయ్: ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీ సెమీఫైనల్లోకి భారతజట్టు దూసుకెళ్లింది. దుబాయ్ ఇంటర్నేషనల్ స్టేడియంలో పాకిస్తాన్‌తో ఆదివారం జరిగిన రెండో లీగ్ మ్యాచ్‌లో భారత్ ఘన విజయం సాధించింది. పాకిస్తాన్ నిర్దేశించిన 242పరుగుల లక్ష్యాన్ని టీమిండియా 42.3ఓవర్లలో కేవలం 4వికెట్లు కోల్పోయి ఛేదించింది. టీమిండియా రన్ మెషిన్ విరాట్ కోహ్లి(100నాటౌట్) సెంచరీకి తోడు శ్రేయస్ అయ్యర్(56) అర్ధసెంచరీతో మెరిసారు. వీరిద్దరూ మూడో వికెట్ 114పరుగుల భాగస్వామ్యాన్ని నిర్మించి భారతజట్టు గెలుపులో కీలకపాత్ర పోషించారు. అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన పాకిస్తాన్‌ను భారత బౌలర్లు కుల్దీప్(3/40), హార్దిక్(2/31) కట్టడి చేశాడు. దీంతో పాకిస్తాన్ జట్టు 49.4ఓవర్లలో 241పరుగులకే కుప్పకూలింది. షౌద్ షకీల్(62), రిజ్వాన్(46) మాత్రమే బ్యాటింగ్‌లో రాణించారు. దీంతో గ్రూప్-ఎ నుంచి భారతజట్టు సెమీస్‌కు చేరుకోగా.. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన పాకిస్తాన్ జట్టు వరుసగా రెండో ఓటమితో లీగ్ దశలోనే నిష్క్రమించింది. ఇక విరాట్ కోహ్లి వన్డేల్లో 51వ సెంచరీ పూర్తిచేసుకొని దిగ్గజ క్రికెటర్ సచిన్ టెండూల్కర్(51సెంచరీలు) రికార్డును సమం చేశాడు. అలాగే వేగంగా 14వేల పరుగులు, అత్యధిక క్యాచ్‌లు పట్టిన రికార్డులను తన పేర లిఖించుకున్నాడు.

కోహ్లి ఖాతాలో పలు రికార్డు...

పాకిస్తాన్‌తో జరిగిన మ్యాచ్‌లో సెంచరీ కొట్టిన కోహ్లి పలు రికార్డులను తన పేర లిఖించుకున్నాడు. 287 ఇన్నింగ్స్‌లోనే అత్యంత వేగంగా 14వేల పరుగులు పూర్తి చేసుకున్న తొలి బ్యాటర్‌గా రికార్డుపుటల్లోకెక్కాడు. వ్యక్తిగత స్కోర్ 15పరుగుల వద్ద కోహ్లి 14వేల పరుగుల మార్క్‌ను చేరుకున్నాడు. ఈ క్రమంలో సచిన్ టెండూల్కర్(350ఇన్నింగ్స్), సంగక్కర(378)లను అధిగమించాడు. ఇక వన్డేల్లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్లు సచిన్ (452ఇన్నింగ్స్‌లో 18,246పరుగులు), సంగక్కర (402 ఇన్నింగ్స్‌లో 14,234పరుగులు) తర్వాత స్థానంలో కోహ్లి నిలిచాడు. అలాగే పాకిస్తాన్‌తో జరిగిన మ్యాచ్‌లో రెండు క్యాచ్‌లు అందుకున్న కోహ్లి(158), మహ్మద్ అజారుద్దీన్(156 క్యాచ్‌లు) రికార్డును అధిగమించాడు.

నేటి నుంచి అసెంబ్లీ

- ఉదయం 10 గంటలకు గవర్నర్ ప్రసంగంతో ప్రారంభం
- మొదటి రోజు వైసిపి హాజరయ్యే అవకాశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

శాసనసభ బడ్జెట్ సమావేశాలు సోమవారం ప్రారంభంకానున్నాయి. తొలిరోజు ఉదయం 10 గంటలకు ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ ప్రసంగించనున్నారు. ఈ సారి సమావేశాలకు భారీ భద్రతను ఏర్పాటు చేయనున్నారు. గవర్నర్ ప్రసంగం నేపథ్యంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో కలుపుకుని 11మంది సభ్యులు శాసనసభ సమావేశానికి హాజరు కానున్నట్లు సమాచారం. టిడిపిసభ్యులందరూ పసుపు షర్టులు, మహిళలు పసుపు చీరెలు ధరించి సమావేశాలకు రానున్నారు. ఉదయం 9.45గంటలకు సిఎం చంద్రబాబు నాయుడు శాసనసభలోకి ప్రవేశించనున్నారు. గవర్నర్ ప్రసంగంలో 2047 విజన్‌కు సంబంధించిన అంశాలను వివరంగా పేర్కొనే అవకాశముంది. శాసనసభ, శాసనమండలిలో సభ్యులు ఎలా వ్యవహరించాలనే అనే అంశంపై జనసేన అధ్యక్షుడు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ అధ్యక్షతన ఆదివారం సాయంత్రం మంగళగిరి పార్టీ కార్యాలయంలో విధి విధానాలు వివరించారు. సమావేశ ఏర్పాట్లకు సంబంధించి ఆదివారం స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణమరాజు, సిఎస్ విజయానంద్, డిజిపి హరీష్‌కుమార్‌గుప్తాతో సమావేశం నిర్వహించారు. గవర్నర్ ప్రసంగం తొలిరోజు ఉన్న నేపథ్యంలో సభ్యులందరూ ఉదయం 9.30గంటల కల్లా సభ్యులందరూ సభకు హాజరుకావాల్సిఉంటుందని శాసనసభ స్పీకర్ తెలిపారు. ఎమ్మెల్యేల వ్యక్తిగత సహాయకులు, అధికారుల వ్యక్తిగత సహాయకుల (పిఎ)కు అసెంబ్లీలోకి ప్రవేశం ఉండదని ఈ విషయంలో సభ్యులు సహకరించాలని స్పీకర్ విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రిని కలిసే సందర్శకులు, ప్రతినిధులు శాసనసభ ప్రాంగణంలో అనుమతించరు. సిఎంను కలవాలనుకునే వారు సిఎం కార్యాలయంలోనే భేటీ కావాల్సి ఉంటుంది. శాసనసభ భద్రతపై ప్రత్యేక దృష్టిపెట్టాలని పోలీస్‌శాఖను స్పీకర్ ఆదేశించారు.

1200మంది పోలీసులతో భద్రత:

శాసనసభ సమావేశాల నేపథ్యంలో అసెంబ్లీకి సంబంధించి 1200మంది పోలీసులతో భద్రత ఏర్పాటు చేస్తున్నారు. గుంటూరు డిఐజితో పాటు గుంటూరు, పల్నాడు ఎస్‌పిలు, విజయవాడ నుంచి ఒకరిద్దరు డిసిపిలు, 10మంది డిఎస్‌పిలు, 50మంది సిఐలు, 100మంది ఎస్‌ఐలతో పాటు సుమారు 1000మందికి పైగా కానిస్టేబుల్స్ విధులు నిర్వహించనున్నారు.

విజయవాడలో10న అంగన్‌వాడీ ఉద్యోగుల మహా ధర్నా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మార్చి 10వ తేదీన విజయవాడలో మహాధర్నా నిర్వహించనున్నట్లు అంగన్‌వాడీ ఉద్యోగుల సంఘాలు తెలిపాయి. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ, ఉపాధ్యక్షులు ఎన్‌సిహెచ్ సుప్రజ, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఎఐటియుసి) రాష్ట్ర అధ్యక్షులు ఎస్.మంజుల, నాయకులు విజయదుర్గ, ఎపి ప్రగతిశీల అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (ఐఎఫ్‌టియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విఆర్ జ్యోతి, పి.భారతి ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. అంగన్‌వాడీ ఉద్యోగుల వేతనాలు పెంచాలని, గ్రాట్యూటీ అమలు చేయాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చుతూ జిఓలివ్వాలని, సంక్షేమ పథకాలను అమలు చేయాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విజయవాడలో మహా ధర్నా నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు.

ప్యాకేజీ నిధులు విశాఖ ఉక్కుకే ఖర్చు చేయాలి

- మార్చి 14న రాష్ట్ర వ్యాప్తంగా కార్మికులకు సంఘీభావంగా కార్యక్రమాలు
- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట ఐక్యవేదిక రౌండ్‌టేబుల్

సమావేశంలో మాట్లాడుతున్న వడ్డే శోభనాద్రీశ్వరరావు, వేదిక పై శ్రీనివాసరావు, రామకృష్ణ, చలసాని తదితరులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ఆదుకునేందుకు కేంద్రం ప్రకటించిన ప్యాకేజీ రూ.11,440కోట్లను స్టీల్‌ప్లాంట్ నిర్వహణ, ప్లాంట్ ఉత్పత్తికి అవసరమైన ముడి సరుకు కొనుగోలు, మెయింటెన్స్, ఉద్యోగుల శ్రేయస్సుకు మాత్రమే వినియోగించాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట ఐక్య వేదిక ఆధ్వర్యాన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానించింది. విజయవాడ ఎంబివికెలో ఆదివారం ఈ సమావేశానికి సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.ఉమామహేశ్వరరావు, ఎఐటియుసి వర్కింగ్ ప్రెసిడెంట్ సిహెచ్‌వి రామారావు అధ్యక్షత వహించారు. సమావేశం పలు తీర్మానాలు చేసింది. ప్యాకేజీ నిధులను స్టీల్‌ప్లాంట్ నిర్వహణకు మాత్రమే ఉపయోగిస్తామని శాసనసభ తీర్మానం చేయాలని విశాఖ స్టీల్ ప్లాంట్ సమస్య శాశ్వత పరిష్కారానికి సొంత గనులు కేటాయించాలని, ప్రకాశం జిల్లాలోని ఐరన్‌ఓర్ నిక్షేపాలను కూడా కేటాయించాలని కూడా రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానించింది. వీటితో పాటు విశాఖ ఉక్కును కాపాడుకునేందుకు కార్మికులకు సంఘీభావంగా మార్చి 14న అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసనలు, ర్యాలీలు నిర్వహించాలని, ఈ కార్యక్రమాలకు అన్ని ట్రేడ్ యూనియన్లు, ప్రజాసంఘాలు, వామపక్షాలు, విద్యార్థులు,మేధావులు మద్దతు తెలపాలని కూడా సమావేశం విజ్ఞప్తి చేసింది.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కేంద్రం ప్రకటించిన ప్యాకేజీ తాత్కాలిక ఉపశమనమే కాని సమస్య పూర్తిగా పరిష్కారం కాదన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు అనుకూలంగా కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నట్లు పార్లమెంట్‌లో బిల్లు పెట్టి ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. తక్షణమే స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని, శాశ్వత కార్మికులు, కాంట్రాక్టు కార్మికుల తొలగింపును నిలుపదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ ప్రధాని మోడీ రాష్ట్రానికి చేసే మోసం గురించి ప్రధాన రాజకీయపార్టీలు ప్రశ్నించకుండా ఆయనకు దాసోహం అన్నట్లు వ్యవహరిస్తున్నారన్నారని ఆయన విమర్శించారు. కేంద్ర హోమ్‌శాఖ మంత్రి అమిత్‌షా రాష్ట్ర పర్యటన సందర్భంగా మూడు నెలల్లో రూ.7లక్షల కోట్లు రాష్ట్రానికి ఇచ్చామని అబద్ధాలు చెబుతున్నా సిఎం చంద్రబాబు, వైసిపి అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎందుకు ఖండించడంలేదని ఆయన ప్రశ్నించారు. మాజీ మంత్రి ,రైతు సంఘం నాయకులు వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ రక్షణకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. ప్లాంట్ పూర్తి సామర్థ్యంతో నడిపేందుకు మిగతా 7లో

సన్నగిల్లుతున్న ఆశలు

- సొరంగంలో మట్టి, నీరు చేరికతో సహాయక చర్యలకు ఆటంకం
- టన్నెల్ బోర్ మిషన్ వరకూ చేరుకున్న రెస్క్యూ టీం
- చిక్కుకున్న వారిని కాపాడేందుకు మరో సొరంగ మార్గం

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

నాగర్ కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం దోమలపెంట సమీపంలోని శ్రీశైలం ఎడమ గట్టు కాలువ (ఎస్ఎల్‌బిసి) టన్నెల్‌లో చిక్కుకున్న వారి పరిస్థితిపై తీవ్ర ఆందోళన నెలకొంది. ఆశలు సన్నగిల్లుతున్నాయి. సొరంగంలో మట్టి, నీరు భారీగా చేరడంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోంది. అయినా, టన్నెల్ బోర్ మిషన్ వరకు సహాయక బృందాలు చేరుకున్నాయి. చిక్కుకున్న వారిని కాపాడేందుకు వేరే సొరంగ మార్గం ఏర్పాటు చేస్తున్నారు. కృష్ణా నది నుంచి మన్నెవారిపల్లి వరకు ఏర్పాటు చేస్తున్న సొరంగం పనుల్లో టన్నెల్ కూలిపోవడంతో ఇద్దరు ఇంజనీర్లు, ఇద్దరు ఆపరేటర్లు, నలుగురు కార్మికులు చిక్కుకున్న సంగతి తెలిసిందే. మట్టిలో కూరుకుపోయినా వారిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చేందుకు ఎన్‌డిఆర్ఎఫ్, ఆర్మీ, సింగరేణి రెస్క్యూ టీమ్, హైడ్రా తదితర సిబ్బంది గత 36 గంటలుగా అవిశ్రాంతంగా శ్రమిస్తున్నాయి. లోపల చిక్కుకున్న వారి ప్రాణాలను కాపాడేందుకు రక్షణ చర్యలు చేపట్టారు. టన్నెల్ కూలడంతో ఆక్సిజన్ పైపులు ధ్వంసమయ్యాయి. దీంతో, సొరంగంలో ఇరుక్కున్న బాధితులకు శ్వాస తీసుకోవడం కష్టమని తెలుస్తోంది. ఘటనా స్థలానికి చేరుకున్న మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ దిశానిర్దేశం చేస్తున్నారు.

లోకో ట్రైన్‌లో సొరంగంలోకి వెళ్లిన మంత్రి జూపల్లి

ఎన్‌డిఆర్ఎఫ్, సైనిక బృందాలతోపాటు మంత్రి జూపల్లి కృష్ణారావు కూడా లోకో ట్రైన్‌లో సొరంగంలోకి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సొరంగం లోపలికి ఆక్సిజన్ పంపుతున్నామని, వాటర్ తోడేసే పనులు నిరంతరం సాగుతున్నాయని తెలిపారు. రెస్క్యూ టీములు రాత్రి నుంచి అక్కడే పని చేస్తున్నాయని చెప్పారు. కూలిన మట్టి, నీరు చేరడంతో సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడుతోందని తెలిపారు. వాటిని తొలగించేందుకు సహాయక బృందాలు శ్రమిస్తున్నాయని చెప్పారు. ఇప్పటికే టన్నెల్ బోర్ మిషన్ వరకూ సహాయక బృందాలు చేరుకున్నాయని తెలిపారు.



సొరంగంలో సహాయక చర్యలు చేపడుతున్న ఎన్‌డిఆర్ఎఫ్

గత ప్రభుత్వ నిర్వహణ లోపం వల్లే : మంత్రి ఉత్తమ్

పాలకుల నిర్లక్ష్యం వల్ల సొరంగం పనులు 20 ఏళ్లయినా పూర్తి కాలేదని తెలంగాణ సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల కాలంలో ఈ ప్రాజెక్టు కోసం బడ్జెట్‌లో ఒక్క రూపాయి ఖర్చు పెట్టలేదన్నారు..రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత బడ్జెట్లో మిగతా 2లో

కాకినాడ పోర్టు సమీపంలో రేషన్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి- కాకినాడ



పిడిఎస్ బియ్యాన్ని కాకినాడ పోర్ట్ సమీపంలో అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నాలుగు లారీలను సీజ్ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21న పోర్టు సమీపంలోని బొంబే కాటా గేటు వద్ద నాలుగు లారీల్లో ఉన్న 92 మెట్రిక్ టన్నుల పిడిఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామని, బియ్యాన్ని తరలిస్తున్న లారీలను సీజ్ చేసి 6ఎ కేసులు నమోదు చేశామని వివరించారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని గోదాముకు తరలించినట్లు తెలిపారు. ప్రస్తుతం దొరికిన రేషన్ బియ్యం వాహనాల యజమానులపైనా, సంబంధిత వ్యాపారులపైనా కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కాగా, గతంలో కాకినాడ పోర్టులో పిడిఎఫ్ బియ్యం పట్టుబడడం, ఇది పెద్ద ఎత్తున చర్చకు దారితీయడం తెలిసిందే.

రైతులతో చర్చలు విఫలం

- ఎంఎస్‌పి చట్టభద్రతకు అన్నదాతల డిమాండ్
- 19న మరోసారి భేటీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రైతులు, కేంద్ర మంత్రుల మధ్య రెండో విడత చర్చలు ఎటువంటి పరిష్కారం చూపకుండానే ముగిశాయి. పంజాబ్, హర్యానా సరిహద్దుల్లో రైతుల ఆందోళన కొనసాగుతోంది. మూడో విడత చర్చలు మార్చి 19న జరగనున్నాయి. చండీగఢ్‌లోని మహాత్మా గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ భవన్‌లో దాదాపు మూడు గంటల పాటు చర్చలు జరిగాయి. కేంద్ర మంత్రులు మరో రెండు పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) వర్తింపజేయడానికి అంగీకరించినట్లు సమాచారం. రైతు నేతలు నోటిపై చేయబడిన 23 పంటలకు ఎంఎస్‌పి కోసం డిమాండ్ చేస్తున్నారు. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, ఇతర మంత్రులు... నిరాహార దీక్ష విరమించాలని దల్లేవాల్‌ను కోరారు. అన్ని పంటలపై ఎంఎస్‌పికి చట్టపరమైన హామీ లభించే వరకు తన నిరసనను కొనసాగిస్తానని దల్లేవాల్ మరోసారి ప్రకటించారు. సి 2 ప్లస్ 50 శాతం ప్రకారం కనీస మద్దతు ధరకు చట్టం చేయాలని, ఆ ప్రాతిపదికన ఏడాదికి రూ.25 వేల కోట్ల నుంచి రూ.30 వేల కోట్లు కేటాయించాలని, ఆ మొత్తం కేటాయించడం పెద్ద సమస్య కాదని రైతు నేతలు స్పష్టం చేశారు.

రైతు నాయకులు వివిధ పంటల సేకరణ పరిమాణాలు, కొనుగోలు ధరలు, మార్కెట్ ధరలపై వివరాలను, తమ డిమాండ్లకు మద్దతు ఇచ్చే గణాంకాలు, పత్రాలను సమావేశం ముందుంచారు. రైతులు పేర్కొన్న గణాంకాలకు, కేంద్ర ప్రభుత్వం వద్ద ఉన్న గణాంకాలకు మధ్య వ్యత్యాసాలున్నాయి. "దీనిని పరిష్కరించడానికి కేంద్ర సంస్థలు రైతుల నుండి డేటాను సేకరించాలని నిర్ణయించాయి. మార్చి 19న జరిగే తదుపరి సమావేశంలో మరిన్ని చర్చలు జరుగుతాయి" అని శివరాజ్‌సింగ్ చౌహాన్ అన్నారు. పంజాబ్ ఆర్థిక మంత్రి హర్పాల్ సింగ్ చీమా మాట్లాడుతూ చర్చ ప్రధానంగా ఎంఎస్‌పికి చట్టపరమైన హామీపైనే జరిగిందన్నారు. చర్చల్లో కేంద్ర ప్రభుత్వం తరపున శివరాజ్ సింగ్ చౌహాన్, వాణిజ్య శాఖ మంత్రి పియూష్ గోయల్, వినియోగదారుల వ్యవహారాల, ఆహార పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి, పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వం తరపున రాష్ట్ర ఆర్థిక మంత్రి హర్పాల్ సింగ్ చీమా, వ్యవసాయ శాఖ మంత్రి గుర్మీత్ ఖుడియన్, ఆహార, వినియోగదారుల వ్యవహారాల మంత్రి లాల్ చంద్ కటారుచక్, రైతు నేత జగ్జిత్ దల్లేవాల్, సర్వాన్ సింగ్ పాంధర్‌తో సహా 28 మంది రైతు నాయకులు హాజరయ్యారు.

పుట్టపర్తిలో కదలని చెత్త వాహనాలు..!

- ఎమ్మెల్యే ఆదేశాలు బేఖాతరు
- మరమ్మతులపై దృష్టి పెట్టని మున్సిపల్ అధికారులు

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

పుట్టపర్తిలో మున్సిపల్ కార్మికులు చెత్త సేకరించడానికి అష్టకష్టాలు పడుతున్నారు. ఈ నెల 15వ తేదీ జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి రెండు రోజుల్లో వాహనాలకు మరమ్మతులు చేయించాలని ఆదేశాలు జారీ చేశారు. అయినా మున్సిపల్ కమిషనర్ ఇంతవరకూ మరమ్మతులు చేయించక పోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 2 కాంపాక్ట్ వెహికల్స్‌తో పాటు, 10 స్వచ్ఛభారత్ ఎలక్ట్రికల్ వాహనాలు కదలక మూలకు చేరాయి. వాటికి చిన్న చిన్న మరమ్మతులు చేయిస్తే వినియోగంలోకి వస్తాయని పారిశుధ్య కార్మికులు వాపోతున్నారు. కాంపాక్ట్ వెహికల్స్‌కు రూ. 2 లక్షలు వెచ్చిస్తే వినియోగంలోకి రానున్నాయి. స్వచ్ఛభారత్ ఎలక్ట్రికల్ వాహనాలకు ఇంజినాయిల్ మారిస్తే వాడుకలోకి రానున్నాయి. కానీ దీనికి బదులు 4 ట్రాక్టర్లను పెట్టి చెత్తను తరలిస్తున్నారు. ఈ ట్రాక్టర్లలో చెత్తను తరలించ డానికి 8 మంది కార్మికులు అవసరమవుతారు. అదే కాంపాక్ట్ వెహికల్స్ వాడుకలోకి వస్తే ఇద్దరు కార్మికులతో చెత్తను తరలించవచ్చని పారిశుధ్య కార్మికులు పేర్కొంటున్నారు. కానీ వీటికి మరమ్మతులు చేయించకుండా కాలయాపన చేస్తుండడం దారుణమంటున్నారు. రెండు రోజుల్లో వాహనాల మరమ్మతులు చేయించాలని ఎమ్మెల్యే ఆదేశించినా మున్సిపల్ కమిషనర్ పెడచెవిన పెట్టడం శోచనీయం. ఇకనైనా మున్సిపాలిటీ అధికారులు స్పందించి చెత్త వాహనాలను వినియోగంలోకి తీసుకురావాలని పారిశుధ్య కార్మికులు, ప్రజలు కోరుతున్నారు.

పాక్-బంగ్లా మధ్య ప్రత్యక్ష వాణిజ్యం

- ఐదు దశాబ్దాల తరువాత దగ్గరవుతున్న దేశాలు

ఢాకా : షేక్ హసీనా పదవి కోల్పోయిన తర్వాత యూనస్ నేతృత్వంలోని బంగ్లాదేశ్ విదేశాంగ విధానంలో మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. భారత్‌కు దూరం జరుగుతూ పాకిస్తాన్ అనుకూల వైఖరిని ప్రదర్శిస్తోంది. ఈ క్రమంలోనే రెండు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు బలోపేతం అవుతున్నాయి. 1971లో పాక్, బంగ్లాదేశ్‌లు విడిపోయిన తర్వాత మళ్లీ తొలిసారిగా ప్రత్యక్ష వాణిజ్యాన్ని పునఃప్రారంభించాయి. ఇందులో భాగంగా మొదటి కార్గో నౌక కరాచీలోని పోర్ట్ ఖాసిమ్ నుంచి ఢాకాకు బయలుదేరినట్లు అధికారులు తెలిపారు. ఈ నెల ప్రారంభంలో ట్రేడింగ్ కార్పొరేషన్ ఆఫ్ పాకిస్థాన్ నుంచి బంగ్లాదేశ్ 50,000 టన్నుల బియ్యాన్ని కొనుగోలు చేసేందుకు అంగీకరించడంతో ఈ ఒప్పందం ఖరారైనట్లు తెలుస్తోంది. "1971 తర్వాత మొదటిసారిగా పాకిస్థాన్ నేషనల్ షిప్పింగ్ కార్పోరేషన్ నౌక బంగ్లాదేశ్ ఓడరేవుకు తమ ప్రభుత్వ సరుకును తీసుకెళ్తోంది. ఇది ఇరుదేశాల మధ్య సముద్ర వాణిజ్య సంబంధాలలో ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తోంది" అని పాకిస్తాన్ అధికారులు తెలిపారు. ఈ రవాణా రెండు దశల్లో పూర్తవుతుందని.. ప్రస్తుతం 25వేల టన్నుల బియ్యం తరలించామని, మరో 25,000 టన్నుల బియ్యం మార్చి ప్రారంభంలో పంపే అవకాశం ఉన్నట్లు చెప్పారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడు తున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు
పంపవచ్చు.

కమ్యూనిస్టులు కలిసి ఉద్యమించాలి

- నయా ఫాసిస్టు శక్తులను ఎదిరించాలి
- సదస్సులో వక్తలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కమ్యూనిస్టు పార్టీలు కలిసి ఉద్యమిస్తేనే కార్పొరేట్ హిందుత్వ నయా ఫాసిస్టు శక్తులను ఎదిరించగలుగుతామని భారత కమ్యూనిస్టు ఉద్యమ పురోగమనం, ఆశ్యకత - అవకాశాలు - అవరోదాలు అంశంపై జరిగిన సదస్సులో పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. నయా ఉదారవాద విధానాలపై ప్రస్తుతం పోరాటాలు చేయక తప్పని పరిస్థితులు నెలకొన్నాయని వెల్లడించారు. ప్రజా సమస్యలపై కలిసి పని చేసే క్రమంలో కమ్యూనిస్టు పార్లీలు కలిసిపోవడం గురించి ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. ఐక్య కార్యాచరణకు సమస్యలే ప్రాతిపదికని, దీని కోసం ప్రయత్నం చేయాలని కోరారు. విజయవాడలోని బుక్ పెస్టివల్ సొసైటీ లైబ్రరీ హాలులో ఆదివారం జరిగిన కార్యక్రమానికి సిహెచ్ భాస్కరరావు పిచ్చుక శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, నూర్ బాషాలు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ... కమ్యూనిస్టు తాత్విక ఆలోచన విధానం సమాజంలో ఇప్పటికీ బలంగా ఉందన్నారు. అవరోధాల కంటే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. సామ్రాజ్యవాదం సంక్షోభంలో పడిందని, సోషలిజానికి ప్రజల్లో ఆదరణ లభిస్తోందన్నారు. సరైన సమయంలో ప్రజా ఉద్యమాలు నిర్వహించడంతో ఆదరణ పెరుగుతుందన్నారు. ఇందుకు శ్రీలంకే ఉదాహరణగా పేర్కొన్నారు. నేపాల్లో కమ్యూనిస్టులు కసినా, విడిగా ఉన్నప్పటికీ ప్రజల నుంచి ఆదరణ లభించిందని తెలిపారు. నయా ఫాసిస్టు లక్షణాలు కలిగిన పార్టీ ప్రస్తుతం రాజ్యాధికారంలో ఉందన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడితే ఉపా చట్టంలో కేసులు నమోదు చేసి వేధిస్తున్నారని తెలిపారు. ఎజన్సీలో నక్సెల్స్‌ను మాత్రమే కాదు ప్రజలను అణిచివేసి అక్కడి వనరులు బడా కార్పొరేట్‌లకు కట్టబెట్టడానికే 1/70 చట్టాన్ని సవరించాలనే కుట్రలు చేస్తున్నారని, ఈ క్రమంలోనే శాసన సభ స్పీకర్ 1/70 చట్టంపై ఇటీవల వ్యాఖ్యలు చేశారని తెలిపారు. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకు పోరాటం కీలకమైనదని చెప్పారు. మతోన్మాద, కార్పొరేట్ శక్తులు కలిసి ఒక అపవిత్ర కూటమిగా ఏర్పడి రాజ్యాంగ, ప్రజస్వామ్య హక్కులను కాలరాస్తున్నాయి. వీటి రక్షణ కోసం పార్టీల మధ్య ఎన్ని విభేదాలు ఉన్నా కలిసి పోరాడాల్సిన అవసరం ఉందన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న వి శ్రీనివాసరావు

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీలకు ఎంతో పోరాట చరిత్ర ఉందని, 1964లో ఆనాటి పరిస్థితుల్లో చీలిపోయినా, ప్రస్తుతం కలిసే పని చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. ప్రజా ఉద్యమాలను ఐక్యం చేసి ఒక వేదిక మీదకి తీసుకురావడానికి ఐక్య కార్యాచరణ కోసం చర్చలు జరపాల్సిన అవసరం ఉందన్నారు. సిపిఐ(ఎంఎల్ - మాస్ లైన్) పార్టీ నాయకులు కె.జి రామచందర్, సిపిఐ ఎంఎల్ రాష్ట్ర నాయకులు నర్సింహస్వామి, సిపిఐ ఎంఎల్ (న్యూడెమోక్రసీ) అధికార ప్రతినిధి పి.ప్రసాద్, సిపిఐ ఎంఎల్ (రెడ్ స్టార్) పోలిట్ బ్యూరో సభ్యులు మన్నవ హరిప్రసాద్, సిపిఐ ఎంఎల్ (లిబరేషన్) రాష్ట్ర నాయకులు రామ్ దేవ్, ఎంసిపిఐ(యు) రాష్ట్ర నాయకులు కాలం నాగభూణం, ఎంసిపిఐ రాష్ట్ర కార్యదర్శి వెంకటరెడ్డి, ఎస్‌యుసిఐ రాష్ట్ర కార్యదర్శి అమర్‌నాథ్, కమ్యూనిష్టు పార్టీ ఆఫ్ యుఎస్ఐ నాయకులు కోదండం, ముంబై నుంచి వచ్చిన కమ్యూనిష్టు పార్టీ నాయకులు హరీష్ ఠాకూర్, విరసం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పినాక పాణి తదితరులు సదస్సులో వారి అభిప్రాయాలను వెల్లడించారు. మార్క్సిస్టు ఆలోచనాపరులు వేదికకు సామాజికవేత్తలు మోతుకూరి అరుణ్‌కుమార్, డ్యాని, సైకం రాజశేఖర్, రంగారెడ్డి నేతృత్వం వహించారు.

తమిళనాడుకు ఎంపి సీట్లు తగ్గే ప్రమాదం

స్టాలిన్ ఆందోళన

చెన్నై : కుటుంబ నియంత్రణ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నందున తమిళనాడులో పార్లమెంట్ సీట్లు తగ్గే అవకాశం ఉందని ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ ఆందోళన వ్యక్తం చేశారు. కొలతూర్‌లో ఆదివారం జరిగిన పార్టీ సీనియర్ కార్యకర్త వివాహ కార్యక్రమానికి హాజరైన ఆయన మీడియాతో మాట్లాడారు. కుటుంబ నియంత్రణ విధానాన్ని సక్రమంగా పాటిస్తున్నందున నియోజకవర్గాల పునర్విభజనలో పార్లమెంట్లు సీట్లు తగ్గే పరిస్థితి ఏర్పడిందన్నారు. తమిళనాడులో 39 పార్లమెంట్ నియోజకవర్గాలున్నాయి. నియోజకవర్గాల పునర్విభజన వల్ల సీట్లు తగ్గకుండా చూడాలని రాష్ట్రప్రభుత్వం డిమాండ్ చేస్తోంది. డీలిమిటేషన్ ప్రక్రియ 'రాబోయే విపత్తు'గా స్టాలిన్ 2023లోనే విమర్శించారు. "జనాభా ఆధారంగా ఎంపీ స్థానాల సంఖ్య పెంచడం, దక్షిణాది రాష్ట్రాలకు రాజకీయ ప్రాతినిధ్యం తగ్గించాలనే రాజకీయ కుట్రను మనం ఓడించాలి. రాజకీయ చైతన్యం కలిగిన తమిళనాడు ఈ వైపరీత్యాన్ని మొగ్గలోనే తుంచివేయాలి. జనాభా ప్రాతిపదికగా డీలిమిటేషన్ ప్రక్రియతో ఎంపీల ప్రాతినిధ్యం తగ్గకుండా దక్షిణాది రాష్ట్రాలు, ముఖ్యంగా తమిళనాడుకు ప్రధాని భరోసా ఇవ్వాలి" అని అప్పట్లో స్టాలిన్ డిమాండ్ చేశారు.

కెజిబివి ఉద్యోగి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి- కుప్పం రూరల్

కుప్పం మండల పరిధి లోని కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయ ఉద్యోగిణి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన ఘటన ఆదివారం ఆల స్యంగా వెలుగు చూసిం ది. కుప్పం పట్టణ పరిధిలో నివసిస్తూ కేజీబీవీలో కుట్లు, అల్లికలు శిక్షకురాలిగా పనిచేస్తున్న మహిళ శనివారం సాయంత్రం తన ఇంటిలో ఆత్మహత్యకు యత్నించినట్లు తన కుటుంబ సభ్యుల ద్వారా తెలిసింది. ఇది గమనించిన వెంటనే స్పందించిన కుటుంబ సభ్యులు ఆమెను మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. సమయానికి చికిత్స అందించడంతో బాధితురాలి ప్రాణాలు మిగిలిందంటూ బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ విషయమై స్పందించిన బాధితురాలు మాట్లాడుతూ తనపై అధికారి అనవసరపు ఛీదరింపులు తాళలేక మనస్థాపానికి గురై ఆత్మహత్యా యత్నానికి పాల్పడి నట్లు తెలిపారు. ఇది ఇలా ఉండగా గత కొంతకాలం క్రితం కేజీబీవీలో వంట మనిషిగా పనిచేస్తున్న మహిళ సైతం అనుమానాస్పదంగా పాఠశాల ఆవరణ లోనే మతి చెందారు. వంట మనిషి మతికి సైతం సదరు పాఠశాల ఉన్నతాధికారిణి వేధింపులే కారణ మని స్థానికంగా విస్తత ప్రచారం జరిగిన సంగతి ప్రజలు మరవకముందే అదే పాఠశాల ఉద్యోగిణి ఆత్మహత్యా యత్నానికి పాల్పడటం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఇలాంటి పరిస్థితులలో ప్రస్తుతం జరిగిన ఘటనతో పాటు గతంలో సంభవించిన మరణం పై కూడా సంబంధిత అధికారులు పూర్తి విచారణ జరిపి, నేరస్తులను చట్టరీత్యా శిక్షించి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని స్థానిక ప్రజలతో పాటు సామాజిక కార్యకర్తలు కోరుతున్నారు.

పిడిఎఫ్‌కు మెరుగవుతున్న విజయావకాశాలు

- అసత్య ప్రచారాలకు పాల్పడుతున్న ఆలపాటి



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థుల విజయావకాశాలు మెరుగవుతున్నాయి. కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల్లో సునాయాసంగా గెలుస్తామని భావించిన కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ గట్టి పోటీ ఎదుర్కొంటున్నారు. ఓటమి భయంతో ప్రత్యర్థి పిడిఎఫ్ అభ్యర్థి కె.ఎస్ లక్ష్మణరావుపై అబద్ధాలతో వండి వార్చిన వార్తలు, కథనాలను ఆలపాటి వర్గం ప్రచారంలో పెడుతుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. నేడు తాడేపల్లిలోనే లేని మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్మోహన్‌రెడ్డి ఉన్నట్లు గుంటూరు జిల్లా నేతలతో సమావేశమైనట్లు, ఎమ్మెల్సీ ఎన్నికలపై చర్చించినట్లు కట్టుకథలు అల్లి మీడియా, ఇతర సోషల్ మీడియా గ్రూపుల్లో పోస్టులు పెట్టడం వారి ఓటమి భయాన్ని తెలుపుతుంది. ఆలపాటి ఓటు బ్యాంక్ బీటలు వారుతుండగా, బెంబేలెత్తి తన క్యాంపును నిలబెట్టుకోవడానికి ఎంత నీచపు, అబద్ధపు ప్రచారానికైనా పాల్పడడానికి ఆయన సిద్ధంగా ఉన్నారు. కొద్ది ఏళ్ల కిందట సిఎం జగన్మోహనరెడ్డిని పలు సమస్యలపై కలిసి వినతి పత్రం సమర్పించడానికి కె.ఎస్ లక్ష్మణరావు వెళ్లగా, ఆ సందర్భంలో కింద పడిన వినతి పత్రం కాపీని తీసుకుంటున్న వీడియోలోని కొన్ని భాగాలను ప్రచారంలో పెట్టి, జగన్మోహన్‌రెడ్డి కాళ్లకు లక్ష్మణరావు సమస్కరిస్తున్నట్లు చిత్రీకరించడం ఆలపాటి స్థాయికి తగదని పులువురు విమర్శిస్తున్నారు. పిడిఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావుకు వస్తున్న ఆదరణను సహించలేకే తప్పుడు ప్రచారాలకు దిగుతున్నారని సాధారణ ఉపాధ్యాయులు సైతం తప్పుబడుతున్నారు. పార్టీలకతీతంగా వివిధ వర్గాలు లక్ష్మణరావుకు మద్ధతునిస్తున్న తరుణంలో లక్ష్మణరావుపై చేస్తున్న ఈ దుష్ప్రచారాలు తమకు ఉపయోగపడకపోగా మరింతగా నష్టం చేస్తాయని కూటమి నేతలు సైతం వాపోతున్నారు. ఆలపాటివర్గం దిగజారులు ప్రచారాలు చేస్తున్నా లక్ష్మణరావు హుందాతనంగా తన ప్రచారాన్ని కొనసాగించడం పట్టభద్రులు, సాధారణ మధ్యతరగతి వర్గాలు సైతం ప్రశంసిస్తున్నారు. ప్రత్యర్థిని దెబ్బగొట్టడానికి తాము చేస్తున్న ప్రయత్నాలు తమకే నష్టం కలిగిస్తాయని టిడిపి వర్గాల్లోను చర్చ నడుస్తోంది.

కె.ఎస్ లక్ష్మణరావుకు పిటిఎల్ఎఫ్ మద్దతు

ఉమ్మడి కృష్ణ, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఓటర్లు అందరూ రాజకీయ పార్టీలకు సంబంధం లేనటువంటి పిడిఎఫ్ అభ్యర్ధి కె.ఎస్ లక్ష్మణరావుకు పిటిఎల్ఎఫ్ సంపూర్ణ మద్ధతు ఇస్తుందని రాష్ట్ర అధ్యక్షురాలు డి.ప్రసన్న తెలిపారు. పిటిఎల్ఎఫ్ నుంచి నుంచి ప్రతి ఒక్క ఉపాధ్యాయులు, అధ్యాపకులు ప్రధమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరికీ ఉందని ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ప్రైవేటు టీచర్స్ అండ్ లెక్చరర్స్ తరుపున సమస్యల కోసం మాట్లాడటానికి పిడిఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావు మద్దతు తెలియజేస్తున్నట్లు వెల్లడించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలి - ఎపి రైతు సంఘం

ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గానికి కె.ఎస్ లక్ష్మణరావు, ఉమ్మడి గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గానికి డి.వీర రాఘవులు, ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ నియోజకవర్గానికి కె.విజయగౌరి పిడిఎఫ్ అభ్యర్థులుగా పోటీ చేస్తున్నారని, వీరికి తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని రైతులు, రైతు కుటుంబాలకు ఎపి రైతు సంఘం రాష్ట్ర కమిటీ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు వి.కృష్ణయ్య, కె.ప్రభాకర్‌రెడ్డి ఆదివారం ప్రకటన విడుదల చేశారు. ఈ ముగ్గురి విజయం వర్తమాన పరిస్థితుల్లో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, నిరుద్యోగులు, పట్టభద్రులు, రైతులు, వృత్తిదారుల సమస్యలపై పోరాడే ప్రజా సంఘాలకు చాలా అవసరమని తెలిపారు. రైతులకు సంబంధించిన సాగునీటి ప్రాజెక్టులు, పంటలకు మద్దతు ధరలు, పాల రైతుల సమస్యలు, పసుపు, జీడి రైతుల సమస్యలు వంటివి ఎవి ముందుకు వచ్చినా పిడిఎఫ్ ఎమ్మెల్సీలు రైతులు, ప్రజా సంఘాల పోరాటాలకు మద్దతుగా శాసన మండలి సమస్యలు లేవనెత్తుతారని చెప్పారు.

కాంట్రాక్టు కార్మికులను తొలగించొద్దు

- ఉక్కు శ్రామిక సంఘం

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికులను తొలగించే కుట్రలను విరమించాలని ఉక్కు శ్రామిక సంఘం (టిఎన్‌టియుసి) గౌరవాధ్యక్షులు కరణం సత్యారావు కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి 1473వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వాలు ఉక్కు కార్మికులను ఇబ్బందులు పెట్టడం తగదన్నారు. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం నిరంకుశ ధోరణి అవలంభిస్తూ కార్మికులను లేనిపోని గందరగోళానికి గురిచేస్తోందని విమర్శించారు. కార్మికుల గేటు పాస్‌ల విషయంలో మొండి వైఖరి తగదన్నారు. ఉక్కు నిర్మాణం కోసం భూములిచ్చిన నిర్వాసితులను పట్టించుకోకపోవడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. తక్షణమే గేటు పాస్‌లను పాత పద్ధతిలోనే కొనసాగించాలని, నిలిచిపోయిన టెండర్లను పిలవాలని, కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బొడ్డు రమణ, జి.ముత్యాలు, ఎన్.గణపతి, పి.సత్యంనాయుడు, వి.వెంకునాయుడు, బి.పైడిరాజు, బి.అప్పలనాయుడు, రవణమ్మ, భారతి, విజయ పాల్గొన్నారు.

రేపటి నుంచి హైదరాబాద్‌లో "బయో ఏషియా 2025" సదస్సు

- హెల్త్ కేర్, లైఫ్ సైన్సెస్ రంగాలపై ఫోకస్
- 50 దేశాల నుంచి మూడు వేల మంది ప్రతినిధుల హాజరు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మంగళవారం నుంచి జరగనున్న బయోఏషియా సదస్సుకు హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ వేదిక కానుంది. ఇందుకు సంబంధించి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. ఆసియాలోనే అతిపెద్ద గ్లోబల్ లైఫ్ సైన్సెస్, హెల్త్ కేర్ సదస్సుగా గుర్తింపు పొందిన ఈ సమావేశానికి ప్రపంచ వ్యాప్తంగా 50 దేశాల నుంచి మూడు వేల మంది ప్రతినిధులు హాజరవుతారని భావిస్తున్నారు. రెండు రోజుల పాటు జరగనున్న ఈ సదస్సులో లైఫ్ సైన్సెస్‌లో ప్రపంచ వ్యాప్తంగా పేరొందిన సంస్థల అధిపతులు, సంబంధిత నిపుణులు, ఆవిష్కర్తలు ఈ రంగంలో వస్తున్న అధునాతన మార్పులు, శాస్త్ర పురోగతిపై చర్చిస్తారు. 'క్యాటలిస్ట్ ఆఫ్ ఛేంజ్.. ఎక్స్‌పాండింగ్ గ్లోబల్ హెల్త్ కేర్ ఫ్రాంటియర్స్' అనే థీమ్‌తో దీన్ని ఏర్పాటు చేశారు. ఆయా రంగాల్లో పరిశోధనలు, కొత్త ఆవిష్కరణలను ప్రపంచానికి పరిచయం చేయటంతో పాటు ఔత్సాహిక సంస్థలు, నిపుణులను ప్రోత్సహిస్తుంది. వైద్య పరిశోధనలు, బయో టెక్నాలజీ, ఫార్మాస్యూటికల్ ఎక్సలెన్స్‌లో తెలంగాణ కీలక పాత్ర పోషిస్తున్న తరుణంలో జరుగనున్న ఈ సదస్సు హెల్త్ కేర్ రంగంలో మరో మైలురాయిగా నిలువనుంది. పరిశ్రమల వృద్ధి, సహకారం, అత్యాధునిక పరిశోధనలను ప్రోత్సహించేందుకు బయో ఏషియా సదస్సు సరికొత్త మార్గదర్శనం అందించనుంది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, క్వీన్స్ ల్యాండ్ గవర్నర్ డాక్టర్ జీనెట్ యంగ్, జి20 షెర్పా అమితాబ్ కాంత్, కేంద్ర వాణిజ్య పరిశ్రమల శాఖ మంత్రి పియూష్ గోయల్, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు బయో ఏషియా ప్రారంభోత్సవ వేదికపై ప్రసంగిస్తారు.

ఇన్నోవేషన్ జోన్ ఏర్పాటు

కొత్త ఆలోచనలు, కొత్త ఆవిష్కరణలతో రూపొందించిన దాదాపు 700 స్టార్టప్‌లు దీనికి దరఖాస్తు చేసుకున్నాయి. వీటిలో ఎంపిక చేసిన 80 స్టార్టప్‌లను ఈ సదస్సులో ఏర్పాటు చేసిన 'ఇన్నోవేషన్ జోన్'లో ప్రదర్శిస్తారు. హెల్త్ కేర్ రంగంలో మెడికల్ టెక్నాలజీ, బయో టెక్నాలజీ, డిజిటల్ హెల్త్ రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చే లక్ష్యానికి అనుగుణంగా వీటిని ఎంపిక చేశారు. కొత్త స్టార్టప్లకు ప్రపంచ స్థాయి గుర్తింపుతో పాటు, అదుతేమైన అవకాశాలను ఈ సదస్సు అందించనుంది.

విప్లవకారుల ఐక్యత తక్షణ అవసరం

- సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ విలీన సభలో వక్తలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దేశంలో విప్లవ పరిపూర్ణతకు విప్లవకారుల ఐక్యత తక్షణ అవసరమని న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యులు సాధినేని వెంకటేశ్వరరావు అన్నారు. నూతన ప్రజాస్వామిక విప్లవ లక్ష్యం ఉన్న పార్టీలను ఒకే పార్టీగా విలీనం చేయడానికి కృషి జరుగుతోందని, ఈ కృషిలో ఐక్య న్యూడెమోక్రసీ పార్టీ అగ్రభాగాన నిలుస్తోందన్నారు. విజయవాడలోని ఎంబివికెలో ఆదివారం జరిగిన రెండు సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీల విలీన సభలో ఆయన మాట్లాడుతూ... దేశంలో బిజెపి-ఆరెస్సెస్ మనువాద ప్రభుత్వం ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, రక్షణలను రద్దు చేసి అటవీ సంపద, ఖనిజాలను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడానికి కుట్రలు సాగిస్తుందని తెలిపారు. పార్టీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి జె.వి చలపతిరావు మాట్లాడుతూ... ఎవరికి ఏ భావాలు, ధోరణులు ఉన్నా నేటి దేశ కాల పరిస్థితుల్లో విప్లవకారుల ఐక్యత ఒక అనివార్యమైన తక్షణావశ్యకత అని చెప్పారు. విప్లవ పార్టీల అగ్రనాయకత్వాలు తమలో పొడచూపుతున్న వ్యతిరేక ధోరణల నుంచి బయటపడి చిత్తశుద్ధితో విప్లవకారుల ఐక్యత కోసం కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పార్టీ ఎపి రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, అధికార ప్రతినిధి పి.ప్రసాద్, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.విష్ణు, కె.పోలారి తదితరులు ప్రసంగించారు. కార్యక్రమానికి పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి చిట్టిపాటి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. దండకారణ్యంలో కగార్ ఆపరేషన్ పేరుతో కేంద్రం సాగిస్తున్న మారణకాండను నిలిపివేయాలని, ఎపిలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చి న సూపర్‌సిక్స్, ఇతర హామీలను తక్షణం అమలు చేయాలని తీర్మానాలను చేశారు.

గ్రూప్-2 అభ్యర్థులను నట్టేట ముంచారు : జగన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మూడు వారాల నుంచి గ్రూప్-2 అభ్యర్థుల అభ్యంతరాలను వింటున్నట్లు నటించి.. వాటిని పరిగణలోకి తీసుకుని న్యాయం చేస్తున్నట్లు నమ్మించి చివరికి వారిని నట్టేట ముంచారని వైసిపి అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఎక్స్ ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. నిరుద్యోగులను ఉద్యోగులనే కాదు, అన్ని తరగతుల ప్రజలనూ మోసం చేయడమే అలవాటుగా చంద్రబాబు మార్చుకున్నారన్నారు.

సన్నగిల్లుతున్న ఆశలు

సహాయక చర్యలను పరిశీలిస్తున్న సిపిఎం బృందం

(మొదటిపేజీ తరువాయి)

రూ.4.500 కోట్లు కేటాయించడంతో పది రోజుల క్రితం పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. గత ప్రభుత్వ నిర్వహణ లోపం వల్ల లైనింగ్ దెబ్బతిని టన్నెల్ కూలిందని అన్నారు. చిక్కుకున్న వారిని కాపాడడానికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో 43 కిలోమీటర్ల సొరంగ మార్గాన్ని నిర్మిస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్న విమర్శలకు విలువలేదన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి : జూలకంటి రంగారెడ్డి

ఘటనా స్థలాన్ని సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ఆదివారం వచ్చారు. ఎస్ఎల్‌బిసి సొరంగ మార్గంలో ప్రమాదవశాత్తు చిక్కుకున్న కార్మిక కుటుంబాలను కంపెనీ వారు, రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లాకు తాగునీరం దించే లక్ష్యంతో నిర్మిస్తున్న ఈ పనుల్లో ప్రమాదం విచారకరమని పేర్కొన్నారు.

నేడు కిసాన్ సమ్మాన్ నిధి 19వ విడత నగదు విడుదల

- బీహార్ అసెంబ్లీ ఎన్నికల కోసమే ఈ జిమ్మిక్కులు : ప్రతిపక్షాలు
- నిరసనలకు పిలుపు

పాట్నా : ప్రధాని మోడీ భాగల్పూర్ పర్యటనకు ముందే బీహార్‌లో రాజకీయం వేడెక్కింది. పిఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజన ద్వారా మరో విడతగా సుమారు పదికోట్ల మందికి లబ్దిదారులకు దాదాపు రూ.23,000 కోట్లు పంపిణీ చేయనున్నారు.

ప్రధాని పర్యటన సన్నాహాలను పర్యవేక్షించడానికి కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ రాష్ట్రానికి వచ్చి మఖానా (ఫాక్స్‌నట్స్) పండించే రైతులతో మాట్లాడారు. "ఇటీవలి బడ్జెట్‌లో ప్రకటించిన 'మఖానా బోర్డు' కోసం ఒక ప్రణాళికను రూపొందించారు. నిజమైన వాటాదారులైన రైతులతో సంప్రదించి మఖానా బోర్డును ఏర్పాటు చేయాలని మేం నిర్ణయం తీసుకున్నాం. ఢిల్లీలోని కృషిభవన్ నుంచి జారీ చేసిన ఆదేశాన్ని మేం ఇష్టపడలేదు" అని శివరాజ్‌సింగ్ చౌహాన్ దర్భంగాలో జరిగిన 'మఖానా పంచాయతీ' సందర్భంగా విలేకరులతో అన్నారు. సోమవారం జరిగే ప్రధానమంత్రి కార్యక్రమం దేశం మొత్తంపై ప్రభావం చూపుతుందని కేంద్రమంత్రి అన్నారు.

ఆయా రాష్ట్రాల్లో బిజెపి, సంకీర్ణ ప్రభుత్వాలు తమ పాలనా కాలంలో అభివృద్ధిని పట్టించుకోకుండా, ఎన్నికలు దగ్గరపడగానే.. వేల కోట్ల రూపాయలు విలువ చేసే అభివృద్ధి పనులకు శిలాఫలకాలు వేయటం, హామీలు గుమ్మరించటం సాధారణమైపోయింది. ఇక అధికారంలోకి రాగానే ఇచ్చిన హామీలు, అభివృద్ధి గురించి పట్టించుకునే

నితీశ్‌కుమార్, మోడీ (ఫైల్)

నాథుడే ఉండరని స్థానిక ఓటర్ల ఆవేదన.

అసెంబ్లీ ఎన్నికల దృష్టితోనే ప్రధాని పర్యటన : తేజస్వి యాదవ్

ఇలాంటి పరిస్థితుల్లో కొన్ని నెలల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రధాని ఈ కార్యక్రమానికి బీహార్‌ను ఎంచుకున్నారని ప్రతిపక్ష ఆర్‌జెడి నేత తేజస్వి యాదవ్ విమర్శించారు. ఈ ఆరోపణలను కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ తోసిపుచ్చారు.

ఎన్నికల కారణంగానే ప్రధాని పర్యటన అని సూరాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిషోర్ ఆరోపించారు. 2014 లోక్‌సభ ఎన్నికల్లో మోడీకి ప్రచారాన్ని నిర్వహించిన రాజకీయ వ్యూహకర్తగా ప్రశాంత్ కిశోర్ వ్యవహరించారు. ఇప్పుడు బీహార్‌లో ఎన్నికలు జరగబోతున్నందున, ప్రధాని రాష్ట్రంపై దృష్టి సారిస్తారనేది స్పష్టంగా ఉన్నది ప్రశాంత్ కిషోర్ అన్నారు.

బిజెపి మిత్రపక్షం లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) అధినేత, బీహార్‌లోని హాజీపూర్ లోక్‌సభ స్థానానికి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్.. మోడీ పర్యటన 'మా రాష్ట్రం.. ఆయన ప్రాధాన్యతకు రుజువు' అని అభిప్రాయపడ్డారు. "కేంద్ర బడ్జెట్‌లో బీహార్‌కు ఎంత ప్రాముఖ్యత ఇచ్చారో మేం చూశాం. ప్రధాని కార్యక్రమానికి హాజరు కావడానికి నేను ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను" అని పాశ్వాన్ అన్నారు. స్వతంత్ర ఎంపి రాజేశ్ రంజన్ అలియాస్ పప్పు యాదవ్ మంగళవారం తన పూర్ణియా లోక్‌సభ నియోజకవర్గంతో పాటు పరిసర ప్రాంతాలలో 'బంద్'కు పిలుపునిచ్చారు.

పూర్ణియాలో మఖానా బోర్డును ఏర్పాటు చేయాలనే డిమాండ్‌ను నొక్కి చెప్పడానికి ప్రయత్నించిన యాదవ్.. అవసరమైతే.. ఢిల్లీ , పూర్ణియా, కతిహార్ మధ్య రైలు రాకపోకలను అడ్డుకుంటామని కూడా హెచ్చరించారు.

బీహార్ ప్రయోజనాలను, ముఖ్యంగా సీమాంచల్ ప్రాంతాన్ని దెబ్బతీసేలా బిజెపి వ్యవహరిస్తోందని ఆరోపించారు. కానీ జెడి (యు)కి నాయకత్వం వహిస్తున్న ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ నిరసన వ్యక్తం చేయలేకపోయారని విమర్శించారు.

అమెరికా ఎయిర్‌లైన్స్‌కు బాంబు బెదిరింపు

ఢిల్లీ రావాల్సిన విమానం రోమ్‌కు మళ్లింపు

న్యూఢిల్లీ : న్యూయార్క్ నుంచి ఢిల్లీ చేరుకోవాల్సిన అమెరికన్ ఎయిర్‌లైన్స్ విమానానికి ఇ - మెయిల్ నుంచి బాంబు బెదిరింపు వచ్చింది. దీంతో ఈ విమానాన్ని రోమ్‌కు మళ్లించారు. అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం న్యూయార్క్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఢిల్లీకి బోయింగ్‌కు చెందిన విమానం ఎఎ 292 ఈ నెల శనివారం బయలుదేరింది. 14 గంటల ప్రయాణం తరువాత ఈ విమానం ఢిల్లీకి చేరుకోవాల్సి ఉంది. మరో నాలుగు గంటల్లో ఈ విమానం గమ్యస్థానం చేరుకుంటుందనగా, ఈ విమానంలో బాంబు ఉందని బెదిరింపు ఈమెయిల్ వచ్చింది. దీంతో భద్రతా తనిఖీల కోసం రోమ్‌కు దారి మళ్లించాలని విమానం లో సిబ్బందికి అధికారులు సూచించారు. తనిఖీలు పూర్తయిన తరువాతనే విమానం మళ్లీ ఢిల్లీకి బయలుదేరుతుందని అధికారులు తెలిపారు. ఈవిషయాన్ని అమెరికన్ ఎయిర్‌లైన్స్ కూడా ధ్రువీకరించింది.

నాటో సభ్యత్వం ఇస్తే పదవిని వదులుకుంటా

ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ

కీవ్ : ఉక్రెయిన్‌కు నాటోలో సభ్యత్వం ఇస్తే అధ్యక్ష పదవి వదులుకునేందుకు సిద్ధమేనని ఆ దేశ అధ్యక్షుడు జెలెన్‌స్కీ చెప్పారు. రష్యా సైనిక ఆపరేషన్‌కు మూడేళ్లు పూర్తవుతున్న వేళ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. జెలెన్‌స్కీ ఓ నియంత అని, అందుకే ఆ దేశంలో ఎన్నికలు జరపడం లేదంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల చేసిన వ్యాఖ్యలపై స్పందించారు. తాను నియంతను కాదని స్పష్టం చేశారు. అమెరికా- ఉక్రెయిన్‌ల మధ్య ఖనిజ నిక్షేపాల ఒప్పందం చర్చలపై జెలెన్‌స్కీ మాట్లాడుతూ.. ఈ ప్రక్రియ ముందుకు సాగుతోందని, సహజ వనరులను పంచుకునేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. యుద్ధానికి తెరదించేందుకు ఉద్దేశించిన ఏ చర్చల్లోనైనా తమ భాగస్వామ్యం ఉండాల్సిందేనని అన్నారు.

ప్రమాదంలో నుజ్జునుజ్జయిన బస్సు ముందుభాగం

కుంభమేళాకు వెళ్తుండగా ప్రమాదం

- లారీని ఢీకొన్న ప్రయివేటు బస్సు
- 12 మందికి గాయాలు

ప్రజాశక్తి - ఆనందపురం/కలెక్టరేట్ (విశాఖపట్నం)

కుంభమేళాకు ప్రయాణికులతో వెళ్తున్న ఓ ప్రయివేటు బస్సు విశాఖ జిల్లా ఆనందపురం మండలం గండిగుండం గ్రామం వద్ద జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున ప్రమాదానికి గురైంది. ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టడంతో బస్సులోని 12 మందికి గాయాలయ్యాయి. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు, స్థానికులు తెలిపిన కథనం మేరకు.. బళ్లారి నుంచి ఉత్తరప్రదేశ్‌లోని కుంభమేళాకు 45 మంది ప్రయాణికులతో బస్సు బయలుదేరింది. విశాఖ జిల్లా పెందుర్తి రోడ్డు మార్గం నుంచి ఆనందపురం మండలం గండిగుండం గ్రామం జాతీయ రహదారి వద్దకు వచ్చే క్రమంలో ముందు వెళ్తున్న లారీని బస్సు బలంగా ఢీకొంది. దీంతో 12 మందికి గాయాలయ్యాయి. వారిని విశాఖలోని కెజిహెచ్‌కు తరలించారు. వృద్ధురాలైన లక్ష్మీదేవి పరిస్థితి విషమంగా ఉంది. బలమైన గాయాలైన ఇద్దరిని ఇన్ పేషెంట్లుగా ఉంచి వైద్య సేవలు అందిస్తున్నామని, మిగిలిన వారందరికీ స్వల్ప గాయాలు కావడంతో చికిత్స అందించి పంపించేశామని కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి శివానంద తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని సిఐ సిహెచ్ వాసు నాయుడు చెప్పారు.

ప్రాణాలు తీసిన ఈత సరదా

- పోలవరం కాల్వలో ఇద్దరు విద్యార్థులు మృతి

ప్రజాశక్తి-గన్నవరం (కృష్ణాజిల్లా)

ఈత సరదా.. ఇరువురు విద్యార్థుల ప్రాణాలను బలి తీసుకున్న సంఘటన కృష్ణా జిల్లా బాపులపాడు మండలం వీరవల్లి శివారు ప్రాంతంలో ఉన్న పోలవరం కాలువ వద్ద ఆదివారం చోటుచేసుకుంది. వీరవల్లి ఎస్ఐ శ్రీనివాస్ కథనం ప్రకారం... వీరవల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కోడూరుపాడుకు చెందిన షేక్ షరీఫ్ (16), నాగూర్ బాష (16) చేపలు పట్టేందుకు మరో ఇద్దరు స్నేహితులతో కలిసి పోలవరం కాల్వ వద్దకు వెళ్లారు. కాసేపు చేపలు పట్టిన తర్వాత సరదాగా ఈత కొట్టేందుకు ఇద్దరూ కాలువలో దిగారు. కాలువలో నీరు ఎక్కువగా ఉండటంతో ఊపిరాడక మునిగిపోయారు. గమనించిన తోటి స్నేహితులు కేకలు వేయడంతో గ్రామస్తులు వచ్చి వారిని ఒడ్డుకు చేర్చారు. అయితే అప్పటికే వారు మృతి చెందారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. నాగూర్ బాషా విజయవాడ ఎన్ఆర్ఐ కళాశాలలో ఇంటర్, షేక్ షరీఫ్ తేలప్రోలు ఉషారామా ఇంజనీరింగ్ కాలేజీలో పాలిటెక్నిక్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. పోలవరం కాల్వ వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం వల్ల అనేకమంది ప్రాణాలు కోల్పోతున్నారని స్థానికులు చెబుతున్నారు.

రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - ఎ.కొండూరు :

అప్పుల బాధ తాళలేక యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఎ. కొండూరు మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. రామచంద్రాపురం గ్రామపంచాయతీ శివారు లక్ష్మీపురం గ్రామానికి చెందిన కొండెబోయిన రాంబాబు (45) వ్యవసాయం నిమిత్తం కొంత మేర అప్పులు చేశారు. నాలుగురోజులుగా ఇంటికి రాకపోవడంతో అనుమానం వచ్చి కుటుంబసభ్యులు వెతకసాగారు. మామిడి తోటలో చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుని కుమారుడు కొండబోయిన విష్ణువర్ధన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చల్లా కృష్ణ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరువూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఆరోగ్యం ప్రాథమిక హక్కు

- బీమా పేరిట తప్పుకుంటున్న ప్రభుత్వం
- 'ప్రజారోగ్య వేదిక' సదస్సులో సుజాతరావు, పివి రమేష్
- ఆరోగ్య భద్రతపై చట్టం చేయాలని తీర్మానం

సదస్సులో మాట్లాడుతున్న సుజాతారావు, వేదికపై పివి రమేష్, రమణయ్య తదితరులు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ

డబ్బున్నోళ్లకే వైద్యం అందుబాటులో ఉంటుందని, దేశంలో ఆరోగ్యం అనేది ప్రాథమిక హక్కుగా మారాలని, బీమా పేరిట బాధ్యతల నుంచి ప్రభుత్వం తప్పుకుంటోందని పలువురు రిటైర్డ్ ఐఎఎస్‌లు పేర్కొన్నారు. 'ఆంధ్రప్రదేశ్‌లో ఆరోగ్య రంగం- సామాజిక బాధ్యత' అనే అంశంపై ఆదివారం తిరుపతి ఎస్‌వి మెడికల్ కళాశాల ఆడిటోరియంలో వేమన విజ్ఞాన కేంద్రం, ప్రజారోగ్య వేదిక, ఎస్‌వి మెడికల్ కళాశాలలు సంయుక్తంగా సదస్సు నిర్వహించాయి. ప్రజారోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు ఎన్‌వి రమణయ్య అధ్యక్షత వహించారు. 'ఆరోగ్య భద్రతకై చట్టం చేయాలి' అని ప్రజారోగ్య వేదిక ప్రధాన కార్యదర్శి కామేశ్వరరావు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సదస్సు ఆమోదించింది.

సదస్సుకు ముఖ్య అతిథులుగా రిటైర్డ్ ఐఎఎస్‌లు డాక్టర్ సుజాతారావు, డాక్టర్ పివి రమేష్ హాజరయ్యారు. సుజాతరావు మాట్లాడుతూ.. పేదలు ఆరోగ్యాన్ని పొందలేని దుస్థితికి ఆరోగ్య రంగం నెట్టివేయబడిందన్నారు. దశలవారీగా వచ్చిన మార్పుల వల్ల ఆరోగ్యం అనేది ప్రాథమిక హక్కుగా లేదన్నారు. ప్రభుత్వాలు ఆ బాధ్యతల నుంచి తప్పుకుంటూ, ప్రయివేట్ రంగానికి వైద్యాన్ని అప్పజెప్పడం ఆందోళనకరమన్నారు. వైద్యాన్ని వ్యాపారంగా చూస్తున్న కారణంగా అందులో ఆదాయం తప్ప ప్రజల బాగోగులు పూర్తిగా కనుమరుగయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. చిత్తూరు ప్రభుత్వాస్పత్రిని అపోలో వారికి బదలాయించడం, ప్రభుత్వ, ప్రయివేట్ భాగస్వామ్యంతో 11 మెడికల్ కాలేజీలు నిర్వహిస్తామని ప్రకటించడం, క్యాపిటేషన్ ఫీజు పేరిట అర్హతతో నిమిత్తం లేకుండా విద్యార్థుల నుంచి కోట్ల రూపాయలు వసూలు చేసుకుని సీట్లు కేటాయించాలని భావించడం సమర్థనీయం కాదన్నారు. ఆరోగ్య రంగంలో కేరళ రాష్ట్రం భారతదేశానికి ఆదర్శవంతంగా ఉందని, ఇతర రాష్ట్రాల్లో పోలిస్తే మరణాల రేటు కేరళలో తక్కువగా ఉందన్నారు. ప్రపంచానికి జర్మనీ ఆదర్శంగా ఉంటే, భారతదేశంలో కేరళ రాష్ట్రం ఆదర్శంగా ఉందని తెలిపారు. అభివృద్ధి అంటే రోడ్లు వేయడం, పెద్ద పెద్ద కార్లు కొనడం, జిడిపి లెక్కలు చూపడం కాదని, ఆరోగ్యంతో జీవించడమేనని వ్యాఖ్యానించారు. 70 శాతం వ్యాధులకు ఎలాంటి పరీక్షలు అవసరం లేకుండానే సాధారణ మందులతో నయం చేయవచ్చని గణాంకాలు చెబుతుండగా కార్పొరేట్ వైద్యం ప్రతి దానికి ఎంఆర్ఐ, సిటీ స్కాన్, వైద్య పరీక్షల పేరుతో కోట్ల రూపాయలు ప్రజల నుంచి కొల్లగొట్టడం సర్వసాధారణంగా మారిపోయిందని విమర్శించారు. పివి రమేష్ కుమార్ మాట్లాడుతూ.. ఆరోగ్యమనేది మానవ హక్కుగా పరిగణించాలని, ఆరోగ్యం వ్యాపారం కావడం సమర్థనీయం కాదని, ఆరోగ్యాన్ని వ్యాపారంగా చూసే రాజకీయ పార్టీలకు ఓటు వేయవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్ డీమ్డ్ యూనివర్సిటీ డీన్ అల్లాడి మోహన్, శ్రీ వెంకటేశ్వర వైద్య కళాశాల ప్రిన్సిపల్ పిఎ చంద్రశేఖర్, రుయా ఆస్పత్రి సూపరింటెండెంట్ రవి ప్రభు, ఎస్‌వి మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డి. సత్యనారాయణ మూర్తి, ఐఎంఎ జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ దగ్గు మాటి శ్రీహరిరావు, వేమన విజ్ఞాన కేంద్రం ప్రధాన కార్యదర్శి మల్లారపు నాగార్జున పాల్గొన్నారు.

రెండు వివాహ వేడుకల్లో పాల్గొన్న సిఎం

తిరుపతిలో నూతన వధూవరులు సుదర్శన యాదవ్, పూజకు శుభాకాంక్షలు తెలుపుతున్న సిఎం


నెల్లూరులో నూతన వధూవరులు గోకుల్‌రిషింత్, దివ్యను ఆశీర్వదిస్తున్న సిఎం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్, నెల్లూరు ప్రతినిధి

సిఎం చంద్రబాబునాయుడు ఆదివారం రెండు వివాహ వేడుకల్లో పాల్గొన్నారు. తొలుత యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్ కుమారుడి వివాహానికి హాజరయ్యారు. తిరుపతి-రేణిగుంట సమీపంలోని ఆర్‌పిఆర్ కళ్యాణ మండపంలో నూతన వధువరులు సుదర్శన యాదవ్, పూజలను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. అక్కడే తిరుపతి ప్రెస్‌క్లబ్ డైరీని ఆవిష్కరించారు. అనంతరం నెల్లూరులో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర కుమారుడి వివాహానికి ముఖ్యమంత్రి హాజరయ్యారు. నగరంలోని గొలగమూడి రోడ్డులోని విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో నూతన వధువరులు గోకుల్‌రిషింత్, దివ్యను ఆశీర్వదించారు. పుష్పగుచ్చాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. సిఎం వెంట పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు ఉన్నారు.

న్యాయవ్యవస్థపై కేంద్రం దాడి

- లా నేస్తం, ఇన్స్యూరెన్స్ మ్యాచింగ్ గ్రాంట్ చెల్లించాలి
- ఐలు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర రాజేంద్ర ప్రసాద్

మాట్లాడుతున్న ఐలు నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర రాజేంద్ర ప్రసాద్

ప్రజాశక్తి- కర్నూలు ప్రతినిధి

న్యాయ వ్యవస్థపై కేంద్ర ప్రభుత్వం దాడి చేస్తోందని, అందులో భాగంగానే న్యాయవాదుల చట్టానికి సవరణలు చేస్తూ డ్రాఫ్ట్ రూపొందించిందని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. కర్నూలులోని ఎపి ఎస్ఇబి ఇంజనీర్స్ అతిథి గృహంలో ఆదివారం ఐలు రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ న్యాయవాదుల చట్టానికి సవరణలు చేయడం వెనక కుట్ర ఉందన్నారు. కేంద్రం తన నిరంకుశ విధానాలతో అన్ని వ్యవస్థలనూ నిర్వీర్యం చేసినట్లు న్యాయ వ్యవస్థపై కూడా తన పెత్తనాన్ని చలాయించాలని చూస్తోందని తెలిపారు. ప్రస్తుతం ఎన్నికల ద్వారా బార్ కౌన్సిళ్ల పాలకవర్గాలు ఏర్పాటవుతున్నాయని, ఈ విధానానికి స్వస్తి చెప్పి నామినేటెడ్ పద్ధతిలో బార్ కౌన్సిళ్ల ఏర్పాటుకు కుట్రలు చేస్తోందని తెలిపారు. న్యాయవాదులు భయపడుతూ పని చేసే పరిస్థితి వస్తే దేశంలో న్యాయ వ్యవస్థ కూలిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. యువ న్యాయవాదులకు గత ప్రభుత్వం నెలకు రూ.5 వేలు లా నేస్తం పేరుతో ప్రకటించిందని, ఆ మొత్తాన్ని రూ.10 వేలు చేస్తామని టిడిపి నాయకులు గత ఎన్నికల ముందు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు పూర్తవుతున్నా లా నేస్తం ఇవ్వలేదని, దాన్ని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గతంలో టిడిపి ప్రభుత్వం మరణించిన న్యాయవాదుల కుటుంబాలకు రూ.4 లక్షల ఇన్సూరెన్స్ మ్యాచింగ్ గ్రాంట్ ఇస్తామని ప్రకటించిందని, వెయ్యి మందికి ఆ మొత్తం బకాయి ఉందని, దాన్ని వెంటనే చెల్లించాలని కోరారు. న్యాయస్థానాల్లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. న్యాయవాదుల పోరాటానికి ప్రజలు మద్దతివ్వాలని కోరారు. వచ్చే నెల ఒకటిన విజయవాడలో న్యాయ విద్యార్థుల రాష్ట్ర కన్వెన్షన్ నిర్వహిస్తున్నామని, ప్రతి లా కాలేజీ నుంచి ప్రతినిధులు హాజరు కానున్నట్లు తెలిపారు. ఐలు జాతీయ నాయకులు నర్రా శ్రీనివాసరావు మాట్లాడుతూ న్యాయవాదులపై హత్యా ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. న్యాయవాదులకు రక్షణ లేకపోతే ప్రజలకు న్యాయం అందే పరిస్థితి ఉండదన్నారు. న్యాయవాదుల రక్షణకు చట్టం తేవాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులకు హెల్త్ ఇన్సూరెన్స్ ఇవ్వాలని కోరారు. సమావేశంలో ఐలు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాధవరావు, అధ్యక్షులు కెంగార కుమార్, జిల్లా అధ్యక్షులు సింగరాజు లక్ష్మణ్ పాల్గొన్నారు.

దాశరథి, ఆరుద్ర నేటి తరానికి ఆదర్శం

- తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటమే వారికి స్ఫూర్తి
- సాహిత్య సమాలోచన సదస్సులో వక్తలు

సదస్సులో మాట్లాడుతున్న తెలకపల్లి రవి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"గాంధీలు మాత్రమే కాదు... గాడ్సేలు కూడా దేశభక్తులే" అనే వాదం పెరుగుతున్న ప్రస్తుత తరుణంలో ప్రజాపోరాటానికి గొంతుకలై, తెలుగు సాహిత్యానికి దిశా నిర్దేశం చేసిన దాశరథి, ఆరుద్రలు నేటి తరానికి ఆదర్శమని సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అన్నారు. మహాకవుల శతజయంతి సందర్భంగా తెలంగాణ సాహితి ఆధ్వర్యంలో "దాశరథి, ఆరుద్ర సాహిత్య సమాలోచన" పేరుతో ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సదస్సులో ముఖ్యవక్తగా పాల్గొని ప్రసంగించారు. దశాబ్దాల పాటు తెలుగు సాహిత్యంపై ఇద్దరూ చెరగని ముద్రవేశారని కొనియాడారు. "నిజాం రాచరికాన్ని నిరసిస్తూ ...నిజామాబాద్ జైలు గోడల మీద... ఓ నిజాం పిశాచమా కానరాడు నిన్ను బోలిన రాజు మాకెన్నడేని, తీగెలను దెంపి అగ్నిలో దింపినావు... నా తెలంగాణ కోటి రతనాల వీణ అంటూ నినదించాడు. గోదారి గట్టుంది... గట్టుమీద పిట్టుంది అని సినిమా పాటలు రాసినా, కూనలమ్మ పదాలను పలికించినా అది వారికే చెల్లింది. మహత్తర ప్రజా పోరాటలకు ప్రాంతీయ భేదాలుండని వీరద్దరు రుజువు చేశారు. వృత్తి జీవితంలో ఎంత నిబద్ధతతో ఉన్నారో... వ్యక్తి గత జీవితంలోనూ అంతే నిబద్ధతతో ఉన్నారు" అని పేర్కొన్నారు. మతతత్వం ముసుగులో పుస్తకాలపై, పూజారులపై దాడులు జరుగుతున్న తరుణంలో వారి స్ఫూర్తితో నేటి తరం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రముఖ కవి ఆర్.సీతారాములు మాట్లాడుతూ దాశరథి, ఆరుద్రలపై మరింత లోతుగా అధ్యయనం చేయాల్సిన అవసరముందన్నారు. వారు రాసిన కొన్నింటిని పదేపదే వల్లే వేస్తూ చెప్పడం మాని కొత్త కోణాలను ఆవిష్కరించాలని సమావేశంలో పాల్గొన్న పరిశోధనా విద్యార్థులకు సూచించారు. తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి నామోజు బాలాచారి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం వారి యాదిలో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోందని గుర్తు చేశారు. తెలుగు సాహిత్యానికి వారు వన్నె తెచ్చారని కొనియాడారు. కవి యాకుబ్ మాట్లాడుతూ ఇద్దరు కవులు రాసిన మహాకావ్యాలకు ఒక్క అవార్డు రాలేదని, సాహిత్యానికి అవార్డులు కొలమానం కాదని విశ్లేశించారు. పద్మశ్రీలు, పద్మభూషన్లు రాకపోయినా వారు ప్రజాగొంతుకలని అన్నారు. సామాన్యులు తమ చరిత్రను తామే రాసుకోకపోతే... వేటగాళ్ల చరిత్రే చరిత్రవుతుందనీ, అలా కాకుండా సాహితివేత్తలు తమ కళాలకు పదును పెట్టాలని పేర్కొన్నారు. సదస్సు ప్రారంభ సమావేశానికి అధ్యక్షత వహించిన తెలంగాణ సాహితి ప్రధాన కార్యదర్శి కె.ఆనందాచారి మాట్లాడుతూ ఇద్దరు కవులు భిన్న ప్రాంతాలకు చెందిన వారైనా, భిన్న దృక్పథాల నుంచి వచ్చిన వారైనా తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం నుంచి స్ఫూర్తి పొందిన వారేనని గుర్తు చేశారు. దాశరథి సంప్రదాయ కుటుంబం నుంచి వచ్చినా తన సాహిత్యం ద్వారా కమ్యూనిస్టు భావజాలాన్ని వ్యాపింపజేశారని పేర్కొన్నారు. డాక్టర్ తిరునగరి శరత్‌చంద్ర అధ్యక్షతన జరిగిన దాశరథి సాహిత్య సమాలోచన సమావేశంలో 'దాశరథి జీవితం-పోరాట నేపథ్యం' పై పుప్ర జ్యోతి, కవిత్వంపై డాక్టర్ మల్లెగోడ గంగాప్రసాద్, సినిమా పాటలపై డాక్టర్ బి.బాలకృష్ణ, కథలపై పెద్దపల్లి తేజస్విని, విమర్శ, అనువాదాలపై డాక్టర్ శివరాత్రి సుధాకర్ ప్రసంగించారు. తెలంగాణ సాహితి రాష్ట్ర కమిటీ కోశాధికారి అనంతోజు మోహనకృష్ణ అధ్యక్షతన జరిగిన ఆరుద్ర సాహిత్య సమాలోచన సమావేశంలో ఆరుద్ర రాసిన త్వమేవాహం కావ్యంపై డాక్టర్ గంజి శశిధర్, కవిత్వంపై తులసి గగులోత్, సినిమా పాటలపై మౌనిశ్రీమల్లిక్, పరిశోధనలపై డాక్టర్ లక్ష్మి ఆసిరెడ్డి, విమర్శలపై బండారు రాజ్ కుమార్‌లు ప్రసంగించారు. తెలంగాణ సాహితి రాష్ట్ర ఉపాధ్యక్షులు తంగిరాల చక్రవర్తి అధ్యక్షతన జరిగిన ముగింపు సభలో తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాళేశ్వరం శంకరం మాట్లాడుతూ ఇద్దరు కవులు తమ కళాలను పీడిత, తాడిత ప్రజల గోసను ప్రపంచానికి చాటారని అన్నారు. దాశరథి జైల్లో అగ్నిధారను, ఆరుద్ర రైల్లో త్వమేవాహం కావ్యాలకు నాంది పలికారని పేర్కొన్నారు. ప్రశ్నించే తెలంగాణ నేలే వారికి సాహితి ఓనమాలను నేర్పిందని వివరించారు. తెలుగు సాహిత్యం ఉన్నంత వరకు వారిద్దరి పేర్లు ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కవులు సలీమ, శరత్‌సుదర్శి, పేర్ల రాము, చికొండ్ర రవి, వాహిద్ ఖాన్, ఎం.రేఖ, ఏబూషి నర్సింహ, ముజాహిది అలీ, మహేష్ దుర్గే తదితరులు పాల్గొన్నారు.

అరుదైన శస్త్ర చికిత్స విజయవంతం

ప్రజాశక్తి - గుడివాడ :

డాక్టర్ పొట్లూరి వంశీకృష్ణ సైటస్ ఇన్వరసస్ టోటాలిస్ అనే అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ఆదివారం స్థానిక ఏలూరురోడ్డులోని డాక్టర్ పొట్లూరి వంశీ అసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పట్టణానికి చెందిన మహిళకు ఎడమ పక్క డొక్కలో నొప్పి రావడంతో వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. ఈ పరీక్షలలో ఆమెకు సైటస్ ఇన్వరసస్ టోటాలిస్ అనే అరుదైన పరిస్థితి ఉందన్నారు. ఈ వ్యాధి ఉన్నవారిలో లివర్ ఎడమవైపు, గుండె కుడివైపుకు ఉంటుందన్నారు. ఈ మహిళకు గాల్ బ్లాడర్‌లో రాళ్ళుతో పాటు మ్యూకోసిల్ వ్యాధి ఉన్నట్లు గుర్తించి, వెంటనే శాస్త్ర చికిత్స చేశామన్నారు. లాప్రోస్కోపిక్ ద్వారా అపరేషన్‌ను డాక్టర్ వసుంధర, డాక్టర్ శివప్రసాద్‌తో పాటు సిబ్బంది అజయ్‌బాబు, శివాజీ, సాంబశివరావు, నవీన్‌లు విజయవంతంగా చికిత్స అందించారు.

కోడ్ ఉల్లంఘనపై ఫిర్యాదు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం అధికారాన్ని దుర్వినియోగం చేయడం ప్రారంభించిందని, విజయనగరం జిల్లా చీపురుపల్లి శాసనసభ్యులు కళా వెంకటరావు ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి పోటీ చేస్తున్న పిడిఎఫ్ అభ్యర్థి కె.విజయగౌరి తరపున ఆమె ఎన్నికల ఏజెంట్‌గా ఎ.అజశర్మ ఆదివారం ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు. ఉత్తరాంధ్రలో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న సమయంలో సదరు ఎమ్మెల్యే గుర్ల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లి అక్కడ ప్రధానోపాధ్యాయుని కుర్చీలో కూర్చొని టిడిపి మద్దతు తెలిపిన అభ్యర్థికి స్కూలు పరిధిలోని అన్ని ఓట్లూ వేయాలని కోరడం అధికార దుర్వినియోగమే అవుతుందని పేర్కొన్నారు. హెచ్‌ఎం కుర్చీలో కూర్చొని ఎన్నికల ప్రచారం చేపట్టడం తగదని అజశర్మ తెలిపారు. ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించడానికి తగు ఏర్పాట్లు చేయాలని ఎన్నికల అధికారులను కోరారు.

పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డారాజశేఖర్‌రెడ్డి, నంద్యాల కలెక్టర్ రాజకుమారి

భ్రమరాంబ, మల్లికార్జునులకు పట్టువస్త్రాల సమర్పణ

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జునులకు రాష్ట్ర ప్రభుత్వం తరపున దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి పట్టు వస్త్రాలు సమర్పించారు. మంత్రి, ఎమ్మెల్యేకు ఆలయ రాజగోపురం వద్ద దేవస్థానం ఇఒ శ్రీనివాసరావు, ఆలయ అధికారులు, అర్చక స్వాములు, వేదపండితులు స్వాగతం పలికారు. అనంతరం స్వామి అమ్మవార్లకు మంత్రి, ఎమ్మెల్యే పట్టు వస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్, నంద్యాల జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి, జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్, చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ చంద్రశేఖర్ ఆజాద్ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు విజయవాడ ఇంద్రకీలాద్రి దుర్గా మల్లేశ్వర స్వామి ఆలయం తరపున రాష్ట్ర దేవదాయ కమిషనర్, కార్యనిర్వాహణ అధికారి కె.రామచంద్ర మోహన్ కూడా పట్టు వస్త్రాలను స్వామి అమ్మవార్లకు సమర్పించారు.

శివపార్వతులకు రావణ సేవ

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లకు రావణ సేవ నిర్వహించారు. అనంతరం అమ్మవార్లను శ్రీశైల క్షేత్ర ప్రధాన వీధులలో గ్రామోత్సవం నిర్వహించారు. ఈ గ్రామోత్సవంలో నాదస్వరం, కోలాటం, చెక్కభజన, రాజభటుల వేషాలు, కేరళ చండీ మేళం, కొమ్ము కొయ్య నృత్యం, ముంబయి డోల్‌దేష్, విళక్కు, స్వాగత నృత్యం, వీరభద్ర డోలు కునిత, జాంజ్ పథక్, (కర్ణాటక డోలు) కాళికా నృత్యం, జానపద పగటి వేషాలు, నందికోలు సేవ, గురవయ్యల నృత్యం, తప్పెట చిందు, బీరప్ప డోలు, ఢమరుకం, చిడతలు, శంఖం, పిల్లనగ్రోవి, డోలు విన్యాసం, గిరిజన చెంచు నృత్యం తదితర కళారూపాలు ఆకట్టుకున్నాయి.

తొట్టంబేడులో మహిళకు జిబిఎస్ !

- స్విమ్స్‌లో చికిత్స
- నిర్ధారణ అయితే జిల్లాలో మొదటి కేసు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

తిరుపతి జిల్లా తొట్టంబేడు మండలం పూడి దళితవాడకు చెందిన మహిళకు జిబిఎస్ వైరస్ లక్షణాలున్నట్లు వైద్యాధికారులు గుర్తించారు. దీంతో వైద్యాధికారులు అప్రమత్తమయ్యారు. కలుషితమైన నీటిని తాగడం వల్ల ఈ వైరస్ శరీరంలోకి ప్రవేశస్తుందన్న తరుణంలో కాసరం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు శనివారం పూడిలోని ఆర్వో ప్లాంటును సందర్శించారు. ప్లాంటు వద్ద నీటి నమూనాలను సేకరించారు.

పూడి దళితవాడకు చెందిన మహిళ పది రోజుల కిందట జ్వరం బారిన పడ్డారు. పట్టణంలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స తీసుకున్నారు. నాలుగు రోజులనంతరం జ్వరం తీవ్రం కావడంతో గ్రామంలోని వైద్య సిబ్బంది వద్ద చికిత్స తీసుకున్నా పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో నాలుగు రోజుల కిందట తిరుపతి స్విమ్స్‌లో చేరారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగానే ఉన్నా నడుం కింద నుంచి కాళ్ళ వరకు శరీరావయవాలు సహకరించడం లేదని సమాచారం. ఈ విషయంపై కాసరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మాధవ్‌ను వివరణ కోరగా మహిళకు వ్యాధి లక్షణాలు ఉన్న మాట వాస్తవమేనన్నారు. అయితే నిర్ధారణ అయ్యేవరకు ఏమి చెప్పలేమని తెలిపారు.

నమోదిత కార్యాలయం : 601 & 602, పెనిన్సుల బిజినెస్ పార్క్, 6వ అంతస్తు, టవర్ ఎ, సేనాపతి బాపత్ మార్గ్, లోయర్ పారెల్, ముంబాయి-400 013

డిసిబి బ్యాంక్

బహిరంగ ప్రకటన
అభరణాల వేలం కమ్ ఆహ్వాన నోటీసు

దిగువ పేర్కొన్న రుణగ్రహీతలు డిసిబి బ్యాంక్ లిమిటెడ్ నుండి అభరణాలు ఎదురుగా వారిచే పొందిన రుణసౌకర్యాలు మొత్తం బకాయిలు చెల్లించుటకు నోటీసులు జారీచేయబడినాయి. మొత్తం బకాయిలు చెల్లించుటలో వారు విఫలమైన కారణంగా తాకట్టుపెట్టిన అభరణాల వేలం నిర్బంధంగా మేము నిర్వహిస్తున్నాము. డిసిబి బ్యాంక్ లిమిటెడ్ ఎలాంటి ముందస్తు నోటీసు లేకుండా ఖాతా(లు) తొలగించుట/వేలం తేది(లు) మార్చే అధికారం కలదు. **06.03.2025 మరియు 07.03.2025న మ.12:00 గం.ల నుండి మ.03:00 గం.ల వరకు వేలం https://egold.auctiontiger.net** ద్వారా ఆన్‌లైన్‌లో నిర్వహించబడును.

క్ర. సం.	ఖాతాదారుని ఐడి	ఖాతాదారుని పేరు	ప్రాంతం/ప్రదేశం
1	105552727	వెజ్జు దుర్గారావు	ఆకివీడు
2	104485226	చిన్నప్ప రెడ్డి రామ మోహన్	అనంతపురం
3	106809457	పులోల్లు మధు సాయి	అనంతపురం
4	104878131	కొల్లి నాగశ్రీను	చిట్టివలస
5	107040656	గడ్డి సింహాచలం	ఏలూరు
6	105487574	బెల్లంకొండ సతీష్	ఏలూరు
7	103330878	తుమ్మిడి శ్యామల	గంగాధరపురం
8	103158333	గుమ్మడి లావణ్య రాసి	గంగాధరపురం
9	105435670	ఇజ్జాడ సత్యనారాయణ	గంగాధరపురం
10	102263952	దుసనపుడి శ్రీనివాసరావు	గంగాధరపురం
11	105756068	బడ్డుల రమాదేవి	గుంటూరు
12	106751455	వడ్లముడి జీవన జ్యోతి	గుంటూరు
13	104862908	నెల్లి రమేష్	కాకినాడ
14	105049490	జొన్నాదుల శివ కుమార్	కాకినాడ
15	106183403	ప్రత్తి సురేఖ	కాకినాడ
16	105567348	షేక్ నస్రీన్ సుల్తాన	కర్నూలు
17	105759703	టి.హరి ప్రియ	కర్నూలు
18	102903262	పిన్నమరాజు వంశీకృష్ణ	పెరూరు
19	106679078	చిట్టాల సాయి మహాలక్ష్మి	పైడిపర్రు
20	105461301	గంగుమళ్ల రత్నకుమారి	రాజమండ్రి
21	105543122	బడేటి పార్వతి	రాజమండ్రి
22	102819535	రత్నం వీర రాజేష్‌బాబు	రాజమండ్రి
23	107097989	అంధవరపు సత్యవతి	శ్రీకాకుళం
24	103051785	కామేశ్వరరావు అన్నెపు	శ్రీకాకుళం
25	105578847	ఇ జనార్ధన్	తిరుపతి
26	106857674	షేక్ ఖాదర్‌బాష	తిరుపతి
27	105509976	షేక్ అల్తాఫ్ అహ్మద్ షరి	విజయవాడ
28	105529762	మంధరపు లక్ష్మి	విజయవాడ
29	104461984	ఇంటి మనోహర్ కుమార్	విశాఖపట్నం
30	106495127	రేసు ఏసు రాజు	విశాఖపట్నం
31	106762539	కన్నెగంటి జీవన్	విశాఖపట్నం
32	107086104	గురజాపు ఝాన్సీ	విజయనగరం

షెడ్యూల్ వేలం తేది ముందు వరకు ఉన్న వడ్డీ మరియు చార్జీలుతో పూర్తి బకాయిలు చెల్లించే సౌలభ్యం సంబంధిత రుణగ్రహీతలు/తాకట్టుపెట్టిన వారికి చివరిగా ఒక అవకాశం ఇవ్వడమైనది విఫలమైతే ఈ అభరణాలు వేలం వేయడం జరుగుతుంది. ఒకవేళ వేలం సూచించిన వేలం తేదిలలో పూర్తికాలేకపోయినట్లయితే తదుపరి నోటీసు లేకుండా వేలం ఇతర రోజులు కొనసాగించబడును. బిడ్ల వేలం మరియు అంగీకారంలో పాల్గొనడం డిసిబి బ్యాంక్ యొక్క స్వంత అభీష్టానుసారం ఉంటుంది. దయచేసి గమనించవలసింది ఏమనగా వేలం "ఏది ఎక్కడ ఉందో", "ఆ పద్ధతి ఆధారం", "ఏది ఏమైనా ఆ పద్ధతిగా" మరియు "ఎలాంటి మద్దతు లేకుండా" జరుగును, అభరణాలకు సంబంధించి ఎలాంటి దావాలకు బాధ్యత వహించదు. వేలంలో పాల్గొనుటకు బిడ్డర్‌లు వివరణాత్మక నిబంధనలు మరియు షరతుల కొరకు **https://egold.auctiontiger.net** చూడండి.

తేది:24.02.2025

సం/- అధీకృత అధికారి
డిసిబి బ్యాంక్ లిమిటెడ్

"న్యాయం గెలుస్తుంది అన్న మాట నిజమే కానీ, గెలిచేదంతా న్యాయం కాదు."
– శ్రీశ్రీ

ఊరికే వుండలేను

చుట్టూ ఇంత పొగ మంచు
కమ్ముకున్న వేళ
రెండు అక్షరాలు రాయకుండా
వుండలేను

జీవితం చుట్టూ ఇంత బూడిద
పడుతున్న వేళ
రెండు వాక్యాలు రాయకుండా
వుండలేను

ఎవడికోసమో పసిపాపల గొంతు
కోస్తున్న వేళ
రెండు కన్నీటి చుక్కలను
కాకుండా వుండలేను

భూమిని చెరబట్టి బాంబులు
కురిపిస్తున్న వేళ
వాడి చేతులలో బూబి ట్రాప్
అయి పేలకుండా వుండలేను!

– కెక్యూబ్ వర్మ,
94934 36277

విరుద్ధాంశాలు

ఔట్సోర్సింగ్ ఉద్యోగిని చేసి
సపాయి కార్మికుని కాళ్లు కడిగి
నెత్తిన నీళ్లు చల్లుకుంటారు
ఉత్పత్తులను పెంచి
చెత్త బండిని ఇంటింటికి తిప్పి
ప్లాస్టిక్ నిషేధించబడిదని ప్రకటిస్తారు

నదీ తీరాల్లో ఫ్యాక్టరీలు కట్టి
జీవధార కలుషితం అయ్యాక
పవిత్ర పుణ్య స్నానాలు చేస్తారు
వాడవాడలా మద్యం దుకాణాలు తెరిచి
పోలీసులతో పైపులు ఊదించి
జరిమానాలు విధిస్తారు
పేదరికాన్ని పెంచే చట్టాలు చేసి
చిన్న పిల్లల్ని పనిలో పెట్టొద్దని
లేబర్ ఆఫీసర్ యజమానిని శిక్షిస్తాడు

సామాన్యులు న్యాయం కావాలని
న్యాయస్థానాలను ఆశ్రయిస్తే
వాయిదా మీద వాయిదాలు వేస్తారు
రాజకీయ మాన్యుల వ్యాజ్యాలు
సత్వరమే తీర్పులు వెలువరిస్తారు
రక్తం అంతా ఒక్కటే అని
మానవులంతా సమానమే అని
కులాల అంతరాలను పాటిస్తారు

కాంక్ష రహిత ధ్యాన యోగులు
కుటుంబం లేని బ్రహ్మచారులు
ప్రజా క్షేమం కోరి
నాయకులై పరిపాలిస్తారు
ఔషధీ నదుల్ని మురికి కూపాలు చేశాక
గాలిని కాలుష్యంతో నింపాక
వస్తువులతో ఇల్లును దుకాణంగా
మార్చాక
గాంధీ గారి కళ్ళద్దాల నుంచి
స్వచ్ఛభారత్ కలగంటారు!

– జూకంటి జగన్నాథం

కిడ్నాప్ నాటికలోని ఓ ఆసక్తికర సన్నివేశం

27వ మైలు రాయి లో ఒక దృశ్యం

పోటాపోటీగా, కనువిందుగా...

యూత్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ ఫోరమ్ (న్యూ ఢిల్లీ), కళా విపంచి (హైదరాబాద్) సంయుక్త నిర్వహణలో '25 ఫిబ్రవరి 15, 16 తేదీల్లో విజయవాడ శ్రీ వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయంలో– తెలుగు రాష్ట్రాల స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు దిగ్విజయంగా జరిగాయి.

ఉత్తమ నాటిక, ఉత్తమ రచన బహుమతులు సాధించిన 'నిశ్శబ్దమా నీ ఖరీదెంత?' రచయిత పి.టి.మాధవ్‌ను నిర్వాహకులు సన్మానిస్తున్న దృశ్యం

... కాదు.. పూజిస్తాం. ప్రకృతితో మమేకమవుతూ పారమార్థిక చింతనతో జీవించే అద్భుత జాతి మాది.' 'మహిళలు అబలలు కాదు. శక్తి స్వరూపిణులు' ఇత్యాది సంభాషణలను ప్రేక్షకులు ఆనందించారు.

సారీ.. రాంగ్ నెంబర్ : చాటింగులు, డేటింగులు, ...

... నాటిక ప్రారంభమవుతుంది. 'సురభి' ప్రభావతి, విజయవాడ పవన్ (అవార్డీ), పిళ్లా వంటి మేటి నట బృందంతో ...

పి.టి.మాధవ్ పోరాటం నూరుశాతం న్యాయసమ్మత మైనదని సర్వులూ నిస్సందేహంగా స్వరం కలుపుతారు. దురదృష్టవశాత్తూ ప్రమాదాలు జరిగిన సందర్భాల్లో జనరల్ బోగీల ప్రయాణికుల శవాలకు దిక్కూ మొక్కూ లేకుండా పోతోందని.. కొడుకు మృతదేహం కాదు గదా– కనీసం ...

... రెండు అతి చిన్న డైలాగులయితేనేం.. పాత్రతో తాదాత్మ్యం చెందడమంటే ఏంటో కూడా నూరుశాతం నిరూపించారు. 'నాటి కౌరవ సభ నుంచి నేటి గౌరవ సభ వరకూ స్త్రీలు అవమానాలు పడుతూనే ఉన్నారు' వంటి పదునైన సంభాషణలు... తగ్గ అభినయంతో– ...

– జి.వి.రంగారెడ్డి, సీనియర్ పాత్రికేయులు
99126 15747

2న 'శతర' కవితాసంపుటి ఆవిష్కరణ

మార్చి 2న (ఆదివారం) ఉదయం 10 గంటలకు హైదరాబాద్ బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సిరికి స్వామినాయుడు రాసిన 'శతర' ఆదివాసీ కవితాసంపుటి ఆవిష్కరణ, ప్రత్యామ్నాయ సృజనకారుల సాహిత్య సదస్సు జరుగుతాయి. ఈ సభలో జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి, కె.శ్రీనివాస్, జయధీర్ తిరుమలరావు, అట్టాడ అప్పలనాయుడు, కె.ఎన్.మల్లీశ్వరి, మల్లిపురం జగదీష్, దాసోజు లలిత పాల్గొంటారు. అనంతరం జరిగే సాహిత్య సదస్సులో పద్దం అనసూయ, విమలక్క, కొండవీటి సత్యవతి, పలమనేరు బాలాజీ, పల్లిపట్టు నాగరాజు, డా.జిలుకర శ్రీనివాస్, సొలోమోన్ విజయకుమార్, విద్యాసాగర్ పొల్లా, మోహన్ బాబు, గుమ్మడి లక్ష్మీనారాయణ, వేంపల్లి షరీఫ్, చెలికంపల్లి కొండారెడ్డి, నెమిలేటి, జూకంటి జగన్నాథం, అపర్ణ తోట, అనిల్ బత్తుల, అరుణాంక్ లత, రాజేంద్ర ప్రసాద్ మహేశ్వరం, అవధానం రఘుకుమార్ పాల్గొంటారు.

– జయధీర్ తిరుమల రావు

కవిత - 2024కు కవితలకు ఆహ్వానం

విజయవాడ సాహితీమిత్రులు వెలువరిస్తున్న కవిత 2024 కోసం కవితలకు ఆహ్వానం పలుకుతున్నాం. గత ఏడాది జనవరి నుంచి డిసెంబర్ వరకూ ప్రింట్, వెబ్ పత్రికల్లో ప్రచురితమైన కవితలను మార్చి 15 లోగా editor.kavitha2024@gmail.com కు పంపండి. వాట్సాప్, ఫేస్‌బుక్ గ్రూపుల్లో మాత్రమే పెట్టినవి పంపొద్దు. పత్రికలలో ప్రచురితమైన కవితల ఇమేజ్ / పిడిఎఫ్ మాత్రమే పంపండి. కవితల ఎంపికలో సంపాదకులదే తుది నిర్ణయం.

– విశ్వేశ్వరరావు, సాహితీమిత్రులు

28న నాగస్వరం పరిచయ సభ

కోయి కోటేశ్వరరావు కవితాసంపుటి నాగస్వరం పరిచయ సభ ఫిబ్రవరి 28 శుక్రవారం సాయంత్రం 6 గంటలకు గుంటూరు బ్రాడిపేట యు.టి.ఎఫ్.కార్యాలయంలో జరుగుతుంది. పోలే ముత్యం అధ్యక్షతన జరిగే ఈ సభలో పెనుగొండ లక్ష్మీ నారాయణ, జి.లక్ష్మీ నరసయ్య, విల్సన్ రావు కొమ్మవరపు, కాకాని సుధాకర్, ఎస్.బాలస్వామి, జె.విద్యాసాగర్, పల్నాటి శ్రీరాములు, చుక్కా నాగభూషణం, శశిధర్ తదితరులు పాల్గొంటారు.

చరిత్రకెక్కిన ఆదివాసీల తెగువ

డాక్టర్ కె.జి.వేణు

ఈ నేల మీద అచ్చమైన మానవజాతి నిర్వచనాలకు నిలువెత్తు సాక్ష్యంగా నిలిచే రూపాలు 'ఆదివాసీలు'. మట్టికణాలు ముద్దాడిన మొదటి నివాసితులు వారు. అడవుల్లో, కొండల్లో చెట్ల ఆకుల నీడలన్నీ ఉయ్యాలైతే, అందులో ఊగి తరించిన హక్కుదారులు 'ఆదివాసీలు'. ఎండల్లో, వానల్లో రాళ్లమధ్య ...



గోదావరి జిల్లా మన్యంలో స్వాతంత్ర్య పోరాటం
ర్యాలి ప్రసాద్

... బలవంతంగా, అన్యాయంగా ఆక్రమించుకుని అనుభవిస్తున్న జమిందార్ సిద్దిఖీ'ని హత్యచేసి, తర్వాత జరగబోయే పోరాటాలకు తన ఉనికిని పరిచయం చేసుకున్నాడు. మరోసారి 'కొమరం భీమ్' చారిత్రాత్మక పోరాట కథనాలను తెరమీద దృశ్యాలుగా రచయిత అందించారు. క్రీ.శ. 1857 సిపాయిల తిరుగుబాటుకు ముందే బ్రిటీష ప్రభుత్వాన్ని ఎదురించి పోరాడిన పోరాట సింహం 'రాంజీగోండ్' సంగతులన్నీ ఈ పుస్తకం గుర్తు చేస్తోంది. ...

... గిరిజనులు తిరగబడిన తీరు, మహాయుద్ధాలలోని సన్నివేశాలను మురిపించింది. బీహారులోని సంతాల్ గిరిజనులపై ఆధిపత్యం కొనసాగిస్తూ, ఆ తెగ స్త్రీలపై అత్యాచారాలను దినచర్యలుగా మార్చుకున్న బ్రిటీష అధికారులపైన ఆగ్రహంతో క్రీ.శ 1855–56లో సంతాల్ తెగవారు జరిపిన తిరుగుబాటులో కామాంధుల పుర్రెలు పుచ్చకాయల్లా పగిలిపోయాయి. ఈస్ట్ ఇండియా కంపెనీ ...

... పోరాటాలను సమగ్రంగా వివరించే పాఠశాలలుగా రచయిత అందించారు. ఈ పోరాటాలలో నేలకొరిగిన ప్రతి గిరిజన శిరస్సు నుంచి సహస్ర శక్తులు తిరిగి మరో పోరాటానికి కాలం ఆకురాయి మీద పౌరుషాన్ని సానబెట్టటం, ఆ గిరిజన పోరాటాలకు సొంతమయిన ఒక ప్రత్యేకత. ఆదిలాబాదు గొండు తెగకు చెందిన కొమరం భీమ్ ... తన కుటుంబం సాగు చేసుకుంటున్న భూమిని ...

... దమనకాండలతో పాటు, ఆ దుర్మార్గపు దోపిడి, పాశవిక దౌర్జన్యాల వికృత రూపాలను, వాళ్లకు తొత్తులుగా మారిన వ్యక్తుల మోసపూరిత తత్వాలను, తెల్లవారికి సహకరించిన కొన్ని జమిందారీ వ్యవస్థలలోని డొల్లతనాలను, భారతదేశ చరిత్రలోని ఎన్నో అధ్యాయాలను ఆసక్తికరమైన వ్యాఖ్యానాలతో ఈ పుస్తకంలో అందించారు. రచయిత ర్యాలీ ప్రసాద్ కృషి అభినందనీయం.

సనాతనం

పల్లవి :
సనాతనం అంటే
అంటే మానవతే లేనిదా!
మానవత్వమన్నది సనాతనం కానిదా!
మన సంస్కృతి, మన సంపద
జనహిత సహనం కాదా?
//సనాతనం అంటే!//

1
రాతి ముక్క రాపిడిలో నిప్పును కనుగొంటేనే ,
చీకటి బతుకుల్లోన దీపం వెలిగింది..
పత్తి పూల దారాలతో వస్త్రమల్లితేనే,
నాగరీక దారుల్లో రూపం కదిలింది..
ఆది నరుల అనుభవాల సారం గద జ్ఞానం!
పురోగమనమే కదా! మానవ ప్రస్థానం
//సనాతనం అంటే!//

2
వేదకాల వర్ణాలు నాలుగే అయినప్పుడు
వేల వేల కులాలుగా చీల్చేసిందెవ్వరు?
ప్రేమ కలువ పూల కొలను.. వెలి రేవుల విషాదాలు!
అంటరాని స్మశానాలు.. వెంటాడే జ్ఞాపకాలు!
పంచములను సృష్టించిన వంచనవాదం గుట్టు
ఎందుకు నవరస నటనలు తెలిసి, తెలియనట్టు!
//సనాతనం అంటే!//

3
సతులకు సహగమనాలు, శిరోముండనాలు
తెల్ల చీర ముసుగుల్లో తెల్లారే బతుకులు
పురాణాల ప్రవచనాల ప్రవాహాలు ఒకవైపు
అమానుషం ప్రకటించే సమూహాలు ఒకవైపు
మనసేమో ఇరుకు గది మాటేమో మహానది!
విననప్పుడు జీవఘోష వింత గదా దేవ భాష!?
//సనాతనం అంటే!//

4
సహజీవన సంస్కృతిలో సమ భావన విరుస్తోంది
ప్రేమ సీమలోని ప్రాణవాయువు చూపిస్తోంది
అధునాతన మృదు భావన పరిమళాల వేళ..
పురాతనం వనజీవుల పలవరింతలేలా!
నింగిలోన మానవుల జ్ఞానం విహరిస్తుంటే..
నేల మీద అంతరాలు ఏలా అభ్యంతరాలు!?
//సనాతనం అంటే!//

– నల్లి ధర్మారావు
76609 67313

ఎందుకీ దిగజారుడు సంస్కృతి?

సాహిత్యం సమాజహితం కోరాలి. సమాజంలోని మంచిచెడ్డ లను పరామర్శించి, మంచిని ముందు పీఠిన నిలబెట్టాలి. కవులూ రచయి తలూ సాహిత్య విమర్శకులూ ఆ పనిని సమిష్టిగానూ, నిష్కర్షగానూ చేయాలి. అప్పుడే సాహిత్య సృజనకు సామాజిక విలువ. కానీ, ఊరకనే పొగడ్తలకు దిగటం, రచన ఎలాగున్నా పనస్సర జేజేలకు దిగటం ఆ మధ్యకాలంలో బాగా పెరిగింది. సోషల్ మీడియా వేదికలపై ఈ ధోరణి ...

... పత్రికలే ప్రగతిశీల సాహిత్యానికి పెద్దపీట వేస్తున్నాయి. మిగతావి వివిధ రకాల మసాలాలు దట్టిస్తున్నాయి. కార్పొరేట్ సంస్కృతి గల పెద్ద పత్రికల్లో సామాజిక అంశాలకు చోటు పెద్దగా దొరకటం లేదు. సాధారణంగా కవులూ రచయితలూ తమ రచనలు పత్రికల్లో అచ్చయితే చాలు, అదే పదివేలని భావిస్తారు. దాన్నే కొన్ని పత్రికలు చులకనగా చూస్తున్నాయి. రచనలోని విషయానికి కాక ఇతరత్రా అంశాలకు ప్రాధాన్యం ...

... సండేబుక్‌లలో వారానికి ఒకటో రెండో పుటలు మాత్రమే సాహిత్యానికి కేటాయిస్తున్నారు. ఈ పత్రికలను వాటి సర్క్యులేషన్ బట్టి పెద్దవి, చిన్నవిగా విభజించవచ్చు. వీటిలో వామపక్ష ...

... ఆదరణతోనే సాహిత్యానికి మేలు జరుగుతుంది. తద్వారా సమాజానికీ ప్రయోజనం చేకూరుతుంది.

– పిల్లా తిరుపతిరావు,
70951 84846

సత్యమేవ జయతే
భారత ప్రభుత్వం

ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధికి ఆరేళ్లు

ఇప్పటివరకు రైతులు దాదాపుగా
పొందినది రూ.3.15 లక్షల కోట్ల విలువవైన పారితోషికం

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రత్యేక్ష ప్రయోజన బదిలీ (డిబిటీ) పథకాలలో ఒకటి	రైతులకు ఏడాదికి రూ.6 వేల చొప్పన సాయం	పీఎం కిసాన్ లబ్ధిదారుల్లో 85 శాతానికి పైగా చిన్న, సన్నకారు రైతులే	పీఎం కిసాన్ లబ్ధిదారుల్లో నాలుగింట ఒకరు మహిళలే

ఇంకా, నేడుపీఎం కిసాన్ 19వ విడత కింద దేశంలోని
9.8 మంది రైతుల ఖాతాల్లోకి
రూ.22 వేల కోట్లను నేరుగా బదిలీ చేయనున్నారు

విత్తనాల నుండి మార్కెట్ వరకు రైతులకు అండగా నిలిచిన ప్రధాని మోది

గత పదేళ్లలో గోధుమలు, వరి, పత్తి పప్పుధాన్యాలు, నూనెగింజల కొనుగోలుకు రూ.20 లక్షల కోట్ల పైచిలుకు ఖర్చు చేశారు	రూ.12 లక్షల కోట్ల సబ్సిడితో రైతులు సకాలంలో, సరసమైన ధరల్లో ఎరువులు అందుకున్నారు	వ్యవసాయ బడ్జెట్‌కు పెరిగిన కేటాయింపులు–2014లో రూ.22 వేల కోట్ల కాగా ఈ ఏడాది దాదాపు ఐదింతలు పెరిగి రూ.1.27 లక్షల కోట్లకు చేరింది
2016 నుండి 2023 వరకు పంటల భీమా పథకం కింద రైతులకు రూ.1.27 లక్షల కోట్లు అందాయి.	దేశవ్యాప్తంగా 25 కోట్ల సాయిల్ హెల్త్ కార్డుల జారీ	1400పైగా వ్యవసాయ మార్కెట్లను ఈ–నామ్ వ్యవస్థకుఅనుసంధానం చేయడం ద్వారా రూ.4 లక్షల కోట్ల విలువైన లావాదేవీలు జరిగాయి.
అధిక దిగుబడినిచ్చే విత్తల వంగడాల సంఖ్యను 1390 నుండి 2900కు పెరిగింది.	సంప్రదాయ వ్యవసాయాభివృద్ధి పథకం కింద 25 లక్షల మంది రైతులకు, 15 లక్షల హెక్టార్లలో సేంద్రియ, ప్రకృతి సేద్యం ద్వారా లబ్ధిచేకూరింది.	పర్ డ్రాప్ మోర్ క్రాస్ క్రింద సూక్ష్మ సేద్యం 42 లక్షల హెక్టార్ల నుండి 100 లక్షల హెక్టార్లకు విస్తరించింది
ప్రపంచ పాల ఉత్పత్తిలో భారతదేశం మొదటి స్థానంలో ఉండి, మొత్తం ప్రపంచ ఉత్పత్తిలో దాదాపు 25% వాటా కలిగి ఉంది.	పశువుల భద్రతకు భరోసా కల్పిస్తూ ఫుట్ అండ్ మౌత్ డిసీజ్ (ఎఫ్ఎండి) పై పోరాడేందుకు 100 కోట్ల పై చిలుకు టకాల అందజేత	ఆధునిక వ్యవసాయాన్ని ప్రొత్సహించేందుకు రూ.2.25 లక్షల ప్రధాన మంత్రి క్రిషి సమృద్ధి కేంద్రాలు (పీఎంకెఎస్‌కే) ఏర్పాటు

కిసాన్ సమ్మాన్ కార్యక్రమం ద్వారా...

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా

పీఎం కిసాన్ 19వ విడత బదిలీ	10,000 రైతు ఉత్పత్తిదారుల సంఘాలు (ఎఫ్‌పీవో)జాతికి అంకితం	మోతీహరిలో స్వదేశీ జాతుల కోసం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, బరౌనీలో పాల ఉత్పత్తి కర్మాగారం ప్రారంభోత్సవం

అదనంగా రూ.570 కోట్లకు పైగా వ్యయంతో వారి సాలిగంజ్-నవాడా-తిలైయా (36.45 కి.మీ.) రైలు విభాగాన్ని డబ్లింగ్ చేయడం ఇస్మాయిల్‌పూర్-రఫీగంజ్‌రోడ్ ఓవర్ బ్రిడ్జి జాతికి అంకితం

తేది 24 ఫిబ్రవరి, 2025 | సమయం: మధ్యాహ్నం 12.00గం.లు | వేదిక: భాగల్‌పూర్, బీహార్ CBC 01102/13/0013/2425

డీడీ న్యూస్, డీడీ కిసాన్ ఛానళ్లలో ఈ కార్యక్రమం ప్రత్యక ప్రసారం

నేడు పార్వతీపురంలో చికెన్, ఎగ్ మేళా

ప్రజాశక్తి - పార్వతీపురం

పార్వతీపురం మన్యం జిల్లాలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత చికెన్, ఎగ్ మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా పశు సంవర్ధక అధికారి డాక్టర్ శివ్వాల మన్మధరావు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సోమవారం సాయంత్రం 5 గంటల నుండి 7 గంటల వరకు పార్వతీపురంలో భాస్కర డిగ్రీ కళాశాల సమీపాన (పెట్రోల్ బంకు)లోను, కొత్తవలస అమ్మవారి గుడి సమీపంలో ఈ మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఒక్కో ప్రాంతంలో 200 కేజీల చికెన్ వంటకాలను, రెండు వేల వుడికించిన గుడ్లను ఉచితంగా పంపిణీ చేయనున్నట్టు ఆయన పేర్కొన్నారు.

వెంకటాపురం సమీపాన ఏనుగుల సంచారం

ప్రజాశక్తి - కురుపాం

జియ్యమ్మవలస మండలంలో గల వెంకటాపురం గ్రామ సమీప ప్రాంతంలో ఏనుగుల గుంపు ఆదివారం సంచరిస్తూ పంటలను నాశనం చేశాయి. దీంతో రైతులు పంట పొలాల వద్దకు వెళ్లాలంటే భయాందోళన చెందుతున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. గత కొన్ని రోజులుగా గరుగుబిల్లి మండలంలో సంచరించిన ఏనుగుల గుంపు మళ్లి జియ్యమ్మవలస మండలంలోకి అడుగుపెట్టాయని, వీటిని పూర్తిగా గ్రామాలకు రాకుండా దూరంగా అటవీ ప్రాంతానికి తరలించి తమ పంటలను ప్రాణాలకు రక్షణ కల్పించేలా అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇప్పటి వరకు నాశనం చేసిన పంటలను అంచనా వేసి నష్టపరిహారం ఇప్పించాలని రైతులు కోరుతున్నారు.

మిస్టర్ ఆంధ్ర ఓపెన్ బాడీ బిల్డింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - చింతలపూడి

. చింతలపూడి పట్టణంలోని ఫైర్ స్టేషన్ వద్ద మిస్టర్ ఆంధ్ర ఓపెన్ బాడీ బిల్డింగ్ ఛాంపియన్‌షిప్, అండ్ మెన్స్ ఫిజిక్స్ 2025 పోటీలు ఏలూరు ఎంపి మహేష్‌కుమార్ యాదవ్ ప్రారంభించారు. డిఎఫ్ఎస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలు ఉల్లాసంగా, ఉత్సాహంగా మొదలయ్యాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాడీ బిల్డింగ్ అనేది అంత తేలిక కాదు అని, తీరైన రూపం రావాలి అంటే ఏళ్లకొద్ది కఠోరంగా శ్రమించాల్సిందేనని అన్నారు. ఆహారం, శిక్షణ కోసం భారీగా వెచ్చించాలని, ప్రోటీన్లు సప్లిమెంట్‌లో ఉన్న ఆహారం తీసుకోవడానికి రోజూ ఖర్చు పెట్టాలని తెలిపారు.

సాంస్కృతిక సంస్థల ఆప్తుడు వైఎస్ఆర్ మూర్తి మృతి

ప్రజాశక్తి - కల్చరల్

అంతర్జాతీయ సాంస్కృతిక సేవా సంస్థ వైజ్ మెన్స్ క్లబ్‌లో వివిధ హోదాల్లో బాధ్యతలు నిర్వహించిన శ్రీరామచంద్ర మూర్తి (వైఎస్ఆర్ మూర్తి) ఆదివారం ఉదయం అకస్మిక మృతి చెందారు. వృత్తి రీత్యా అయన సివిల్ ఇంజనీర్. ఆయనకు భార్య కామేశ్వరి, కుమార్తె ఉన్నారు. గత కొంత కాలంగా గుండె సంబంధిత అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నారు. ఆయన మృతితో సాంస్కృతిక సంస్థల నిర్వాహకులు, పలువురు నృత్య సంగీత నాటక కళాకారులు దిగ్భ్రాంతి చెందారు. పలువురు సంతాపం ప్రకటించారు.

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి- గాజువాక :

అక్కిరెడ్డిపాలెంలో నివసిస్తున్న కర్రి ప్రవీణ్ (27) విశాఖ డెయిరీ సర్వీస్ రోడ్డులో ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గమనించి గాజువాక పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కేసు నమోదు చేశారు. కుటుంబ కలహాల కారణంగా చెట్టుకు ఉరివేసుకొని మృతిచెందినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతుడు కర్రి ప్రవీణ్ ఫ్రూట్ షాప్‌లో పనిచేస్తున్నాడు. మరిన్ని వివరాల కోసం గాజువాక పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఛైర్‌పర్సన్ మార్పునకు సన్నాహాలు...!

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట మున్సిపల్ ఛైర్‌పర్సన్ పదవిని మార్పు చేసే ఆలోచనలో వైసిపి నాయకులు పావులు కదుపుతున్నట్లు ప్రచారం సాగుతోంది. మున్సిపల్ కౌన్సిల్ ఏర్పడి మార్చి నాటికి 4 సంవత్సరాలు పూర్తవుతున్న నేపథ్యంలో చివరి సంవత్సరం ఛైర్‌పర్సన్‌ను, రెండవ వైస్ ఛైర్‌పర్సన్‌ను మార్పు చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. నాలుగేళ్ళ క్రితం జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ఛైర్‌పర్సన్‌గా అప్పటి హౌసింగ్ బోర్డు ఛైర్మన్ దవులూరి దొరబాబు తల్లి ఐదో వార్డ్ వైసిపి కౌన్సిలర్ దవులూరి పార్వతి ఛైర్‌పర్సన్‌గా పదవి చేపట్టాల్సి ఉండగా అప్పట్లో సిఎం వైఎస్ జగన్ ఆదేశాలతో ఒకే కుటుంబంలో రెండు పదవులు ఉండరాదనే నిబంధనతో గంగిరెడ్డి అరుణని ఛైర్‌పర్సన్‌గా ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారు. మొదటి వైస్ ఛైర్మన్, రెండో వైస్ ఛైర్మన్ పదవులు కూడా దొరబాబు తల్లికి దక్కలేదు. ఆ సమయంలో అయిదేళ్ల పాలన కాలంలో సగం కాలం తరువాత ఛైర్‌పర్సన్‌ను మార్పుచేసే ఒప్పందంతో అరుణకు ఈ పదవిని కట్టబెట్టడం జరిగినట్లు తెలుస్తోంది. ఇటీవల జరిగిన జనరల్ ఎన్నికల్లో వైసిపి ఓటమి పాలు కావడంతో ఈ విషయం ప్రక్కన పడింది. కాగా ప్రస్తుత ఛైర్‌పర్సన్ మార్పు అంశం తెరపైకి వచ్చింది. ఈ నేపథ్యంలోనే ఛైర్‌పర్సన్ పదవిని ఆశిస్తున్న ఒక మహిళా కౌన్సిలర్ ఇతర కౌన్సిలర్లను కలుసుకుని మద్దతు కోరుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. మున్సిపాలిటీలోని వైసిపికి 29 మంది, టిడిపికి ఇద్దరు కౌన్సిలర్లు ఉన్నారు. ఛైర్‌పర్సన్ మార్పు విషయంలో టిడిపి వైఖరి ఎలా ఉంటుందో స్పష్టత లేదు.

కలుషిత ఊటగెడ్డ నీరే గతి

- మరమ్మతుకు గురైన నీటి పథకం మోటారు
- ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టని యంత్రాంగం
- వల్దిపనసలో నీటికష్టాలపై నేతలు,అధికారుల నిర్లక్ష్యం
- చందాలు వేసుకుని స్వచ్ఛందంగా మరమ్మతులు

ప్రజాశక్తి- అరకులోయ రూరల్: మండలంలోని ఇరగాయి పంచాయతీ మారుమూల వల్దిపనస గ్రామానికి చెందిన ఆదిమజాతి గిరిజనులు (పీవీటీజీ) గుక్కెడు తాగునీటికి నానా అగచాట్లు పడుతున్నారు. కేంద్ర ప్రభుత్వ జల్ జీవన్‌మిషన్ పథకం ద్వారా ఇంటింటికి రక్షిత తాగునీటి అందించినా, దీనికి సంబంధించిన బోరు మోటార్ నెల రోజులకే మరమ్మతుకు గురికావడంతో వాటర్ ట్యాంకు దిష్టిబొమ్మలా మిగిలిపోయింది. ప్రజలకు నీటికష్టాలు మొదలయ్యాయి. దీనిపై అధికారులకు అనేకమార్లు చెప్పినా పట్టించుకోకపోవడం గ్రామానికి కిలోమీటర్ల దూరంలో వున్న ఊటగెడ్డ నుంచి కలుషిత బురద నీటిని తెచ్చుకుని నీటి అవసరాలను తీర్చుకుంటున్నారు. మరో గత్యంతరం లేని పరిస్థితుల్లో బురద నీటినే తాగడం వల్ల వ్యాధుల బారిన పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వల్దిపనస గ్రామంలో 36 కుటుంబాలకు చెందిన 219 మంది ఆదిమజాతి గిరిజనులు నివాసముంటున్నారు. వీరి కోసం ప్రభుత్వం రక్షితనీటి పథకాన్ని ఏర్పాటు చేసినా అది మరమ్మతులకు గురైనప్పుడు పట్టించుకునే దిక్కులేకపోవడంతో ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. దీంతో .తాగునీటి కోసం పొలాలు, వాగులు దాటుకుని వెళ్లి ఊటకుంటల్లోని నీటిని తెచ్చుకుంటున్నామని అంటున్నారు. ప్రస్తుతం ఎండలు మండుతుండడంతో ఊటకుంటలోని నీరు సైతం ఇంకిపోయి బురదమయంగా మారిందని, అయినా గత్యంతరం లేక అవే నీటిని తెచ్చుకుని, వాడుకుంటున్నామని అంటున్నారు. తాము పివిటిజి గిరిజనులు కావడంతో తమ సమస్యలపై అందరూ నిర్లక్ష్యం చేస్తున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. మోటారు బాగుచేయించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని స్థానిక సర్పంచ్, పంచాయతీ, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారెవరూ పట్టించుకోలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

చందాలు వేసుకుని పాడైన మోటారుకు మరమ్మతులు

ఎండలు మండుతుండడం, వేసవి సమీపించడంతో నానాటికీ తీవ్రమౌతున్న తాగునీటి కష్టాలపై అధికారులుగానీ, పంచాయతీ గానీ పట్టించుకోని పరిస్థితుల్లో గ్రామంలోని పివిటిజి గిరిజనులంత తలో కొంత విరాళం పోగేసుకుని జల్‌జీవన్‌మిషన్ పథకపు మోటర్ మరమ్మతులుకు పూనుకున్నారు.

తమ గ్రామం నీటికష్టాలపై అధికారుల నిర్లక్ష్యానికి గ్రామస్తులు మండిపడుతున్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు బురిడి రాజు గ్రామపెద్ద బురిడి నరసింగరావు, పీసా కమిటీ ఉపాధ్యక్షుడు బురిడి విజయ్ కుమార్, గెమ్మెలి సుబ్బారావు, వార్డ్ సభ్యుడు బురిడి సుందరి, అంగన్వాడి టీచర్ బురిడి సీతమ్మ, బురిడి లింగమ్మ,ఉన్నారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

ప్రజాశక్తి - రావులపాలెం

మండల పరిధి ఈతకోట జాతీయ రహదారి కల్వర్టు చెంత పంటకాలువలో ఆదివారం అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ చంటి తెలిపారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం .. ఒడిశా రాష్ట్రం మైర్ బంచ్ జిల్లా గొలగాడియా మండలం బడాబిసాల్ గ్రామానికి చెందిన బిసునాథ్ బాస్కె (40) గోపాలపురం అవంతి సీఫుడ్స్ కంపెనీలో పని చేస్తున్నాడన్నారు. అతను శనివారం కూడా పనిచేశాడని, అయితే ఆదివారం ఈతకోట అవంతీ కంపెనీలో సమీపంలో గల జాతీయ రహదారి చెంత గల కల్వర్టు కింద పంటకాలువలో శవమై కనిపించాడన్నారు. బాస్కె మృతదేహాన్ని కొత్తపేట ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించామన్నారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

లేపాక్షి ఆలయాన్ని యునెస్కో జాబితాలో చేర్చేందుకు కృషి చేయాలి

చరిత్రకారుడు మైనాస్వామి వినతి

ప్రజాశక్తి-పుట్టపర్తిరూరల్

లేపాక్షిలో ఉన్న వీరభద్రాలయ సముదాయానికి ఐక్యరాజ్యసమితి 'యునెస్కో' వారసత్వ కట్టడాల జాబితాలో శాశ్వతంగా చోటు సంపాదించడానికి ఓ నిపుణుల కమిటీని నియమించి నివేదికను తయారు చేయించాలని ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వ్యవహారాల శాఖ సంచాలకులు డాక్టర్ ఆర్. మల్లికా ర్జునకు విజ్ఞప్తి చేసినట్టు చరిత్రకారుడు మైనాస్వామి చెప్పారు. ఆయన శనివారం సాయంత్రం విజయవా డలో సంచాలకుడిని కలిసి నిపుణుల కమిటీ నియామక అంశంపై చర్చించినట్లు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. లేపాక్షి వీరభద్రాలయ సముదాయాన్ని యునెస్కో వారసత్వ కట్టడాల తాత్కాలిక జాబితాలో చేర్చినట్టు 2023 మార్చి 30న యునెస్కో ప్రకటించింది. అయితే రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అందుకనుగుణంగా ఆలయంలోని నిర్మాణ విశేషాలు, అత్యున్నత శిల్ప సంపద, అత్యద్భుత తైలవర్ణ చిత్రాలు, ప్రపంచంలోనే పెద్దదైన రాతి నంది భారీ విగ్రహం వంటి విషయాల పై సమగ్ర అధ్యయనం చేసి నివేదికను రూపొందించి కేంద్ర ప్రభుత్వానికి సమర్పించాలని మైనాస్వామి తన లేఖలో కోరారు.

జిఓ 3పై అసెంబ్లీలో ప్రస్తావించాలి

మంత్రి సంధ్యారాణికి ఆదివాసీ గిరిజన సంఘం వినతి

ప్రజాశక్తి - సాలూరురూరల్

గిరిజన ప్రాంతాల్లో 100 శాతం ఉద్యోగ నియామకాలకు సంబంధించిన జిఓ 3 పునరుద్ధరణపైనా, గిరిజనులకు ప్రత్యేక డిఎస్‌సి కోసం సోమవారం నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో ప్రత్యేకంగా ప్రకటన చేయించేలా కృషి చేయాలనికోరుతూ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణికి ఆదివాసీ గిరిజన సంఘం ఆదివారం వినతిని అందజేసింది. ఈ సందర్భంగా సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు సీదరపు అప్పారావు మాట్లాడుతూ.. షెడ్యూల్ ఏరియాలో ఉద్యోగ, ఉపాధ్యాయ నియమకాలు 100 శాతం గిరిజన యువతతో నియామకాలు చేపట్టాలని, ఏజెన్సీ స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేసేందుకు అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావన చేసి ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలని మంత్రిని కోరారు. అన్ని గిరిజన గ్రామాలకు రోడ్లు, వంతెనలు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. మంచినీటి సమస్య లేకుండా చేయాల న్నారు.

జిసిసికి ప్రత్యేక నిధులు కేటాయించి అటవీ ఉత్పత్తులైన చింతపండు, జీడి, కొండచీపుర్లు అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర ప్రకటించి జిసిసి ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. మెజారిటీ గిరిజన గ్రామాలను షెడ్యూల్ గ్రామాలుగా గుర్తించి ప్రకటించాలని కోరారు. సాలూరు పట్టణంలో గిరిజన భవనం నిర్మించాలని, సర్వే చేసిన వారందరికీ అటవీ పట్టాలు పంపిణీ చేయాలని, గెడ్డలు, నదులపై మినీ రిజర్వాయర్లు, చెక్ డాములు నిర్మించి సాగునీరందించాలని, దుగ్గేరు, నంద, కురుకూటి, వేటగానివలసలో పిహెచ్‌సిలు ఏర్పాటు చేయాలని కోరారు. పై సమస్యలన్నీ అసెంబ్లీలో ప్రస్తావించి పరిష్కారం దిశగా కృషి చేయాలని మంత్రిని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు మంచాల శ్రీను, మండల అధ్యక్ష కార్యదర్శులు వంతల సుందర్రావు, గెమ్మే జానకీరావు, కమిటీ సభ్యులు బాబయ్య, మెల్లిక అయోధ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు, మండల కార్యదర్శి తాడింగి గాసి పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టుకు మరో రహదారి

- గుడివాడ నుంచి కొత్తగా మాస్టర్ ప్లాన్ రోడ్డు మంజూరు
- సుమారు 60 ఎకరాల భూ సేకరణ
- సచివాలయాల వద్ద నోటిఫికేషన్ ప్రతులను అంటించిన అధికారులు

ప్రజాశక్తి-భోగాపురం (విజయనగరం)

విశాఖ మెట్రోపాలిటిన్ రీజియన్ డెవలప్‌మెంటు అథారిటీ (విఎమ్ఆర్‌డిఎ) మాస్టర్ ప్లాన్‌లో భాగంగా భోగాపురం మండలంలో 30 మీటర్లు వెడల్పుతో రహదారి నిర్మాణానికి రెండు రోజుల క్రితం నోటిఫికేషన్ జారీ చేసింది. గుడివాడ నుంచి ఎ.రావివలస జగనన్న కాలనీ వద్ద నిర్మిస్తున్న విమానాశ్రయ అప్రోచ్ రోడ్డు సర్కిల్ వరకు ఈ రహదారిని నిర్మించనున్నారు. ఈ మేరకు సుమారు 60 ఎకరాల భూమిని గుడివాడ, పోలిపల్లి, రావాడ, ఏ.రావివలస రెవెన్యూ గ్రామాల్లో సేకరించనున్నారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని ఆయా పంచాయతీల్లోని గ్రామ సచివాలయాల వద్ద సర్వే నెంబర్లుతో సహా నోటిఫికేషన్‌ను విఎమ్ఆర్‌డిఎ అధికారులు అంటించారు. అభ్యంతరాలను 15 రోజుల్లో తెలియజేయాలని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. దీంతో మళ్ళీ రైతుల్లో ఆందోళన మొదలైంది.

మాస్టర్ ప్లాన్ 2041లో భాగంగా మండలంలో మొట్టమొదటి రహదారికి విఎమ్ఆర్‌డిఎ శ్రీకారం చుట్టింది. గుడివాడ గ్రామం నుంచి జాతీయరహదారిపై ఉప్పాడపేట జంక్షను నుంచి విమానాశ్రయానికి వెళ్ళేందుకు కొత్తగా నిర్మిస్తున్న రహదారికి ఈ మాస్టర్ ప్లాన్ రహదారిని అనుసంధానం చేయనున్నారు. దీంతో తగరపువలస వైపు నుంచి వచ్చే వారు నేరుగా ఈ రహదారి నుంచి ఎటువంటి ట్రాఫిక్ సమస్యా లేకుండా విమానాశ్రయానికి చేరుకోనున్నారు. అందుకు ఈ రహదారిని ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా ఈ రహదారిని వేగంగా నిర్మించేందుకు అధికారులు చర్యలు ప్రారంభించారు. సుమారు 8 కిలోమీటర్ల రహదారిని 30 మీటర్లు వెడల్పుతో నిర్మించనున్నారు. దీనికి సంబంధించిన నోటిఫికేషనన్ను ఈ నెల 17వ తేదీన జారీ చేశారు.

రావాడ, పోలిపల్లిలోనే ఎక్కువ భూములు

మండలంలోని గుడివాడ, పోలిపల్లి, రావాడ, ఏ.రావివలస రెవెన్యూ గ్రామాలతో పాటు విశాఖ జిల్లా చిప్పాడ రెవెన్యూ పరిధిలో ఒక సర్వే నెంబరులో భూములను సేకరించనున్నారు. ఇందులో అత్యధికంగా రావాడ, పోలిపల్లి రెవెన్యూ గ్రామాల్లోనే రైతులు భూములు కోల్పోవలసి వస్తుంది. ముఖ్యంగా జాతీయరహదారి నుంచి అవంతి కళాశాల మీదుగా చిప్పాడ వెళ్ళే రహదారిలో గుడివాడ గ్రామం వద్ద నుంచి ఈ రహదారి ప్రారంభం అవుతుంది. అక్కడ నుంచి చిప్పాడ రెవెన్యూలో ఒక సర్వే నెంబరు ఉంటుంది. అనంతరం పోలిపల్లి రెవెన్యూ పరిధిలోని ఏటిపోలం మీదుగా అమనాం పక్క నుంచి రావాడ రెవెన్యూలో నుంచి వెళ్తుంది. రావాడ పరిధిలోని చెరువు పక్కన ఉన్న హుదూద్ ఇండ్ల పక్క నుంచి రావాడ గొల్లపేట గ్రామాల మీదుగా ఏ.రావివలస రెవెన్యూలోకి వస్తుంది. అక్కడ ఏ.రావివలస జగనన్న కాలనీ సమీపంలో నిర్మిస్తున్న విమానాశ్రయానికి వెళ్ళే రోడ్డుపై సర్కిల్ వద్దకు వచ్చి కలుస్తుంది. ప్రస్తుతం రైతులకు ఇంకా ఈ భూసేకరణకు సంబంధించిన వివరాలు తెలియలేదు. ఇప్పటికే విమానాశ్రయానికి భూమలిచ్చిన రైతులు ఈ రహదారితో ఇంకా విలువైన భూములను కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని పలువురు అంటున్నారు.

గెయిల్ ఇండియా సైక్లోథాన్

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

చమురు మరియు గ్యాస్ పరిరక్షణ గురించి అవగాహన కల్పించడానికి ప్రధాన కార్యక్రమం సాక్షం-2025 సందర్భంగా, గెయిల్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యాన ఆదివారం ఉదయం 8 గంటలకు సైక్లోథాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సైక్లోథాన్ నగరంలోని ఎస్‌కెవిటి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించారు. సైక్లోథాన్ సమయంలో సుమారు 50 నుండి 100 మంది పాల్గొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రమణ మూర్తి, గెయిల్ ఇండియా లిమిటెడ్ జనరల్ మేనేజర్ వైఎ కుమార్, సీనియర్ అధికారులు, ఉద్యోగులు, ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజలు సైక్లోథాన్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు. చమురు మరియు గ్యాస్ పరిరక్షణ యొక్క ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు.

వరుస చోరీ కేసుల్లో ఆరుగురు అరెస్టు

- రూ.10 లక్షల 20 వేల విలువైన వస్తువులు స్వాధీనం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

వరుస దొంగతనాలకు పాల్పడుతూ ప్రజలను హడలెత్తిస్తున్న ఆరుగురు దొంగలను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి ఆరు ద్విచక్ర వాహనాలు, 33 గ్రాముల బంగారం, 1/2 కేజీ వెండి, మూడు సెల్‌ఫోన్లు, రూ.85,000 నగదు స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా అడిషనల్ ఎస్‌పి భీమారావు తెలిపారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన చోరీ వివరాలను వివంచారు. భీమవరం రాయలం గ్రామానికి చెందిన అనుపోజు కృష్ణవంశీ, భీమవరం పట్టణానికి చెందిన ఓలేటి దుర్గా మల్లేశ్వరరావు, దగరపు ఎలియజర్, చాగల్లు గ్రామానికి చెందిన డొక్కు సాయికిరణ్, ఆకివీడు మండలం తాళ్లకోడు ప్రాంతానికి చెందిన నరమామిడి హరిబాబు, ఒక మైనరుపై జిల్లాలోని తాడేపల్లిగూడెం, ఉండి, కాళ్ల, కైకలూరు టౌన్, భీమవరం టూ టౌన్, భీమవరం టౌన్, రూరల్ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయని తెలిపారు. ఈ నేపథ్యంలో బృందాలుగా ఏర్పడి అతి తక్కువ కాలంలోనే నిందితులను పట్టుకుని వారి వద్ద నుండి భారీ మొత్తం రూ.10 లక్షల 20 వేలు విలువైన ద్విచక్ర వాహనాలు, బంగారం, వెండి, నగదు రికవరీ చేసినట్లు తెలిపారు. నిందితులను అరెస్ట్ చేశారు. సమావేశంలో డిఎస్‌పి ఆర్‌జె.సూర్య, వన్ టౌన్ సిఐ నాగరాజు, ఎస్ఐ కిరణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎప్పటికి పూర్తవుతాయో..!

- ఐదేళ్లుగా కొనసాగుతున్న కెజిబివి భవన నిర్మాణాలు- ఆందోళనలో విద్యార్థినులు

ప్రజాశక్తి-బొమ్మనహాల్ (అనంతపురం)

అనంతపురం జిల్లా బొమ్మనహాల్ మండలంలోని కస్తూరిబా గురుకుల జూనియర్ కళాశాల భవనాలు గత ఐదేళ్ల నుంచి నిర్మాణంలోనే ఉన్నాయి. దీంతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా తరగతి గదులు, వసతి గృహాలు లేకపోవడంతో గురుకుల కస్తూరిబా హైస్కూల్‌ను కూడా ఇక్కడే కొనసాగిస్తున్నారు. ఈనేపథ్యంలో విద్యాభ్యాసం, భోజనం ఒకేచోట చందంగా ఉందని విద్యార్థినులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చేసేది లేక విద్యార్థులు నేలపైన విద్యాభ్యాసం, చదువులు కొనసాగించాల్సిన పరిస్థితులు కొనసాగుతున్నాయి. గతంలో రూ.1.80కోట్లతో కస్తూరిబా గురుకుల జూనియర్ కళాశాల భవనాలకు అప్పటి నాయకులు, అధికారులు భూమిపూజ చేశారు. అప్పటి నుంచి నేటి వరకూ నిర్మాణ పనులు కొనసాగుతూనే ఉన్నాయి. ఎప్పుడు పూర్తవుతుందో అని విద్యార్థినులు ఎదురు చూస్తున్నారు. ఇటు హైస్కూల్ విద్యార్థినులు, అటు కళాశాల విద్యార్థినులకు తగినన్ని గదులు లేక ఇరుకు రూముల్లోనే కూర్చుంటున్నారు. మరుగుదొడ్లు, స్నానపు గదులు సరిపోవటం లేదని విద్యార్థులు వ్యక్తం చేస్తున్నారు. కర్ణాటక సరిహద్దు మండలం కావడంతోపాటు జిల్లా కేంద్రానికి 110 కిలోమీటర్ల దూరంలో ఉన్నందున ఉన్నతాధికారుల పర్యవేక్షణ కూడా కరువైందన్న విమర్శలు వినిపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నధికారులు చర్యలు తీసుకుని కళాశాల భవనాలను పూర్తి చేసి విద్యార్థులకు వసతితోపాటు నాణ్యమైన విద్యను అందించాలని విద్యార్థినులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయమై కస్తూరిబా గురుకుల బాలికల పాఠశాల నిర్వాహకురాలు (ఎస్ఓ) కమలమ్మను వివరణ కోరగా భవన నిర్మాణాలు ఇంకా పూర్తి కాలేదని, త్వరలోనే పూర్తవుతాయని ఆశిస్తున్నామన్నారు.

ఫారం నం. యుఆర్‌సి-2
చట్టం యొక్క చాప్టర్ 21 యొక్క పార్ట్-1 క్రింద రిజిస్ట్రేషన్‌కు సంబంధించి నోటీసు ఇచ్చు ప్రకటన.

(కంపెనీల చట్టం, 2013 యొక్క సెక్షన్ 374(బి) మరియు కంపెనీల (అథరైజ్డ్ టు రిజిస్టర్) రూల్స్, 2014 అనుసరించి)

1. (కంపెనీల చట్టం, 2013 యొక్క సెక్షన్ 366, సబ్ సెక్షన్ (2) అనుసరించి ఇందుమూలంగా తెలియజేయనది ఏమనగా నియోమాటిక్ టెక్నాలజీస్ లిమిటెడ్ లియబిలిటీ పార్టనర్‌షిప్ LLP వారు ఇప్పటి నుండి 15 రోజుల తర్వాత మరియు 30 రోజలలోపు కంపెనీల చట్టం 2013 చాప్టర్ XXI పార్ట్-1 ప్రకారం వాటాల పరిమితి గల కంపెనీగా రిజిస్టర్ చేయమని విజయవాడలో గల రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్‌కు ధరఖాస్తు చేయుటకు ప్రతిపాదించినారు.
2. కంపెనీ యొక్క ప్రధాన అంశాలు దిగువ విధంగా:
సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, ఐటి మరియు పూర్తి శ్రేణి ఐటి ఎనబుల్డ్ సర్వీసెస్ మరియు డ్రాఫ్ట్ మెమోరండం ఆఫ్ అసోసియేషన్‌లో పేర్కొన్నట్లు ఇతర అంశాలను చేపట్టుటకు క్లైయింట్ అవసరాల ప్రాతిపదికన ప్రస్తుత సాఫ్ట్‌వేర్ ప్రాడక్ట్స్‌కు మెయింటేనన్స్/ సర్వీస్ సమకూర్చుటకు ఇటీవలి సాంకేతికత వినియోగిస్తూ కొత్త సాఫ్ట్‌వేర్ ప్రాడక్ట్స్ అభివృద్ధిచేయుటకు.
3. ప్రతిపాదిత కంపెనీ యొక్క డ్రాఫ్ట్ మెమోరండం మరియు ఆర్టికల్స్ ఆఫ్ అసోసియేషన్ కాపీని, 40-6-22/1ఎ, సూర్య అపార్టుమెంట్స్, నిమ్మలగడ్డ సోమేశ్వర్ రావు, స్ట్రీట్ రెవెన్యూ కాలనీ, కృష్ణా-520010, విజయవాడ, ఆం.ప్ర, ఇండియా వద్దగల కార్యాలయం వద్ద పరిశీలించవచ్చును.
4. ఈ దరఖాస్తు పై ఎవరికైన అభ్యంతరాలు ఉన్నచో వారు ఈ నోటీసు ప్రచురించిన తేదీ నుండి ఇరువై ఒక్క రోజులలోపు వ్రాతపూర్వకంగా తమ అభ్యంతరాన్ని సెంట్రల్ రిజిస్ట్రేషన్ సెంటర్ (సిఆర్‌సి), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కార్పొరేట్ అఫైర్స్ (ఐఐసిఎ), ప్లాట్ నం.6,7,8, సెక్టార్-5, ఐఎంటి మనెసర్, గుర్గాం-122050 (హర్యానా) వారికి పంపుతూ ఒక కాపీని పైన తెలిపిన కంపెనీ రిజిస్ట్రార్డ్ ఆఫీస్ అడ్రస్‌కు పంపవలెనని తెలియజేస్తూ ఈ నోటీసు జారీ చేయడమైనది.

నియోమాటిక్ టెక్నాలజీస్ లిమిటెడ్ లియబిలిటీ పార్టనర్‌షిప్ తరపున,
సం/- ఉపాధ్యాయుల అప్పల నరసింహం
డిసిగ్నేటెడ్ పార్టనర్, డిఐఎన్: 08369376.
తేదీ: 24 ఫిబ్రవరి, 2025.

Paper Publication
[Substituted Service]
OFFICE OF THE RECOVERY OFFICER-I
DEBTS RECOVERY TRIBUNAL
(Department of Financial Services, Ministry of finance, Government of india)
Ground & 1st Floor, 31-31-21, Narayan Bhawan, Sai Baba Street, Dabagardens, Visakhapatnam-530020, A.P.
FORM - 16
(See rule 48 of the Second Schedule to the Income-tax Act, 1961)
ORDER OF ATTACHMENT OF IMMOVABLE PROPERTY
in
RP No. 21/2023 in OA No. 551/2019
Canara Bank, Venugopal Nagar Branch, Guntur District
Versus
Mrs. Poddukuru Prabhu Preethi & others
(CD 1) Mrs. Poddukuru Prabhu Preethi, W/o T. David Ratnam, H No. 7-17-129, 3rd Line, Srinagar, Guntur District-522002.
(CD-2) Sri. Thalathoti Samuel Ratna Sekhar, S/o T Vijaya Mohan Rao, D No. 7-17-122/1, 3rd Line, Srinagar, Guntur District-522002.
(CD-3) Smt. Talathoti Prabhu Priya, W/o T Samuel Ratna Sekhar, D No. 7-17-122/1, 3rd Line, Srinagar, Guntur District-522002.
Whereas you the above said Certificate Debtors have failed to pay the sum of **Rs. 32,27,598/- (Rupees thirty two lakhs twenty seven thousand five hundred and ninety eight only)** along with interest and also other costs payable by you in respect of Recovery Certificate dated 08.03.2023 in **OA No. 551/2019** issued by the Hon'ble Presiding Officer, Debts Recovery Tribunal, Visakhapatnam and sent to the undersigned, specifying the amount to be recovered from you.
It is ordered that you, the said Certificate Debtors, are hereby prohibited and restrained until further order of the undersigned, from transferring or charging the under mentioned properties in any way and that all persons be, and that they are hereby prohibited from taking any benefit under such transfer or charge.
SCHEDULE OF THE PROPERTY
(Property belongs to CDR-2 i.e. Sri Thalathoti Samuel Ratna Sekhar covered by Gift Settlement Deed bearing Document No. 15307/2011 dated 27.12.2011 registered at SRO-Guntur)
All that Residential land and building at Guntur Division, Guntur Sub Division, included in Guntur Municipal Corporation area but town survey not done, Guntur City, Srinagar Colony, 3rd Line, Guntur Village, D No. 172/3 - an extent of Ac. 1.94 Cents, D No. 172/2 an extent of Ac. 0.15 cents a total extent of Ac. 2.09 Cents in which an extent of 373.2/9 Sq.yards of property's right in the name of this Deed Executant out of which an extent of 199.1/2 Sq.yards of site and ACC Roof building in Eastern Portion Door No. 7-17-125, Assessment No. 10747-01 and is bounded by: East: Property of Meka Krupanandam - 78 Feet, West: Property of Thalathoti Shaddrak Chandra Sekhar executed by me this day - 77 Feet, North: Property of Bandi Ratnam - 21.7 Feet, South: Municipal Corporation Road - 24.9 Feet.
(Given under my hand and seal of this tribunal at Visakhapatnam on the day 05th February 2025)
(Avasarala Anil) Recovery Officer
Debts Recovery Tribunal, Visakhapatnam

ORIX
ఓరిక్స్ లీజింగ్ & ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్
(గతంలో OAIS ఆటో ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్‌గా పిలువబడింది) (ఓరిక్స్ ఆటో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సర్వీసెస్ లిమిటెడ్ యొక్క ఒక అనుబంధ సంస్థ)
నమోదిత కార్యాలయం : ప్లాట్ నం.94, మరోల్ కో-ఆపరేటివ్ ఇండస్ట్రీయల్ ఎస్టేట్, అందేరి కుర్ల రోడ్, అందేరి (ఈ), ముంబాయి - 400 059, టెలిఫోన్ : +91 22 2859 5093/6707 0100 ఫ్యాక్స్ : +91 22 2852 8549
ఇ మెయిల్ : info@orixindia.com /www.orixindia.com/ సిఐఎన్ : U74900MH2006PLC163937

(సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద నోటీసు)

ఓరిక్స్ లీజింగ్ అండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్ నుండి దిగువ పేర్కొన్న రుణగ్రహీతలు మరియు సహ-రుణగ్రహీతలు సెక్యూర్డ్ లోన్‌లు పొందియున్నారు. దిగువ పేర్కొన్న రుణగ్రహీతలు వారికి సంబంధించిన ఆస్తులను సెక్యూర్డ్‌గా తాకట్టుపెట్టి రుణాలు పొందినారు. సంబంధిత లోను ఒప్పందం ప్రకారం నియమాలు మరియు షరతుల అనుసారం విఫలం చెందినారు మరియు ఇవి సక్రమంగా లేవు, వారి రుణాలను అర్‌బిఐ మార్గదర్శకాల ప్రకారం ఎన్‌పిఎగా వర్గీకరించడమైనది. ఓరిక్స్ లీజింగ్ అండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్ వారి బకాయిలు మొత్తం, జారీ చేసిన సంబంధిత నోటీసులలో పేర్కొనడమైనది దిగువ పట్టికలో చాలా వివరించబడింది మరియు సదరు మొత్తానికి తదుపరి వడ్డీ వర్తించును మరియు సంబంధిత తేదీల నుండి ఒప్పందం రేటు ప్రకారం చార్జ్ చేయబడును.

క్ర సం.	లోను ఖాతా నం.	లోను రకం	రుణ గ్రహీతల పేరు	13(2) నోటీసు తేది ప్రకారం బకాయి	నోటీసు తేది	సెక్యుర్డ్ అసెట్ వివరాలు
1	LN0000000017235	ఎస్ఎమ్ఇ సెక్యుర్డ్ లోను	1. వెంకట పవన్ కుమార్ దొంత, 2. చిట్టిబొమ్మ స్వప్న, 3. దొంత అక్కమ్మ, 4. పవన్ ఎంటర్‌ప్రైజెస్	INR 49,49,773.64/-	21.02.2025	ఆంధ్రప్రదేశ్-522004, గుంటూరు జిల్లా, నల్లపాడు సబ్ రిజిస్ట్రీ, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, అకింరెడ్డిపాలెం గ్రామం వద్ద ఉన్న మూల్యాంకనం నం.61485/ఎ, డో.నం.25-25-10, రీ సర్వే తర్వాత డో.నం.187/ఎ1, డో.నం.187/ఎ లో ఉన్న రెసిడెన్షియల్ సైట్ మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ విస్తీర్ణం 217 చ.గ.లు. లేదా 181.44 చ.మీ.లు. తో కలిపి నిర్మాణాలు అందులో అన్నీ సౌలభ్య హక్కులు. మరియు **హద్దులు : తూర్పు : నాగయ్యకు చెందిన స్థలం, పడమర : దవరశెట్టి రమణకు చెందిన స్థలం, ఉత్తరం : యోగేష్ మరియు మోహనరావుకు చెందిన స్థలం, దక్షిణం : 12 అ.లు. వెడల్పు గల్లీ బజారు.**

ఈ ప్రచురణ తేది నుండి 60 రోజులలోగా పై పట్టికలో వివరించిన వివరాల ప్రకారం సంబంధిత తేదిలు మరియు ఇతర ఖర్చులతో ఒప్పందం వడ్డీరేటుతో **ఓరిక్స్ లీజింగ్ అండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్**కు బకాయిలు చెల్లించవలసిందిగా ఇక్కడ మిమ్మల్ని పిలువడమైనది, మీరు విఫలమైన కారణంగా, **ఓరిక్స్ లీజింగ్ అండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్** వారు బకాయిలు రాబట్టుకొనుటకు పైన పేర్కొన్న తాకట్టుపెట్టిన ఆస్తులకు వ్యతిరకంగా దిగువ సంతకందారుడు SARFAESI చట్టం యొక్క సెక్షన్ 13(4) మరియు సెక్షన్ 14 నిర్బంధంగా నిబంధనలు అమలుపర్చారు. తదుపరిగా సదరు సెక్యూర్డ్ ఆస్తులను విక్రయం/లీజు లేదా ఏవిధంగానైనా బదిలీ చేయుటకు సదరు చట్టం యు/ఎస్ 13(13) ప్రకారం నిషేదించడమైనది.

తేది : 21.02.2025
ప్రదేశం : గుంటూరు
సం/- అధీకృత అధికారి
ఓరిక్స్ లీజింగ్ అండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్

జెఇఇ (మెయిన్) పేపర్ -2 ఫలితాలు విడుదల

న్యూఢిల్లీ : జెఇఇ (మెయిన్) పేపర్-2 పరీక్ష ఫలితాలు ఆదివారం విడుదలయ్యాయి. ఫిబ్రవరి 15న ప్రిలిమినరీ కీ విడుదల చేసి అభ్యంతరాలు స్వీకరించిన అధికారులు, శనివారం తుది కీ విడుదల చేసిన సంగతి తెలిసిందే. అభ్యర్థులు తమ అప్లికేషన్ నంబర్, పాస్‌వర్డ్‌తోపాటు క్యాప్చా కోడ్ ఎంటర్ చేసి స్కోరు కార్డును డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. జనవరి 30న జరిగిన ఈ పరీక్షలో బిఆర్క్‌కు 44,144 మంది, బి ప్లానింగ్‌కు 18,596 మంది హాజరయ్యారు.

సినిమా ఛాన్స్ పేరుతో లైంగికదాడి

- వీడియోలు తీసి బ్లాక్‌మెయిల్
- థానేలో దళిత మహిళ ఫిర్యాదు

థానే : సినిమాల్లో స్టార్‌ను చేస్తామంటూ ఓ దళిత మహిళపై పలుమార్లు లైంగిక దాడికి పాల్పడటంతోపాటు వీడియోలు తీసి బ్లాక్‌మెయిల్ చేసిన ఉదంతం మహారాష్ట్రలోని థానేలో వెలుగుచూసింది. 34 ఏళ్ల బాధితురాలు ఫిర్యాదుమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మహారాష్ట్ర థానేలోని మాజివాడ ప్రాంతంలో నివసిస్తున్న షెడ్యూల్డ్ కులానికి చెందిన బాధితురాలిని బెదిరించి బ్లాక్ మెయిల్ చేసినందుకు మరో మహిళ, ఆమె భర్త, వారి కుమార్తెను కూడా ఈ కేసులో నిందితులుగా చేర్చామని, ఎవరినీ అరెస్టు చేయలేదని పోలీసులు తెలిపారు. ఓ వ్యక్తి బాధితురాలిని పెద్ద స్టార్‌గా చేస్తానంటూ సింగపూర్ తీసుకెళ్లాడు. సినీరంగంలో పేరున్న వ్యక్తి అంటూ అక్కడ ఆమెకు ఒకరిని పరిచయం చేశాడు. సింగపూర్‌లోని తన ఇంటికి తీసుకెళ్లి ఆమెకు మత్తు పానీయాలిచ్చి, లైంగిక దాడి చేశాడు. ముంబయి, ఇతర ప్రదేశాలలోని హోటళ్లలోనూ పలుమార్లు అఘాయిత్యానికి పాల్పడటంతోపాటు వీడియోలు తీసి బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడినట్లు బాధితురాలు ఫిర్యాదు చేసింది. నలుగురు నిందితులపై లైంగికదాడి, క్రిమినల్ బెదిరింపులు, ఇతర అభియోగాలకు సంబంధించిన చట్టపరమైన నిబంధనల కింద, ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ యాక్ట్ కింద ఎఫ్‌ఐఆర్ నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వెంటిలేటర్‌పైనే పోప్

- కొనసాగుతున్న చికిత్స

వాటికన్ : పోప్ ఫ్రాన్సిస్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది. ఆయన వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నారు. 88 ఏళ్ల ఫ్రాన్సిస్ న్యుమోనియాతో బాధపడుతూ రోమ్‌లోని జెమెల్లి ఆసుపత్రిలో పది రోజులుగా చికిత్స పొందుతున్న ఆయన ఆరోగ్య పరిస్థితి విషమించిందని, ప్రమాదం నుంచి బయటపడలేదని వాటికన్ వర్గాలు శనివారం ఒక ప్రకటన విడుదల చేశాయి. దీర్ఘకాలిక ఉబ్బసం, శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్నారని, ఆక్సిజన్ ఎక్కువగా అందించడం అవసరమని పేర్కొన్నాయి. ప్లేట్‌లెట్లు భారీగా పడిపోవడంతో రక్తమార్పిడి చేశారు. 'రాత్రి ప్రశాంతంగా గడిచింది. పోప్ విశ్రాంతి తీసుకున్నారు' అంటూ వాటికన్ వర్గాలు ఆదివారం తెలిపాయి. ఫ్రాన్సిస్ యువకుడిగా ఉన్నప్పుడే ఊపిరితిత్తుల్లో భాగాన్ని తొలగించారు. ఇప్పటికీ ఆయన వెంటిలేటర్ సహాయంతో చికిత్స పొందుతున్నారు. జెస్యూట్ ఆసుపత్రిలో చికిత్సపై తనకు నమ్మకం ఉందని, సేవలందిస్తున్న వైద్య సిబ్బందికి కృతజ్ఞతలని ఇటీవల పోప్ విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోప్ కోలుకోవాలంటూ ప్రపంచవ్యాప్తంగా క్యాథలిక్కులు, క్రైస్తవులు ప్రార్థనలు చేశారు.

లెఫ్ట్‌ను దెబ్బతీసేందుకు విదేశీ నిధులు

- సిపిఎం పశ్చిమ బెంగాల్ రాష్ట్ర మహాసభలో ఎమ్‌డి సలీం విమర్శ

మహాసభలో మాట్లాడుతున్న ఎమ్‌డి సలీం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

వామపక్షాలను బలహీనపరిచేందుకు విదేశీ నిధులు వస్తున్నాయని సిపిఎం పశ్చిమ బెంగాల్ రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ సలీం విమర్శించారు. సిపిఎం 27వ పశ్చిమ బెంగాల్ రాష్ట్ర మహాసభ హుగ్లీలోని దంకునిలో (కామ్రేడ్ బుద్ధదేవ్ భట్టాచార్య నగర్, కామ్రేడ్ సీతారాం ఏచూరి వేదిక) ఆదివారం రెండో రోజూ కొనసాగింది. మహ్మద్ సలీం రాజకీయ నిర్మాణ నివేదికను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వామపక్షాలను బలహీనపరచడానికి టిఎంసి, సామ్రాజ్యవాదులు చేపట్టిన ప్రాజెక్టులో లాల్ హఠా ఆందోళన ఒక భాగమని గుర్తు చేశారు. వామపక్షాలను బలహీనపరచడానికి వారికి వివిధ వనరుల నుండి డబ్బు అందిందని విమర్శించారు. ప్రజాస్వామ్యం పేరుతో వామపక్షాలను బలహీనపరిచేందుకు విదేశీ నిధులను అందజేయడాన్ని కమ్యూనిస్టులు ఎల్లప్పుడూ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని పేర్కొన్నారు. "విద్యలో డ్రాపౌట్స్, నిరుద్యోగం, పంటలకు ధర లభించకపోవడం, వలస కార్మికులుగా మారడం వంటి సమస్యలపై స్పందించడానికి మాత్రమే పరిమితం కాబోం. వామపక్ష ప్రత్యామ్నాయంతో ఉద్యమ కార్యక్రమాన్ని చేపడతాం" అని అన్నారు. అణగారిన ప్రజలతో, ముఖ్యంగా గ్రామీణ పేదల జీవనంతో నిరంతర సంబంధాలను ఏర్పరచుకోవడంతోపాటు పోరాటాలను తీవ్రతరం చేస్తామని తెలిపారు. తప్పుడు కేసులు, దాడులు, జైలు శిక్షలు మొదలైన వాటిని ఎదుర్కొంటూనే రాష్ట్రంలో వామపక్ష కార్యకర్తలు పోరాడుతున్నారని పేర్కొన్నారు. ఈ మహాసభ చర్చల తరువాత, తాము మరింత తీవ్రమైన ఆందోళన కార్యక్రమాన్ని చేపడతామని తెలిపారు. పార్టీని సంస్థాగతంగా నిర్మించడానికి నాయకత్వంలో కొత్త తరం కార్యకర్తలను చేర్చుకోవాలని, నిర్విరామ పోరాటానికి పార్టీని ఒక సాధనంగా ప్రజలకు అందించాలని పిలుపునిచ్చారు. "హిందుత్వం, నయా ఫాసిస్ట్ ధోరణులు నిజానికి కవలలు. ట్రంప్ నుండి మోడీ వరకు ప్రపంచవ్యాప్తంగా మితవాద శక్తులు పెరుగుతున్నాయి. ఈ శక్తులకు వ్యతిరేకంగా పోరాటంలో విశాల ఐక్యతను నిర్మించాలి. ఈ పోరాటంలో మనం మన బలాన్ని పెంచుకోవాలి" అని అన్నారు. రాష్ట్రంలో గొప్ప ఐక్యతను నిర్మించడమే లక్ష్యమని, ఇది ఏ వ్యక్తిపైనా పోరాటం కాదని, విధానాలకు వ్యతిరేకంగా పోరాటమని స్పష్టం చేశారు. బిజెపి, టిఎంసిలకు వ్యతిరేకంగా పోరాటంలో పేద, శ్రామిక ప్రజలను సంఘటితం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం రాజకీయ నిర్మాణ నివేదికపై ప్రతినిధుల చర్చలు జరిగాయి. మహాసభకు రాష్ట్ర వ్యాప్తంగా 521 మంది ప్రతినిధులు, పరిశీలకులు హాజరయ్యారు. వీరిలో 428 మంది పురుషులు, 93 మంది మహిళలు ఉన్నారు.

మహిళలదే కీలకపాత్ర

- మన్‌కీ బాత్‌లో మోడీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశ స్వాతంత్ర్య పోరాటం, రాజ్యాంగం రూపకల్పనలో మహిళలు కీలకపాత్ర పోషించారని ప్రధానమంత్రి నరేంద్రమోడీ అన్నారు. 'మన్ కీ బాత్'లో ఆదివారం ఆయన మాట్లాడుతూ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వారి జీవితాల్లో స్ఫూర్తి నింపేందుకు ఒక రోజు తన సోషల్ మీడియా ఖాతాను వారికి అంకితం చేస్తామన్నారు. గతంతో పోలిస్తే ఇస్రో బృందంలో మహిళా శాస్త్రవేత్తల సంఖ్య పెరగడం అభినందనీయమని అన్నారు. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో 100వ రాకెట్ ప్రయోగం పూర్తి చేయడం గర్వకారణంగా ఉందని అన్నారు. అంతరిక్ష రంగంలో దేశం ఏటా పురోగతి సాధిస్తోందని అన్నారు. పదేళ్లలో 460 ఉపగ్రహాలను లాంచ్ చేసినట్లు తెలిపారు. కృత్రిమ మేధ (ఎఐ) వినియోగం రోజురోజుకూ పెరుగుతున్న తరుణంలో ఈ సాంకేతికతను వినియోగించుకొని దేశాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని ప్రధాని నరేంద్రమోడీ కోరారు. అంతరిక్ష రంగంపై యువత ఆసక్తి చూపుతోందని పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు కైలాష్ గిరిజన భాషలను పరిరక్షించడంలో సాయం చేశారని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) ఉపయోగించి కొలామి భాషలో పాటను కంపోజ్ చేశారని ప్రశంసించారు.

ఏప్రిల్ 8, 9 తేదీల్లో ఎఐసిసి కీలక సమావేశాలు

- అహ్మదాబాద్ వేదికగా భవిష్యత్ కార్యాచరణపై చర్చ : కెసి వేణుగోపాల్

న్యూఢిల్లీ : కాంగ్రెస్ పార్టీ కీలక సమావేశాలకు గుజరాత్‌లోని అహ్మదాబాద్ వేదిక కానుంది. గతేడాది డిసెంబర్‌లో కర్ణాటక బెళగావిలో జరిగిన నవ సత్యాగ్రహంలో తీసుకున్న నిర్ణయాలకనుగుణంగా ఏప్రిల్ 8, 9 తేదీల్లో ఇక్కడ ఎఐసిసి సమావేశాలు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ తెలిపారు. ఈ మేరకు 'ఎక్స్'లో ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఏప్రిల్ 8న సిడబ్ల్యుసి సమావేశం, 9న ఎఐసిసి ప్రతినిధుల సమావేశం ఉంటుందని, వీటికి మల్లికార్జున ఖర్గే అధ్యక్షత వహిస్తారని తెలిపారు. బిజెపి అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్ల ఎదురవుతున్న సవాళ్లు, రాజ్యాంగం, దాని విలువలపై నిరంతరం జరుగుతున్న దాడిపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణను రూపొందిస్తుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల సిఎంలు, పార్టీ జాతీయ ఆఫీస్ బేరర్లు, సీనియర్ నేతలు, ఇతర ప్రతినిధులు పాల్గొననున్నారు.

ఇదేమి న్యాయం?

- లైంగిక వేధింపుల కేసులో నిందితుల కుటుంబాలకు, మసీదుకు 'బుల్డోజర్' నోటీసులు
- రాజస్థాన్‌లో విజయ్‌నగర్ మున్సిపాలిటీ తీరు

జైపూర్ : బుల్డోజర్ న్యాయం అమలు చేయొద్దంటూ పదేపదే సుప్రీంకోర్టు హెచ్చరిస్తున్నా... బిజెపి పాలిత రాష్ట్రాల తీరు మారడం లేదు. రాజస్థాన్‌లోని బీవర్ జిల్లా విజయ్‌నగర పట్టణంలో మైనర్ బాలికలపై లైంగిక వేధింపులు, బెదిరింపుల కేసులో 10 మంది ముస్లిమ్ యువకులు అరెస్టయ్యారు. వారి కుటుంబాలతోపాటు స్థానిక ముస్లిములు నిందితుల అరెస్టుకు సహకరించారు. వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడానికి ఎటువంటి అభ్యంతరం లేదని చెప్పారు. తాజాగా, ఆ నిందితుల కుటుంబాల ఇళ్లను కూల్చివేస్తామంటూ 'బుల్డోజర్' నోటీసులు జారీ చేయడం చర్చనీయాంశమైంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం విజయ్‌నగర పట్టణంలో ఈ నెల 16న ఐదుగురు బాలికలపై లైంగిక వేధింపులు, బెదిరింపులకు పాల్పడుతున్నారనే కేసులో 10 మంది ముస్లిములను పోలీసులు అరెస్టు చేశారు. దీంతో వీరిపై బుల్డోజర్ చర్యలు తీసుకోవాలని హిందుత్వ శక్తులు డిమాండ్ చేశాయి. దీనిని లవ్ జిహాద్‌గా విమర్శించాయి. పట్టణంలో నిరసనలు నిర్వహించడంతో పాటు, బంద్‌కు పిలుపునిచ్చాయి. దీంతో నిందితుల కుటుంబాలు, ఇళ్ల యజమానులకు ఈ నెల 20, 21 తేదీల్లో విజయ్‌నగర్ మున్సిపాలిటీ అధికారులు నోటీసులు జారీ చేశారు. వారు వుంటున్న ఇళ్లన్నీ అక్రమ కట్టడాలు లేదా ఆక్రమణలు అని నోటీసుల్లో పేర్కొన్నారు. మూడు రోజుల్లోగా సరైన పత్రాలు చూపించాలని, లేకపోతే ఇళ్లన్నీ కూల్చివేస్తామని హెచ్చరించారు. కూల్చివేతకు అయ్యే ఖర్చునంతా నిందితుల కుటుంబాల నుంచే వసూలు చేస్తామని కూడా నోటీసులు పేర్కొన్నారు. పట్టణంలోని రాజ్‌నగర్ ప్రాంతంలోని జామా మసీదు యాజమాన్యానికి కూడా ఇలాంటి నోటీసే జారీ చేశారు.

సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధం

ఈ నోటీసులపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏ కూల్చివేత నోటీసైనా సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన మార్గదర్శకాలకు విరుద్ధమని పలువురు విమర్శించారు. వందేళ్ల నాటి మసీదుకు ఇప్పుడు యాజమాన్య హక్కులు అడగడం వల్ల ప్రయోజనం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. నిందితుల కుటుంబ సభ్యులు మాట్లాడుతూ 'మేం విచారణకు పూర్తిగా సహకరించాం. నిందితుల్ని పోలీసుల ముందు హాజరుపర్చాం. వారు దోషి లేదా నిర్దోషి అని చట్టం, కోర్టు నిర్ణయించాలి. ఇలా మా ఇళ్లను లక్ష్యంగా చేసుకోవడం అన్యాయం. మా దగ్గర అవసరమైన అన్ని పత్రాలు ఉన్నాయి. వాటిని అధికారులకు అంద చేస్తాం. అయినా కూడా మమల్ని లక్ష్యంగా చేసుకుని కూల్చివేత జరుగుతుందని భయపడుతున్నాం' అని తెలిపారు. విజయ్‌నగర్‌లో మత సామరస్యాన్ని దెబ్బతీయడానికే ఇలాంటి ప్రయత్నం జరుగుతోందని, ముస్లిములలో ఒక్కరు కూడా నిందితుల వైపు నిలబడలేదని స్థానిక ముస్లిం అఖ్తార్ అలీ తెలిపారు. ఈ నోటీసులను వెనక్కితీసుకోవాలని పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్ (పియుసిఎల్) డిమాండ్ చేసింది. అకస్మాత్తుగా ఈ నోటీసులను జారీ చేయడంలో అధికారుల ఉద్దేశ్యాన్ని ప్రశ్నించింది. అధికారులు నిష్పాక్షికంగా, ఒత్తిడికి భయపడకుండా పని చేయాలని పియుసిఎల్ జాతీయ అధ్యక్షురాలు కవితా శ్రీవాస్తవ డిమాండ్ చేశారు.

అసెంబ్లీ నోటీసులు ప్రచారం చేయడం సభా హక్కుల ఉల్లంఘనే : జమ్ముకాశ్మీర్ స్పీకర్

శ్రీనగర్ : ప్రశ్నలు, బిల్లులు, తీర్మానాలు, సభా వ్యవహారాలకు సంబంధించిన అసెంబ్లీ నోటీసులను ప్రచారం చేయడం సభా హక్కుల ఉల్లంఘన కిందకే వస్తోందని జమ్ముకాశ్మీర్ స్పీకర్ అబ్దుల్ రహీం రాథర్ అన్నారు. మార్చి 3 నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలకు జారీ చేసిన నోటీసులపై జరిగిన ప్రచారంపై స్పీకర్ స్పందించారు. 'బడ్జెట్ సమావేశాల్లో చేపట్టనున్న సభా వ్యవహారాలకు సంబంధించి ఎమ్మెల్యేలకు ఇచ్చిన నోటీసులపై ఇటీవల తీవ్ర ప్రచారం జరిగింది. ఈ ప్రచారంపై స్పీకర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇది పార్లమెంటరీ పద్ధతులు, సంప్రదాయాలు, నియమాలకు విరుద్ధమని తెలిపారు' అని అసెంబ్లీ ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు. ఇలాంటి చర్యలు సభా హక్కుల ఉల్లంఘనకు సమానమని, భవిష్యత్‌లో ఇలాంటి చర్యలు మానుకోవాలని స్పీకర్ ఆదేశించారని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

మార్షల్ లా విధించినట్లుంది : మెహబూబా ముఫ్తీ

ఎమ్మెల్యేలకు ఇచ్చిన నోటీసులను ప్రచారం చేయడం సభా హక్కుల ఉల్లంఘనతో సమానమని స్పీకర్ హెచ్చరించడాన్ని పిడిపి అధ్యక్షులు, జమ్ముకాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ ఖండించారు. 'అనుభవజ్ఞుడైన రాజకీయ నాయకుడు రతర్ సాహబ్ రాజ్యాంగ పదవిలో ఉంటూనే ఒక రకమైన మార్షల్ విధించినట్లు కనిపిస్తోంది' అని వ్యాఖ్యానించారు. 'ఎమ్మెల్యేలకు నోటీసులు, అసెంబ్లీలో ప్రశ్నలు, తీర్మానాల గురించి ప్రజలకు ముందుగానే తెలియజేయడం జవాబుదారీతనాన్ని ప్రోత్సహిస్తుంది. పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్న వక్ఫ్ బిల్లుపై నెలల తరబడి బహిరంగంగా చర్చిస్తున్నారు' అని ముఫ్తీ తెలిపారు. తమ పార్టీ అసెంబ్లీలో ప్రవేశ పెట్టే బిల్లులకు మద్దతు ఇవ్వాలని, తీర్మానాలు, బిల్లులపై మాట్లాడవద్దని ఎమ్మెల్యేలను బెదిరించవద్దని స్పీకర్‌ను ఆమె కోరారు. జమ్ముకాశ్మీర్‌లో మద్యాన్ని నిషేధించాలని కోరుతూ పిడిపి శనివారం నుంచి నిర్వహిస్తున్న సంతకాల ప్రచారంలో భాగంగా ఆదివారం ముఫ్తీ సంతకం చేశారు.

ఢిల్లీ అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా అతిషి

న్యూఢిల్లీ : ఢిల్లీ అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా మాజీ ముఖ్యమంత్రి అతిషిని ఆప్ ఎమ్మెల్యేలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం నిర్వహించిన పార్టీ శాసనసభాపక్ష భేటీలో ఈ ప్రక్రియ నిర్వహించారు. ఎమ్మెల్యే సంజీవ్ ఝా ఆమె పేరును ప్రతిపాదించగా.. మిగతా వారంతా మద్దతు పలికారు. ఢిల్లీలో ప్రతిపక్ష నేతగా ఒక మహిళ ఎన్నికకావడం ఇదే మొదటిసారి. ఆప్ శాసన సభాపక్ష భేటీకి పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌తోపాటు ఇటీవల ఎన్నికైన 22 మంది ఎమ్మెల్యేలు హాజరయ్యారు. తనపై విశ్వాసం ఉంచి, ప్రతిపక్ష నేతగా ఎన్నుకున్నందుకు కేజ్రీవాల్‌తోపాటు పార్టీ నేతలకు అతిషి కృతజ్ఞతలు తెలిపారు. అసెంబ్లీలో ప్రజల తరపున బలమైన గొంతుకను వినిపిస్తామని, ఇచ్చిన హామీలు నెరవేర్చేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని చెప్పారు.

నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు

నూతన ముఖ్యమంత్రిగా రేఖా గుప్తా, ప్రతిపక్ష నేతగా మాజీ ముఖ్యమంత్రి అతిషి ఎంపికకావటంతో.. అసెంబ్లీ సమావేశాలు రసవత్తరంగా జరగనున్నాయి. సోమవారం నుంచి ఢిల్లీ అసెంబ్లీ తొలి సెషన్ ప్రారంభం కానుంది. మూడు రోజులపాటు నిర్వహించనున్న ఈ సమావేశాల్లో.. గత ఆప్ ప్రభుత్వ పనితీరుపై పెండింగ్‌లో ఉన్న కాగ్ నివేదికలను ప్రవేశపెడతామని బిజెపి ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది.

జర్మనీ ఎన్నికల్లో భారీ ఎత్తున పోలింగ్

బెర్లిన్ : జర్మన్ జాతీయ ఎన్నికలు ఆదివారం జరిగాయి. దేశవ్యాప్తంగా భారీ స్థాయిలో పోలింగ్ నమోదైందని అధికారులు తెలిపారు. జర్మనీలో 5.92 కోట్ల మంది అర్హులైన ఓటర్లు ఉండగా, వీరిలో 20 శాతం మంది పోలింగ్ రోజుకు ముందే మెయిల్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకున్నారు. భారత కాలమాన ప్రకారం ఆదివారం రాత్రి 10:30 గంటలకు ఈ పోలింగ్ ముగిసింది. ఫలితాలు ఆదివారం రాత్రికే వెల్లడికావచ్చునని భావిస్తున్నారు. పాఠశాలలు, కిండర్‌గార్టెన్స్, జిమ్ములు, రిటైర్‌మెంట్ హోమ్స్‌ల్లో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. యూరప్ ఆర్థిక వ్యవస్థలో స్తబ్దత, వలసల సమస్యలు, ఉక్రెయిన్-రష్యా మధ్య సంక్షోభం, అమెరికాలో ట్రంప్ ప్రభుత్వం అనుసరిస్తున్న పన్నుల విధానం వంటి ప్రపంచవ్యాప్తంగా కీలక పరిణామాలు నెలకొన్న వేళ జర్మనీ ఎన్నికలు జరుగుతుండటం ఆసక్తిగా మారింది.

సాయాన్ని అవకాశంగా తీసుకున్నారు

- భారత్‌పై మరోసారి ట్రంప్ తీవ్ర వ్యాఖ్యలు

వాషింగ్టన్ : అమెరికా సాయాన్ని భారత్ అవకాశంగా తీసుకుంటోందని, అసలు భారత్‌కు అమెరికా ఎందుకు సాయం అందిస్తోందని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రశ్నించారు. వాషింగ్టన్‌లోని కన్జర్వేటివ్ పొలిటికల్ యాక్షన్ కాన్ఫరెన్స్ (సిపిఎసి)ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ అమెరికా వస్తువులపై విధించిన అధిక సుంకాలతో భారత్ ఇప్పటికే ప్రయోజనం పొందుతోందని అన్నారు. భారత్‌కు అమెరికా సాయం (యుఎస్ఎఐడి) అవసరం లేదని, అక్కడ ఎన్నికల కోసం ఎందుకు సాయం చేయాలని మరోసారి ప్రశ్నించారు. "ప్రపంచంలో అధిక సుంకాలు విధించే దేశాలలో భారత్ కూడా ఒకటి. వారికి 200 శాతం టారిఫ్ ఉంది. మేము ఎన్నికల కోసం వారికి చాలా డబ్బు ఇచ్చాం" అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

ప్యాకేజీ నిధులు విశాఖ ఉక్కుకే ఖర్చు చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

అవసరమైన ఆర్థిక సహకారం అందించాలన్నారు. ప్రత్యేక హోదా సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ విశాఖ ఉక్కు ఆంధ్రుల ఆత్మగౌరవానికి సంబంధించిందన్నారు. ప్యాకేజీ అనేది శాశ్వత పరిష్కారం కాదని, తక్షణమే సొంతంగా స్టీల్ ప్యాక్టరీకి గనులు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు.

సిఐటియు ప్రధాన కార్యదర్శి నరసింగరావు మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ అమ్మకాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించే విధంగా కేంద్రంపై వత్తిడి తేవాలన్నారు. ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీకైన విశాఖ ఉక్కును కాపాడుకునేందుకు పోరాటాన్ని కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. మరో వైపు సెయిల్‌లో ఒక మిలియన్ టన్ను ఉత్పత్తికి 2700మంది ఉద్యోగులు ఉండగా, విశాఖ స్టీల్ ప్లాంట్‌లో కేవలం 1600మంది మాత్రమే ఉన్నారని, ఉద్యోగులు ఎక్కువ మంది ఉన్నారంటూ మొత్తంగా18వేలమందిని 9,500కు తగ్గిస్తున్నారన్నారు. ఇందులో భాగంగా విఆర్ఎస్ పెట్టి 1200 మందిని బయటకు పంపుతున్నారన్నారు. కార్మికులు లేకుండా ఉత్పత్తి ఎలా సాధ్యమని ఆయన ప్రశ్నించారు.

పిసిసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరహరిశెట్టి నరసింగరావు మాట్లాడుతూ ప్లాంట్ అమ్మకం ప్రకటించే సమయానికి రూ. 915కోట్లు లాభం వచ్చిందని, ఈ మూడు సంవత్సరాల్లో రూ.19 వేల కోట్లు అదనంగా అప్పు ఎందుకయ్యిందని ఆయన ప్రశ్నించారు.

ఈ రౌండ్‌టేబుల్ సమావేశంలో విశాఖ స్టీల్ ప్లాంట్ వర్కర్స్ యూనియన్ అదనపు ప్రధాన కార్యదర్శి జె.రామకృష్ణ, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్రకమిటీ సభ్యుడు హరనాథ్, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు ఎం.రామకృష్ణ, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు కారుసాల సుబ్బారావమ్మ, ఎపి మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శి దుర్గా భవానీ, రైతు సంఘం సీనియర్ నాయకులు వై.కేశవరావు, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి ఎల్ రాజు, , రైల్వే యూనియన్ నాయకులు వివిఎల్‌నరసింహులు, పిఒడబ్ల్యు మహిళా సంఘం నాయకురాలు హర్షియా బేగం, ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు సుధాకర్ పాటు పలు ప్రజాసంఘాలు,కార్మికసంఘాలనేతలు పాల్గొన్నారు.

ఉక్రెయిన్‌పై సైనిక ఆపరేషన్‌కు మూడేళ్లు

- రెండులక్షల మందికి పైగా రష్యా, ఉక్రెయిన్ సైనికుల మృతి

ఉక్రెయిన్‌లో రష్యా సైనికులు

మాస్కో: ఉక్రెయిన్, రష్యా దేశాల మధ్య యుద్ధానికి సోమవారానికి సరిగ్గా మూడేళ్లు. అమెరికా, నాటో దేశాల ఆయుధ, ఆర్థిక సహాయంతో ఉక్రెయిన్, మరో వైపు రష్యా మధ్య జరిగిన భీకర యుద్ధంలో రెండు దేశాలకు చెందిన రెండు లక్షల మందికి పైగా సైనికులు మరణించారు. దాదాపు 8 లక్షల మంది సైనికులు గాయపడ్డారు. ఉక్రెయిన్‌లో కోటిమందికి పైగా ప్రజలు నిరాశ్రయులయ్యారు. వీరిలో, దాదాపు 20 లక్షల మంది పిల్లలు. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత యూరప్‌లో జరిగిన అతిపెద్ద విపత్తుగా విశ్లేషకులు పేర్కొంటున్నారు. మరోవైపు.. 'డిఫెండర్ ఆఫ్ ది ఫాదర్‌ల్యాండ్ డే' పురస్కరించుకుని రష్యా అధినేత పుతిన్.. సైనికుల త్యాగాలను స్మరించుకున్నారు. యుద్ధంలో పోరాడిన సిబ్బందికి పతకాలను ప్రదానం చేశారు.

నాటో విస్తరణను నిలువరించడం, డాన్‌బాస్ విమోచనం, నాజీయిజం నిర్మూలన వంటివి లక్ష్యంగా 2022 ఫిబ్రవరి 24న 'ప్రత్యేక మిలిటరీ ఆపరేషన్'ను రష్యా ప్రారంభించింది. అమెరికా, పాశ్చాత్య దేశాల ఆయుధ సాయంతో జెలెన్‌స్కీ తలపడ్డారు. ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టడం, సాయంపై వెనక్కి తగ్గడంతో ఉక్రెయిన్‌లో ఆందోళన మొదలైంది.

రష్యా అతి పెద్ద దాడి : ఉక్రెయిన్

గతంలో ఎన్నడూ లేనట్టుగా ఒకేసారి 267 డ్రోన్లతో రష్యా దాడి చేసిందని తాజాగా ఉక్రెయిన్ ఎయిర్‌ఫోర్స్ కమాండ్ ప్రతినిధి యూరీ ఇగ్నాత్ ఆరోపించారు. వాటిలో సగానికిపైగా కూల్చేసినట్టు చెప్పారు. గత వారం వ్యవధిలో 1150 డ్రోన్లు, 1400కుపైగా గైడెడ్ ఏరియల్ బాంబులు, 35 క్షిపణులను రష్యా ప్రయోగించిందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆరోపించారు. తమ దేశంలోకి ఉక్రెయిన్ సేనలు 20 డ్రోన్లను ప్రయోగించాయని, వాటిని నాశనం చేశామని రష్యా రక్షణ మంత్రిత్వశాఖ తెలిపింది.

పోప్ శాంతిసందేశం..

తీవ్ర అనారోగ్య సమస్యలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పోప్ ఫ్రాన్సిస్.. ఉక్రెయిన్ యుద్ధానికి మూడేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో శాంతి సందేశాన్ని విడుదల చేశారు. ఈ యుద్ధం ప్రారంభాన్ని.. మానవాళికి బాధాకరమైన సందర్భంగా పేర్కొన్నారు. "యుద్ధాల్లో ప్రాణాలు కోల్పోయినవారిని మనం గుర్తుంచుకోవాలి. పాలస్తీనా, ఇజ్రాయెల్, మధ్యప్రాచ్యం, మయన్మార్, సూడాన్ వంటి ప్రాంతాల్లో శాంతి కోసం ప్రార్థించండి" అని పోప్ పిలుపునిచ్చారు.

ఐదు నెలల తరువాత హిజ్బుల్లా నేత హసన్ నస్రల్లా అంత్యక్రియలు

- వేలాదిగా తరలివచ్చిన జనం
- ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా నినాదాలు

బీరుట్ (లెబనాన్) : ఇజ్రాయిల్ వైమానిక దాడిలో మరణించిన ఐదు నెలల తరువాత హిజ్బుల్లా నాయకుడు హసన్ నస్రల్లా అంత్యక్రియలు ఆదివారం నిర్వహించారు. లెబనాన్ రాజధాని బీరుట్‌లోని స్పోర్ట్స్ సిటీ స్టేడియంలో జరిగిన ఈ అంత్యక్రియలకు వేలాదిమంది జనం తరలివచ్చారు. ఐదు నెలల క్రితం లెబనాన్‌పై ఇజ్రాయిల్ వైమానిక దళం వందల బాంబులతో జరిపిన దాడిలో హసన్ నస్రల్లా మరణించారు. అంత్యక్రియలకు ముందు నిర్వహించిన అంతిమయాత్రలో భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. శవపేటికపై పువ్వులు, దుస్తులు విసిరి, తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. లెబనాన్‌లో గత 20 ఏళ్లలో జరిగిన అతి పెద్ద అంత్యక్రియలుగా హసన్ నస్రల్లా అంత్యక్రియలను అధికారులు భావిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బాగర్ ఖలీబాఫ్, విదేశాంగ మంత్రి అబ్బాస్ అరగీలతో పాటు లెబనాన్ పార్లమెంట్ స్పీకర్, ప్రధానమంత్రి ప్రతినిధులు కూడా హాజరయ్యారు. వేలాదిగా సాధారణ ప్రజలు తరలిరావడంతో వారిలో ఎక్కువ మందికి స్టేడియంలో ప్రవేశించడానికి అవకాశం కలగలేదు. స్టేడియం బయట భారీ తెరలను ఏర్పాటు చేశారు. నస్రల్లా అంత్యక్రియలు జరుగుతున్న సమయంలోనూ ఇజ్రాయిల్ వైమానిక దళ విమానాలు తక్కువ ఎత్తులో స్టేడియంపైన ఎగిరాయి. అంత్యక్రియలకు హాజరైన జనం ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. హిజ్బుల్లా వ్యవస్థాపకుల్లో హసన్ నస్రల్లా ఒకరు. ఈ గ్రూపునకు దాదాపు 30 ఏళ్లపాటు నాయకత్వం వహించారు. ఇరాన్, యెమెన్, పాలస్తీనా, ఇరాక్ వంటి దేశాల్లోనూ హసన్ నస్రల్లాకు అభిమానులు, మద్దతుదారులు ఉన్నారు.

మీ కోసం

అల్లం, వెల్లుల్లి ముద్ద చేసేటప్పుడు కొద్దిగా నూనె వేస్తే పేస్టు మెత్తగా వస్తుంది. ఎక్కువ రోజులు నిల్వ ఉంటుంది.

జీవన సౌరభం

వినేందుకు కటువుగా అనిపించినా మీ గురించి వాస్తవాలు చెప్పే వారి సలహాలు తీసుకోవడం మంచిది.

చందమామ రావే..

చందమామ రావే
చపాతి తేవే!
జాబిల్లి రావే
జిలేబి తేవే!

లారీ ఎక్కి రావే
పూరీలు తేవే!
కారు ఎక్కి రావే
కారాసు తేవే!

రైలు ఎక్కి రావే
రసగుల్ల తేవే!
బస్సు ఎక్కి రావే
బజ్జీలు తేవే!

ఆటో ఎక్కి రావే
స్వీటు హాటు తేవే!
స్కూటీ ఎక్కి రావే
టూటీ ఫ్రూటీ తేవే!

గుర్రమెక్కి రావే
గులాబ్ జాం తేవే!
సైకిలెక్కి రావే
సనక్కాయ్ తేవే!

పడవెక్కి రావే
పలావ్ తేవే!

ఎడ్ల బండ్లో రావే
ఇడ్లీలు తేవే!

– ఐనకోట రవి కుమార్.
ఎం.పి.పి.ఎస్.; జంగాల కండ్రిగ
ముత్తుకూరు, నెల్లూరు జిల్లా.
97048 00096.

బొమ్మ గీయండి!

పిల్లలూ, చిన్న ఎలుక పిల్ల బొమ్మ గీయడం నేర్చుకుందాం. ఈ బొమ్మలో ఇచ్చిన అంకెల ఆధారంగా బొమ్మ గీయండి.



నేను గీసిన బొమ్మ

- పి.నిశిత,
6వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
పోతారెడ్డిపేట, సిద్ధిపేట.

సబ్జెక్టు మీద పట్టుతో 'ఇంటర్'లో మంచి స్కోర్...

ఇంటర్మీడియట్ విద్యార్థి జీవితంలో కీలకమైన మలుపు. ఈ దశలో సబ్జెక్టు మీద సాధించే పట్టు ఉన్నత విద్య, ఉద్యోగ సాధనకు బాగా దోహదపడుతుంది. అందుకే విద్యార్థినీ విద్యార్థులు మంచి స్కోర్ చేయటానికి పుస్తకాలతో కుస్తీ పడుతుంటారు. ఎపిలో మార్చి 1 నుంచి, తెలంగాణాలోనూ మార్చి 5 నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇంటర్‌లో సబ్జెక్టులు భవిష్యత్తులో ఉన్నత విద్య కోర్సుల్లో చేరడానికి, ఆయా కోర్సుల్లో రాణించటానికి కీలకంగా నిలుస్తాయి. గ్రూప్ సబ్జెక్టులపై విద్యార్థులు పూర్తి పట్టు సాధిస్తే తద్వారా వార్షిక పరీక్షల్లో మంచి స్కోర్ సొంతం చేసుకోవచ్చు.



ఎంపిసి : మ్యాథమెటిక్స్ షార్ట్ ఆన్సర్, వెరీ షార్ట్ ఆన్సర్ ప్రశ్నలపై బాగా దష్టి పెట్టాలి. లాంగ్ ఆన్సర్ ప్రశ్నలను సాధన చేసేటప్పుడు అంచెలవారీగా పరిష్కార విధానాన్ని అనుసరించాలి. పూర్తిచేసిన సిలబస్‌ను క్రమపద్ధతిలో రివిజన్ చేసుకోవాలి. కొశ్చన్ అండ్ ఆన్సర్ మాదిరిగా కాకుండా డిస్క్రిప్టివ్ అప్రోచ్‌లో సాధన చెయ్యాలి. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు షార్ట్ ఆన్సర్ కొశ్చన్స్ ప్రాక్టీస్ చేసేటప్పుడే జేఈఈ మెయిన్స్, ఎంసెట్ తదితర పోటీ పరీక్షలను దృష్టిలో పెట్టుకోవాలి. ఆయా సిలబస్ అంశాలకు అనుగుణంగా ఆబ్జెక్టివ్ ప్రశ్నలు- సమాధానాల రూపంలో ప్రిపేర్ కావాలి.

మ్యాథమెటిక్స్ : ద్వితీయ సంవత్సరం గణితం సంబంధించి ద్విపద సిద్ధాంతం, ప్రస్తారాలు-సంయోగాలు, సంభావ్యత, వత్తాలు, సమాకలనులు, నిశ్చిత సమాకలనులు, అవకలన సమీకరణలు, డిమాయర్స్ సిద్ధాంతం, వర్గ సమీకరణలు, కానిక్ సెక్షన్ వంటి అంశాలను బాగా పునశ్చరణ చేయాలి. మొదటి సంవత్సరం విద్యార్థులు వెక్టార్ ఆల్జీబ్రా, త్రికోణమితి, మాత్రికలు, సరళ రేఖలు, సరళరేఖ యుగ్మాలు, అవకలనాలు, అప్లికేషన్ల ఆఫ్ డెరివేటివ్స్ పై ఎక్కువ సమయం కేటాయించాలి. అవకాలనం, సమాకలనం, త్రికోణమితి తదితర అధ్యాయాల్లో ఉండే సూత్రాలను నేర్చుకొని రోజు పున:శ్చరణ చేయాలి.

ఫిజిక్స్ : రెండో సంవత్సరానికి సంబంధించి వేవ్ మోషన్, ఎలక్ట్రో మాగ్నెటిక్స్, సెమీ కండక్టర్ డివైసెస్, న్యూక్లియర్ ఫిజిక్స్, ఎలక్ట్రిసిటీ వంటి అంశాల్లో పట్టు సాధించాలి. మొదటి సంవత్సరానికి సంబంధించి వర్క్ పవర్ ఎనర్జీ, మోషన్ ఇన్ లైన్, ప్లేన్ , థర్మల్, మెకానికల్ ప్రాపర్టీస్,థర్మో డైనమిక్స్ వంటి అంశాల్లో ప్రావీణ్యం సాధించే విధంగా రివిజన్‌కు సమయం కేటాయించాలి.

కెమిస్ట్రీ: రెండో సంవత్సరంలో ఎలక్ట్రో కెమిస్ట్రీ, కెమికల్ కైనమేటిక్స్, పి. బ్లాక్ ఎలిమెంట్స్, సొల్యూషన్స్, ఆర్గానిక్ కెమిస్ట్రీకి ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రథమ సంవత్సరంలో అటామిక్ స్ట్రక్చర్, క్లాసిపికేషన్ ఆఫ్ ఎలిమెంట్స్, పీరియడిసిటీ , కెమికల్ బాండింగ్, స్టేట్స్ ఆఫ్ మ్యాటర్, ఆర్గానిక్ కెమిస్ట్రీ తో పాటు కెమికల్ ఈక్వేషన్స్‌పై పట్టు సాధించాలి . ఫలితంగా సదరు సమస్యకు సంబంధించి ప్రాథమిక భావనలనపైనా పట్టు సాధించేందుకు ఆస్కారం లభిస్తుంది.

ఆంగ్లం: రెండవ సంవత్సరంలో రీడింగ్ కంప్రెహెన్షన్, లెటర్ రైటింగ్, సివి, ఫామ్స్ పూరించుట, టెక్ట్స్ బుక్ నందలి అభ్యాసాలు మీద దష్టి సారించాలి.
మొదటి సంవత్సరం గ్రామర్ అంశాలు ఫోనేటిక్స్, సిలబుల్స్, టెక్ట్స్ బుక్ పాసేజస్, అభ్యాసాలు, ఉదాహరణలు, పాఠ్యాంశాల రచయిత వివరాలు సమగ్రంగా నేర్చుకుంటే మంచి మార్కులు సాధించొచ్చు.

తెలుగు, హిందీ, సంస్కతం సబ్జెక్ట్స్ సంబంధించి వ్యాకరణాంశాలు, లేఖా రచన, ముఖ్యమైన పద్యాలకు భావార్థాలు, అన్ని పాఠ్యాంశాల సారాంశాలు అవగాహన కలిగి ఉండాలి.మొదటి సంవత్సరం గ్రామర్ అంశాలు ఫోనేటిక్స్, సిలబుల్స్, టెక్ట్స్ బుక్ పాసేజస్, అభ్యాసాలు, ఉదాహరణలు, పాఠ్యాంశాల రచయిత వివరాలు సమగ్రంగా నేర్చుకుంటే మంచి మార్కులు సాధించొచ్చు.

బోటనీ: ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మొక్కలలో ప్లాంట్ ఫిజియాలజీ, బయో టెక్నాలజీ, ఆహారోత్పత్తిని పెంచే విధానాలు, ప్రథమ సంవత్సరంలో డైవర్సిటీ ఇన్ ద లివింగ్ వరల్డ్, మొక్కలలో పునరుత్పత్తి,సెల్ స్ట్రక్చర్ అండ్ ఫంక్షన్స్ లాంటి అంశాలు, పటాలు వేయటంపై దృష్టిసారించాలి.

జువాలజీ : వక్ష శాస్త్రంలో ద్వితీయ సంవత్సరం హ్యూమన్ ఎనాటమీ అండ్ ఫిజియాలజీ , జెనెటిక్స్, ప్రథమ సంవత్సరంలో స్ట్రక్చరల్ ఆర్గనైజేషన్ ఇన్ ఆనిమల్స్, యానిమల్ డైవర్సిటీ, బయాలజీ ఇన్ హ్యూమన్ వెల్ఫేర్, ఎకలజీ అండ్ ఎన్విరన్మెంట్, చిత్ర పటాల సాధన బాగా చేయాలి.

ఇలా చేస్తే సదరు అంశాలకు సంబంధించి ప్రాథమిక భావనలపైనా పట్టు సాధించేందుకు ఆస్కారం లభిస్తుంది.

సమయపాలన : విద్యార్థులు పరీక్షల కోసం రీ రివిజన్ ప్రిపరేషన్‌కు సరైన ప్రణాళికతో ముందుకు సాగాలి. పాఠ్యాంశాల్లో అధిక, తక్కువ ప్రాధాన్యత ఇచ్చే అంశాలను గుర్తించాలి.

విజువల్ లెర్నింగ్ : చదివే విషయాన్ని విజువలైజేషన్ చేసుకుంటే సులభంగా గుర్తుంటుంది. ఈ రూపంలో గుర్తుకు తెచ్చుకునే విధంగా మైండ్ మ్యాపింగ్ చేసుకోవచ్చు. సంక్లిష్ట పాఠాలను ఇలా సులభంగా గుర్తుపెట్టుకోవచ్చు.

క్లిష్ట భావనలపై కేంద్రీకరణ : క్లిష్ట భావాలను సులభంగా అర్థం చేసుకోవటానికి ఫ్లాష్‌కార్డ్ అంటారు. తక్కువ సమయంలో ఎక్కువ కాన్సెప్ట్‌లు గుర్తించుకోవచ్చు. పేపర్‌పై అంశాలను రాయటం, తద్వారా టెస్ట్ చేసుకోవటం ఈ పద్ధతి. ఇలా చేయటం వల్ల సమాచారం రీ కలెక్ట్ అవుతుంది.



- దేసు జయశంకర్
పోస్టుగ్రాడ్యుయేట్ టీచర్ (పిజిటి), ఎపి మోడల్ స్కూల్, జూనియర్ కళాశాల, పెదకొమిర, గంపలగూడెం మండలం, ఎన్‌టిఆర్ జిల్లా.

రివైజ్ చేయడం : పాఠాలు వినే సమయంలో నోట్ పక్కన ఖాళీ కాలమ్‌ను ఉంచుతూ యాక్టివ్ నోట్ టేకింగ్‌ను ప్రోత్సహిస్తూ తరువాత మరోసారి సమాచారాన్ని గ్రహించటానికి రివైజ్ చేయటానికి స్వయంగా టెస్ట్ చేసుకోవటం సబ్జెక్టు భావనపై అవగాహనలో వ్యత్యాసం ఎక్కువ ఉందో అంచనా వేయటానికి కార్నెల్ నోట్ టేకింగ్ పద్ధతి సహాయపడుతుంది.

పరీక్షల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ఆందోళన వద్దు
- మానసిక ప్రశాంతత అవసరం
- తీరిక దొరికినప్పుడల్లా కళ్లు మూసుకుని రిలాక్సు ఇవ్వండి.
- కాసేపు ధ్యానం కూడా చేసుకోవచ్చు
- కేవలం గైడ్స్ మీదనే ఆధారపడకుండి.
- టెక్ట్‌బుక్స్‌ను కూడా రిఫర్ చేస్తూ చదవాలి
- బట్టీ పద్ధతి వద్దే వద్దు
- సబ్జెక్టు అంశాలు పాయింట్స్ వారీగా రాసుకోవాలి
- నోట్‌బుక్‌ను పాలో అవ్వటం మంచిది
- ఎక్కడికి వెళ్లిన నోట్స్ రాసిన బుక్ వెంట తీసుకెళ్తే తీరిక సమయంలో మననం చేసుకోవచ్చు.
- మంచి పౌష్టికాహారాన్ని తీసుకోవాలి
- స్ట్రీట్‌ఫుడ్, కడుపుబ్బరం కల్గించే మసాలాలు, చిరుతిండ్లు తినొద్దు
- తాజా పండ్లు, పండ్ల రసాలు, పాలు తీసుకోవాలి
- వేకువ జామునే నిద్రలేచి చదువుకోవటం మంచిది
- ప్రతిరోజూ సబ్జెక్టుల నమూనా ప్రశ్నాపత్రాలను సాల్వ్ చేయటం ఎక్కువగా ప్రాక్టీస్ చేయాలి
- పరీక్ష సమయానికి అనుగుణంగా మోడల్ పేపర్లు పూర్తిచేయటానికి నిరంతరం ప్రయత్నించాలి
- రాత్రిళ్లు త్వరగా నిద్రపోవాలి
- తెల్లవారుజామున లేవాలి
- ప్రతిరోజూ కాసేపు వ్యాయామం చేయటం మంచిది
- నడిచినా మెదడు చురుగ్గా పనిచేస్తుంది
- టైమ్‌టేబుల్‌కు అనుగుణంగా దినచర్య ఉండేలా చూసుకోవాలి. క్రమపద్ధతిలో పరీక్షలకు సన్నద్ధం కావాలి
- సందేహాల నివృత్తికి లెక్చరర్లతో మాట్లాడటం మేలు.
- పరీక్షలకు సంబంధించిన రూమర్లు నమ్మొద్దు

మహిళా పాత్రలపై చిన్నచూపెందుకు?

సినీ పరిశ్రమలో కాస్టింగ్ కౌచ్ గత ఐదారు దశాబ్దాలుగా కొనసాగుతోనే ఉంది. అయితే ఇటీవల కొంతమంది ప్రముఖ నటీమణులు ఈ అంశంపై బహిరంగంగా మాట్లాడుతుండటంతో పరిశ్రమలోని డొల్లతనం బయటపడుతోంది. ఇండస్ట్రీలో వేతనాల్లో అసమానతలు, మహిళలనే వివక్ష, కథానాయకుల రెమ్యూనరేషన్‌తో పోలిస్తే అసమానతలు వంటివి ఉన్నాయి. అయితే మహిళా నటులు తమ హక్కుల కోసం నిలబడటం, న్యాయపరమైన అవకాశాలను కోరుతుండటంతో కొంత మంది మద్దతు సైతం ఇస్తున్నారు.

సమాజంపై ప్రభావం చూపే కళారూపాల్లో ప్రధానమైన సినిమాలు ఇప్పుడు వ్యాపారాత్మకం అయ్యాయి. వాస్తవ జీవనాన్నీ, మానసిక సంఘర్షణ్నీ, సామాజిక స్థితిగతులను, సున్నితమైన స్పందనల్నీ వెండితెరపై చూడటం అరుదైపోయింది. ముఖ్యంగా మన తెలుగుసీమలో భారతీయ చలనచిత్ర రంగంలో రూపొందించే చిత్రాల్లో స్త్రీ ప్రధానమైన చిత్రాలు అనదగ్గవి నామమాత్రమేనని చెప్పొచ్చు. భారతీయ మహిళ వ్యక్తిత్వాన్నీ, జీవనశైలినీ, ఆలోచనా ధోరణినీ, మేథాసంపత్తిని తెలియజేసే సినిమాలే కాకుండా ఆమెను ఈ సమాజం ఎన్ని విధాలుగా దోపిడీ చేసిందో, చేస్తోందో చెప్పే చిత్రాలూ కొన్ని వచ్చాయి. భారతీయ సినిమా చరిత్రను గమనిస్తే మొదట్లో పురాణాల్లోని పతియే ప్రత్యక్ష దైవమనే స్త్రీమూర్తులే సినిమాల్లో ఎక్కువగా కనిపించేవారు. తరువాత కొద్దిగా మార్పులు వచ్చి స్త్రీని శక్తి స్వరూపిణిగా చిత్రీకరించారు. వితంతు పునర్వివాహాలు, మతాంతర వివాహాలు, వరకట్నం లాంటి సమస్యలను చర్చించడం, ఉద్యోగినులైన మహిళలు జీవిత చిత్రణ అటుపైన సినిమాలో చోటుచేసుకుంది. వివాహిత స్త్రీ అద్దె గర్భాన్ని అందించి వేరొకరి బిడ్డకు జన్మనిచ్చే సర్రొగేట్ మదర్ పాత్రల వరకూ తాజా సినిమాలు వచ్చాయి. చదువు, ఉద్యోగాల సమానత్వంతో ఉన్నా అన్ని రంగాల్లో రాణిస్తున్నా సినిమాల్లో పురుష పాత్రలకే ప్రాధాన్యత ఎక్కువగా ఉంటోంది. అయితే స్త్రీల సమస్యల్ని సీరియస్‌గా తీసుకొని చర్చించే కన్నా ఆమెను శృంగార వస్తువుగా చూపడమే ఇప్పటికీ ఎక్కువగా జరుగుతోంది. మహిళా కోణంలో నుంచి చూస్తే ఇంకా సాంఘిక, ఆర్థిక వివక్షలకు వ్యతిరేకంగా చైతన్యశీలమైన చిత్రాలు రావాల్సిన అవసరం ఉంది. కానీ అతి అశ్లీలంతో పాటలు, చిత్రీకరణలు చేస్తూ మహిళను వ్యాపార వస్తువుగా మార్చేస్తున్నారు.

విలువలేవీ?

మన సినిమాలు ఒకప్పటి క్లాస్ లుక్‌ని కోల్పోయి మాస్ మసాలా మాల్స్‌గా తయారవుతున్నాయి. విలువలు దిగజారిపోతున్నాయి. పక్క రాష్ట్రాలతో పోలిస్తే సినిమా రంగం సాహిత్య రూపాంతరీకరణలో సైతం కళాత్మక విలువల్ని అందిపుచ్చుకోలేకపోతోంది. లెక్కలేనన్ని శాటిలైట్ ఛానళ్లు, కేబుల్ టీవీలు, మినీథియేటర్లు, ఎఐ వంటివి ఇల్లు, బెడ్‌రూముల్లోకి చొచ్చుకుని వచ్చేయటంతో అంతర్జాతీయ మార్కెట్ దృక్పథంతోనూ, అశ్లీలం, మూఢనమ్మకాలను పెంచేలా టీవీ ఛానళ్లు ప్రజల ఖాళీ సమయాన్ని, ఆక్రమించాయి.

షూటింగ్‌ల్లోనూ వేధింపులు

షూటింగ్‌ల్లో తమకు కేటాయించిన వసతి గృహాల్లో ఒంటరిగా ఉండాలంటే మహిళా నటీమణులు భయపడుతున్నారు. ఎవరు ఎప్పుడు తాగి వచ్చి తలుపు కొడతారో అనే భయంతో స్నేహితులనో, బంధువులనో తోడు తెచ్చుకుంటున్నారు. తాము బస చేసిన హోటళ్లలో, షూటింగ్‌ల్లో ఉన్న మగవాళ్లు ఎక్కువసార్లు మత్తులో జోగుతూ తలుపులు కొడుతుండటం తెలిసిందే. ఇలాంటివి తరచూ మహిళలు ఎదుర్కొంటూనే ఉంటున్నారు. వాళ్లు తలుపులు బద్దలు కొట్టుకొని లోపలకి వచ్చి తమను ఏమైనా చేస్తారేమోనని చాలాసార్లు భయపడినట్లు పలువురు నటీమణులు బహిరంగంగా వెల్లడించిన ఉదంతాలు సైతం ఉంటున్నాయి. చిత్రీకరణకు ముందే హీరో, హీరోయిన్‌ను లైంగికంగా వేధించటం వంటివి కూడా వెలుగులోకి వస్తున్నాయి. నటించాలంటే కమిట్‌మెంట్ కావాలంటూ ముందే హుకుం జారీచేస్తున్న వారు సైతం ఇండస్ట్రీలో ఉంటున్నారు. లైంగిక వేధింపులకు గురైన నటీమణులు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు ముందుకు రావడం లేదు. తమతో పాటు తమ కుటుంబ సభ్యులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందనే భయమే దీనికి కారణం. సామాన్య మహిళలతో పోల్చితే సెలబ్రిటీ స్థాయిలో ఉన్నవాళ్లు ఎక్కువగా ఇలాంటి ఇబ్బందులు ఎక్కువగా ఎదుర్కొంటున్నారు. సైబర్ దాడులు సహా పలు రూపాల్లో వారిపై దాడి చేస్తున్నారు. తమ కుటుంబం పరువు పోతుందనే భయంతో పోలీసులకు ఫిర్యాదు చేయడం లేదు. కోర్టు, పోలీసులను ఆశ్రయిస్తే, ప్రాణహానితో పాటు కుటుంబం మొత్తం దారుణమైన పరిస్థితులు చవిచూడాల్సి వస్తుందని భయపడుతున్నారు.

పెద్దలు సైతం ఇదే వారసత్వం

సినిమా పరిశ్రమలో తాము పెద్దలమని చెప్పుకునే వారు సైతం లైంగిక వేధింపులకు గురిచేస్తుండటం చాలాసార్లు వెలుగులోకి వచ్చింది. ఇలాంటి ఆరోపణలు బాలకృష్ణ, మోహన్‌బాబు, నాని, మంచు విష్ణు, రాజశేఖర్ ఇలా చాలామందిపై ఫిర్యాదులు సైతం వచ్చాయి. బాలకృష్ణ అయితే బహిరంగ వేదికపైనే అమ్మాయి కనిపిస్తే ముద్దయినా పెట్టాలి, లేదా కడుపైనా చేయాలంటే దుర్మార్గంగా మాట్లాడేశారు. 'మజాకా' టీజర్ విడుదల సందర్భంగా దర్శకుడు త్రినాథరావు ఓ కథానాయిక శరీరాకృతి గురించి మాట్లాడిన తీరు, చేసిన అనుచిత వ్యాఖ్యలు చాలా జుగుప్సాకరంగా ఉన్నాయి. ఇదే వేదికపై ఉన్న సదరు కథానాయిక కన్నీటి పర్యంతమైన పరిస్థితిని గమనించొచ్చు.

గ్లామర్ పాత్రలకే పరిమితం

తెలుగు సినీ పరిశ్రమలో కొన్ని సందర్భాల్లో మహిళల పాత్రలను చిత్రీకరించే విధానంపై విమర్శలు వస్తూనే ఉన్నాయి. కొన్నింటిలో పరిపూర్ణ పాత్రలుగా కాకుండా కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం చేశారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. కొన్ని కమర్షియల్ సినిమాల్లో మహిళల పాత్రలకు తక్కువ ప్రాధాన్యత ఇంటోంది. కొన్ని సినిమాల్లో స్త్రీలను అసహాయంగా, సపోర్ట్ లేని వ్యక్తులుగా చూపిస్తూ పురుషులు వారిని రక్షించాల్సిన వ్యక్తులుగా చూపిస్తుండటంపైనా కూడా విమర్శలు వస్తున్నాయి. మాస్ సినిమాల్లో కథానాయకలు కేవలం పాటలు, రొమాంటిక్ సీన్లలో మాత్రమే ఉంచుతున్నారు. అవమానకరమైన డైలాగులు కూడా పెడుతున్నాయి. పెళ్లి చేసుకో, కిచెన్‌లోకి వెళ్లి కూరవండు వంటి డైలాగులు కించపర్చేవిగా పెడుతున్నారు. కొన్ని చిత్రాల్లో లైంగిక వేధింపులను హాస్యపరంగా చూపించటం, టీజింగ్‌ను సరదాగా ప్రదర్శించటం కూడా చూస్తున్నాం.

బలమైన పాత్రలు కొన్నే...

నెగెటివ్ కామెంట్స్‌ను దృష్టిలో పెట్టుకుని కొందరు దర్శకులు మహిళలకు బలమైన పాత్రలను కూడా ఇస్తున్నారు.
కీర్తిసురేష్-మహానటి, సమంతా-ఓ బేబీ,
కీర్తిసురేష్-మిస్ ఇండియా, అనుష్క-భాగమతి,
మిస్‌శెట్టి మిస్టర్ పోలిశెట్టి,
నయనతార-అరమాన్ వంటి చిత్రాలు కొంత ట్రెండ్‌ను మార్చేందుకు మంచి ప్రయత్నమే చేశాయి.

చైతన్యాన్ని రంగరించినవి ఇవే..

మహిళల వ్యథలు, వారు ఎదుర్కొంటున్న సమస్యలే ప్రధాన ఇతివృత్తంగా తెరకెక్కిన చిత్రాల్లో లాపతా లేడీస్, ఆల్ వుయ్ ఇమేజిన్ యాజ్ లైట్ వంటి చిత్రాలు కూడా ఉన్నాయి. భక్షక్, దో పత్తీ, ఆర్టికల్ 370, జిగ్రా, ఫిర్ ఆయీ హసీన్ దిల్ రుబా వంటి చిత్రాలు మహిళా ప్రాధాన్యతతోనే సాగాయి.

శతకంతో కదంతొక్కిన కోహ్లి

ఛేదనలో మొనగాడు విరాట్ కోహ్లి(100 నాటౌట్) చెలరేగాడు. ఛాంపియన్స్ ట్రోఫీలో డిఫెండింగ్ చాంపియన్, ఆతిథ్య జట్టు పాకిస్థాన్ కథ ముగిసింది. పాకిస్థాన్‌కు చావోరేవో తేల్చుకోవాల్సిన మ్యాచ్‌లో టీమ్ ఇండియా అదరగొట్టింది. బ్యాట్, బంతితో దుమ్మురేపిన భారత్.. 2017 చాంపియన్స్ ఫైనల్ పరాజయానికి బదులు తీర్చుకుంది. స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ (3/40), హార్దిక్ పాండ్య (2/31)తో విజృంభించగా తొలుత పాకిస్థాన్ 241 పరుగులకే కుప్పకూలింది. ఛేదనలో విరాట్ కోహ్లి అజేయ సెంచరీతో కదం తొక్కగా, శ్రేయస్ అయ్యర్ (56) అర్ధ సెంచరీతో రాణించాడు. మరో 45 బంతులు ఉండగానే భారత్ లాంఛనం ముగించింది. గ్రూప్-ఏ నుంచి భారత్ సెమీస్ బెర్త్ ఖాయం చేసుకోగా.. పాకిస్థాన్ మరో మ్యాచ్ ఉండగానే ఇంటిదారి పట్టింది.

అర్ధసెంచరీతో రాణించిన శ్రేయస్ • పాకిస్తాన్‌పై టీమిండియా అలవోక విజయం

దుబాయ్: చిరకాల ప్రత్యర్థి, దాయాది పాకిస్థాన్‌పై ఛేదనలో విరాట్ కోహ్లి (100 నాటౌట్, 111 బంతుల్లో 7 ఫోర్లు) అజేయ సెంచరీతో చెలరేగాడు. సవాల్‌తో కూడిన పిచ్‌పై సమయోచిత ఇన్నింగ్స్‌తో కదం తొక్కిన విరాట్ కోహ్లి వన్డేల్లో రికార్డు 51వ శతకం నమోదు చేశాడు. 242 పరుగుల లక్ష్యాన్ని 42.3 ఓవర్లలోనే పూర్తి చేసిన టీమ్ ఇండియా మరో 45 బంతులు మిగిలి ఉండగానే 6 వికెట్ల తేడాతో పాకిస్థాన్‌పై ఘన విజయం సాధించింది. ఈ ఓటమితో ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ నాకౌట్ రేసు నుంచి ఆతిథ్య జట్టు, డిఫెండింగ్ చాంపియన్ పాకిస్థాన్ నిష్క్రమించింది. గ్రూప్-ఏలో వరుసగా రెండో విజయంతో టీమ్ ఇండియా సెమీఫైనల్ బెర్త్ ఖాయం చేసుకుంది. శ్రేయస్ అయ్యర్ (56, 67 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్), శుభ్‌మన్ గిల్ (46, 52 బంతుల్లో 7 ఫోర్లు) రాణించారు. అంతకుముందు, తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ 49.4 ఓవర్లలో 241 పరుగులకు కుప్పకూలింది. సయిూద్ షకిల్ (62, 76 బంతుల్లో 5 ఫోర్లు), కెప్టెన్ మహ్మద్ రిజ్వాన్ (46, 77 బంతుల్లో 3 ఫోర్లు), ఖుష్దిల్ షా (38, 39 బంతుల్లో 2 సిక్స్‌లు) రాణించారు. భారత బౌలర్లు కుల్దీప్ యాదవ్ (3/40), హార్దిక్ పాండ్య (2/31) బంతితో అద్భుత ప్రదర్శన చేశారు. ఛేదనలో సూపర్ సెంచరీ సాధించిన విరాట్ కోహ్లి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. చాంపియన్స్ ట్రోఫీ గ్రూప్-ఏలో చివరి మ్యాచ్‌లో మార్చి 2న న్యూజిలాండ్‌తో భారత్ ఆడనుంది.

ఛేదనలో కింగ్ విరాట్

242 పరుగుల ఛేదనలో భారత్‌కు మంచి ఆరంభం లభించింది. కెప్టెన్ రోహిత్ శర్మ (20) సహజశైలిలో మూడు ఫోర్లు, ఓ సిక్సర్‌తో ధనాధన్ షో చేశాడు. శుభ్‌మన్ గిల్ (46) సూపర్ ఫామ్‌ను కొనసాగించాడు. షహీన్ షా అఫ్రిది బంతికి పవర్ ప్లేలోనే రోహిత్ నిష్క్రమించినా.. యువ ఓపెనర్ శుభ్‌మన్‌తో కలిసి విరాట్ కోహ్లి (100 నాటౌట్) ఛేదనను ముందుండి నడిపించాడు. పవర్‌ప్లేలో పదునైన పేస్‌ను ఎదుర్కొన్న కోహ్లి.. మిడిల్ ఓవర్లలో స్పిన్‌తో పాక్ కవ్వించినా సహనంతో బ్యాటింగ్ చేశాడు. దూకుడుగా ఆడే ప్రయత్నం చేయకుండా పరుగుల వేటపై దృష్టి నిలిపాడు. ఒక్కో పరుగు జోడిస్తూ స్కోరు బోర్డును కదిలించాడు. కోహ్లి, గిల్ జోడీ రెండో వికెట్‌కు 69 పరుగులు జోడించి భారత్‌ను మూడంకెల స్కోరుకు చేర్చింది.

శ్రేయస్ అయ్యర్ (56)తో జతకట్టిన విరాట్ కోహ్లి మూడో వికెట్‌కు ఏకంగా 114 పరుగులు జోడించాడు. అయ్యర్, విరాట్ భాగస్వామ్యం మ్యాచ్‌ను టీమ్ ఇండియా వశం చేసింది. అయ్యర్ కాస్త దూకుడుగా ఆడినా.. విరాట్ కోహ్లి సహనం కోల్పోలేదు. నాలుగు ఫోర్లతో 62 బంతుల్లో అర్ధ సెంచరీ సాధించిన కోహ్లి.. మరో మూడు ఫోర్లతో 111 బంతుల్లో కెరీర్ 51వ వన్డే సెంచరీ సాధించాడు. శ్రేయస్ అయ్యర్ నాలుగు ఫోర్లు, ఓ సిక్సర్‌తో 63 బంతుల్లో అర్ధ సెంచరీ అందుకున్నాడు. ఇమామ్ ఉల్ హాక్ సూపర్ క్యాచ్‌తో శ్రేయస్ అవుటైనా.. అక్షర్ పటేల్ (3 నాటౌట్) తోడుగా కోహ్లి లాంఛనం ముగించాడు. హార్దిక్ పాండ్య (8) ఓ బౌండరీతో మెరిశాడు. ఖుష్దిల్ షా ఓవర్లో బౌండరీ బాదిన కోహ్లి భారత్‌కు గెలుపుతో పాటు శతకం సైతం అందుకున్నాడు. పాక్ బౌలర్లలో అఫ్రిది (2/74), అబ్రార్ (1/28) రాణించారు.

మెరిసిన కుల్దీప్, హార్దిక్..

భారత బౌలర్లు కుల్దీప్, హార్దిక్ సమిష్టిగా రాణించారు. ఇమామ్ ఉల్ హాక్ (10), బాబర్ (23)లు త్వరగా అవుటైనా.. సయిూద్ షకిల్ (62), మహ్మద్ రిజ్వాన్ (46)లు మూడో వికెట్‌కు సెంచరీ భాగస్వామ్యం నెలకొల్పి పాక్ ఇన్నింగ్స్‌ను నిలబెట్టారు. కుల్దీప్ మూడు వికెట్లు పడగొట్టగా.. హార్దిక్ రెండు వికెట్లు తీసుకున్నాడు. బంగ్లాదేశ్‌పై ఐదు వికెట్లతో సత్తా చాటిన మహ్మద్ షమికి ఈ మ్యాచ్‌లో ఒక్క వికెట్ కూడా దక్కలేదు.

స్కోర్‌బోర్డు...

పాకిస్తాన్ ఇన్నింగ్స్: ఇమామ్-ఉల్-హక్ (రనౌట్)అక్షర్ 10, బాబర్ (సి)రాహుల్ (బి)హార్దిక్ 23, షౌద్ షకీల్ (బి)అక్షర్ (బి)హార్దిక్ 62, రిజ్వాన్ (బి)అక్షర్ 46, అఘా సల్మాన్ (సి)జడేజా (బి)కుల్దీప్ 19, తాహిర్ తయ్యబ్ (బి)జడేజా 4, ఖుష్‌దిల్ (సి)కోహ్లి (బి)హర్షిత్ రాణా 38, షాహిన్ అఫ్రిది (ఎల్‌బి)కుల్దీప్ 0, నసీమ్ షా (సి)కోహ్లి (బి)కుల్దీప్ 14, రవూఫ్ (రనౌట్)అక్షర్/రాహుల్ 8, అబ్రార్ అహ్మద్ (నాటౌట్) 0, అదనం 17. (49.4ఓవర్లలో ఆలౌట్) 241పరుగులు. వికెట్ల పతనం: 1/41, 2/47, 3/151, 4/159, 5/165, 6/200, 7/200, 8/222, 9/241, 10/241 బౌలింగ్: షమీ 8-0-43-0, హర్షిత్ రాణా 7.4-0-30-1, హార్దిక్ 8-0-31-2, అక్షర్ 10-0-49-1, కుల్దీప్ 9-0-40-3, జడేజా 7-0-40-1.

భారత్ ఇన్నింగ్స్ : రోహిత్ శర్మ (బి) షహీన్ అఫ్రిది 20, శుభ్‌మన్ గిల్ (బి) అబ్రార్ అహ్మద్ 46, విరాట్ కోహ్లి(నాటౌట్) 100, శ్రేయస్ అయ్యర్ (సి) ఇమామ్ ఉల్ హాక్ (బి) ఖుష్దిల్ షా 56, హార్దిక్ పాండ్య (సి) రిజ్వాన్ (బి) షహీన్ అఫ్రిది 8, అక్షర్ పటేల్(నాటౌట్) 3, అదనం 11. (42.3 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి) 244 పరుగులు. **వికెట్ల పతనం :** 1-31, 2-100, 3-214, 4-223. **బౌలింగ్ :** షహీన్ అఫ్రిది 8-0-74-2, నసీం షా 8-0-37-0, హరీశ్ రవూఫ్ 7--0-52-0, అబ్రార్ అహ్మద్ 10-0-28-1, ఖుష్దిల్ షా 7.3-0-43-1, సల్మాన్ ఆఘా 2-0-10-0.

ఛాంపియన్స్ ట్రోఫీ పాయింట్ల పట్టిక

గ్రూప్-ఎ	ఆ	గె	ఓ	పా	నె.ర.
భారత్	2	2	0	4	+0.64
న్యూజిలాండ్	1	1	0	2	+1.20
బంగ్లాదేశ్	1	0	1	0	+0.40
పాకిస్తాన్	2	0	2	0	+1.08
గ్రూప్-బి					
దక్షిణాఫ్రికా	1	1	0	2	+2.14
ఆస్ట్రేలియా	1	1	0	2	+0.47
ఇంగ్లండ్	1	0	1	0	-0.47
ఆఫ్ఘనిస్తాన్	1	0	1	0	-2.14

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68